
# కథామంజరి


## పది కథల సమాహారం



సెప్టెంబర్ 2024

# కథామంజరి

## పది కథల సమాహారం




కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**సెప్టెంబర్ 2024**

సంపుటి : 5 ♦ సంచిక : 9



# కీ.శే. కందాళ యస్. తిలక్

(భారతదేశ మొదటి పార్లమెంటు సభ్యులు)

పేరిట ఈ నెల సంచికకు ఆర్ధిక వనరులు చేకూర్చిన

**కె.యస్. తిలక్ ఫౌండేషన్, విజయనగరం**

వారికి మా హార్దిక ధన్యవాదాలు.



# బాలకథ

జులై నెల సంచిక నుంచి ప్రతీ నెలా కథామంజరిలో, పిల్లల కథలు రెండు ప్రచురింపబడతాయి! ఈ కథల విషయమై చిన్న సూచనలు:

- 10-16 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న పిల్లలు స్వయంగా ఆలోచించి, వారికున్న ఆలోచనలకి అక్షర రూపం ఇవ్వాలి. కథాంశం ఏదైనా వ్రాయవచ్చు. పిల్లలు ఇష్టపడే కథలు, పిల్లలు అర్థం చేసుకునే స్థాయిలో కథారచన ఉండాలి.
- 400 పదాలకు మించకుండా ఇలా వర్డ్‌లో టైపు చేసి పంపాలి!
- కథ ఎలా వ్రాసినా సరే, ప్రచురణకు స్వీకరించే కథలను తగు రీతిలో మార్పులు, చేర్పులు చేసి ప్రచురణ చేయబడతాయి!
- పెద్దవారు కూడా పిల్లల కథలు వ్రాసి పంపవచ్చును. అవి కూడా ప్రచురణకు తీసుకోబడతాయి!
- పెద్దవారు వారి కథలను పిల్లల పేరుతో వ్రాసి పంపడం అనైతికమే కాకుండా, మా ఈ ప్రయత్నాలకు ఆశించిన ఫలితాలు దక్కకుండా చేస్తాయి!
- ప్రచురింపబడే కథలకు తగిన పారితోషికం కూడా ఉంటుంది!
- కథలు పంపవలసిన మా ఇమెయిల్: submit@kathamanjari.in

కథలు వ్రాయగలిగే పిల్లల్ని ప్రోత్సహిస్తూ, వాళ్ళల్లో సృజనాత్మకతకు పదును పెట్టే మా ఈ ప్రయత్నాలలో అందరి సహాయ సహకారాలను అందించ కోరుతున్నాం!



* * *

**కథామంజరి బృందం**



# మా జట్టు

సంపాదకుడు
జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త
అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం
ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నందూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం
ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం
Harbinger Publishing

బొమ్మలు
కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**

# ఇదీ వరుస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | ... ... ... ... ... ... | i |
| విశిష్ట అతిథి | ... ... ... ... ... ... | iii |
| కథామార్గదర్శి | ... ... ... ... ... ... | v |
| కథా పరిచయం | ... ... ... ... ... ... | vii |
| వినదగునెవ్వరు చెప్పిన .. | ... ... ... ... ... ... | ix |


## కథలు, వ్యాసాలు


| | | | |
|---|---|---|---|
| మనసు నేర్చుకున్న పాఠం | ... | ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్ ... ... | 1 |
| స్వర్గాదపి గరీయసీ! | ... | పాణ్యం దత్తశర్మ ... ... ... | 6 |
| ఋణం | ... | రాపాక కామేశ్వర రావు ... ... | 12 |
| ఏమున్నది తేడా? | ... | వెంకటమణి ఈశ్వర్ ... ... | 18 |
| కూలుతున్న గోడలు | ... | డా. మామిడాల శైలజ ... ... | 25 |
| ప్రయాణం... | ... | కాళీపట్నపు పేర్రాజు ... ... | 33 |
| కళ కళే కదా! | ... | కంచనపల్లి వెంకట కృష్ణారావు ... | 39 |
| స్నేహితుల గొడవ | ... | ఓట్ర ప్రకాష్ రావు ... ... ... | 41 |
| నేనూ-ఇంపోర్టెడ్ కెమేరా | ... | మల్లిక్ ... ... ... ... | 43 |
| రిక్షా అప్పారావు కొడుకు | ... | ఎ.ఎస్.వి. రమణారావు ... ... | 54 |


Cover Page Credit : Vika Glitter, Victoria AU

# కథాకీయం

ఈ మధ్య ఓ ప్రముఖ సాహితీవేత్త తెలుగుభాష గురించి మాట్లాడుతూ, మరో రెండు వందల సంవత్సరాల నాటికి చాలా భాషలు మృతభాషలైపోతాయని, అందులో తెలుగుభాష కూడా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేసారు. అప్పటికీ కొంత మాట్లాడగలిగేవారున్నా, లిపి మరుగున పడిపోతుందని కూడా ఆయన అన్నారు. ఈ విషయంలో ఏ భాషవారైనా, పక్కవాడికి అతని మాతృభాష పట్ల ఉన్నంత అభిమానం, గౌరవం, శ్రద్ధ.. మనకి లేదని ఎవరికి వారు అనుకుంటూ ఉంటారు. "నిజానికి భారతదేశ ప్రాంతీయ భాషలన్నింటి పరిస్థితీ ఇంచుమించుగా ఒక్కలాగే ఉంది. విభిన్న సంస్కృతులు, భాషలు, అలవాట్లు, రీతులు, ధర్మం, నీతినియమలతో ఎంతో విలువైన ఇతిహాసల చరిత్ర దన్నుగా ఉన్న దేశం భారతదే-శం. ఆ దేశాన్ని గెలవలంటే అంత సులువు కాదు. వారితో పోరాటం చేసి గెలవడం అసాధ్యం. కానీ, అక్కడ ప్రజలని.. వారి సంస్కృతి, భాషా సంపదల నుంచి దూరం చేసిననాడు విజయం ఆసుగా మనల్ని వరిస్తుంది. మనముందు ఉన్న కర్తవ్యం ఇదే!" అంటూ ఎప్పుడో రెండు వందల సంవత్సరాల క్రిందట అప్పటి బ్రిటిష్ పార్లమెంటులో ఓ సభ్యుడు అన్నాడుట! అయితే వారు వేసిన బీజం వలననా, లేదా స్వయంకృతమా అన్న విషయం పక్కన పెడితే, నేడు మనం సుమారుగా ఓడిపోయి, భారతీయతకి దూరంగా జరిగిపోతున్నాం!

ఈ పరిస్థితి నుంచి రక్షించుకోవడం ఎలా అంటే.. మన ముందు ఉన్న ఒకే ఒక్క ఆయుధం.. అతి ముఖ్యమైన భాషాసంప-దని కాపాడుకోవడమే! అదే మిగతా వాటిని రక్షిస్తుంది.

అయితే... ఏం చేయ్యాలి, ఏం చేయగలమూ.. అనే ప్రశ్నలకు జవాబు మేధావులు, శాస్త్రజ్ఞులే ఆలోచించి చెప్పవలసిన అవసరం లేదు. అతి సామాన్యుడి దగ్గర ఆయుధం ఉంది. అది చదువు! ముఖ్యంగా పుస్తకాలకి దూరమై, శ్వాస నుంచి శ్మశానం వరకు అంతర్జాలం మీద ఆధారపడుతున్నారు! అంతర్జాలం చూడటం తప్పు కాదు, కానీ పరిధి ఉండాలి. ఈ రోజుల్లో అంతర్జాలం చాలా అందుబాటులో సౌకర్యంగా ఉంది. వాడుక తప్పనిసరి కూడా! అయితే పై పై విషయాలను మాత్రమే చదివి, మూలాలను విస్మరిస్తున్నారు. క్షుణ్ణంగా ఏ విషయమైన తెలుసుకోవాలంటే, వాటి మూలాలైన పుస్తకాలు చదవాలి. అవి ఈ రోజులలో అంతర్జాలంలో కూడా లభ్యమవుతున్నాయి. ఈ తరం వార్ని, వచ్చే తరాల వారిని పుస్తకాలు వైపు నడిపించాలి. ఆ మూలాలు వారికి తెలిసేటట్టు చేయాలి! ఆ కాస్త శ్రమ.. ఎంతో ఫలితాన్ని అందిస్తుంది.


నిరక్షరాశ్యత బాగా తగ్గిందనే చెప్పాలి గాని, రోజు రోజుకి ఆ అక్షర విలువలకు దూరం అవుతున్నాం. విజ్ఞానంతో పాటు విజ్ఞత కూడా ఇచ్చేదే పుస్తకం! పుస్తకం హస్త భూషణం మాత్రమే కాదు, ఆ పుస్తక పఠనం కూడా అవశ్యం! ఆ కోవలో 'కథామంజరి' ఆలోచించి.. పుస్తకాలు చదివించాలి, కథలు చదివించాలి, కథలు వ్రాయించాలి, మన భాషని, సంస్కృతిని, నేటి స్థితిగతులని.., రేపటి తరానికి అందించాలనే ఆశయాలతో శ్రమిస్తోంది. ఎంతోమంది మాతో ఉండి, అన్ని విధాల ప్రోత్సాహం ఇస్తున్నారు. ఇది సరిపోదు, ఇంకా ముందు ఎన్నో ఎత్తుపల్లాలు ఉన్నాయి. వాటిని అధిరోహించాలంటే...

"పాఠకులు, రచయితలు, అభిమానులు.. అందరూ తలో చెయ్యి వేయాలి.
మీ మీ పరిధిలో ఉన్న మరో పదిమందికి 'కథామంజరి' పంపి వారిచేత చదివించండి.
వారిని 'కథామంజరి' సమూహంలో చేర్చండి. అలా కాకుండా..
మీకు నచ్చిన కథనో, మీ కథనో వేరు చేసి, మీకు తెలిసిన వారికి పంపడం చేయకండి.
ఆ చర్య ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం చేచేతులరా చేసినట్టే అని అనిపిస్తుంది.
ఆ చర్య వలన మన ఆశయం కూడా చితికిపోతుంది.
కథామంజరినే కాదు, ఏ పుస్తకమైనా సరే, ముక్కలు చేయకండి.
కనీసం ఆ ఒక్క కథో, మరో విషయమో వారు చదివినా, పుస్తకం వారి చేతిలో ఉంటుందనే సత్యం
మనం గ్రహించాలి. ఇవాళ కాకపోతే రేపైనా ఓసారి తిరగవేస్తారు.
తప్పకుండా ఈ చిన్న పని.. మన ఆశయసాధనకు చేయుతనిస్తుంది."

ఇది మా ఒక్కరి ఆవేదన కాదు, ఎంతో మంది ఆవేదన! భాషని, సంస్కృతిని కాపాడుకోవలనే తపన!

**సంపాదకుడు**

## ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక



సుమారు నూటపదిహేను సంవత్సరాల క్రిందట బొంబాయి నగరం నుండి ప్రారంభింపబడిన తెలుగు పత్రిక "ఆంధ్ర సచిత్ర వారపత్రిక". అసలు ఓ తెలుగు పత్రిక బొంబాయి మహానగరం నుండి వెలువడటం చాలా అనితర సాధ్యమైనది. అలాంటిది.. అమృతాంజనం సృష్టికర్త శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు తెలుగుభాష మీద మమకారంతో ఈ పత్రిక స్థాపించారు. తెలుగునాట నుండి... పత్రిక ముంద్రించడానికి అవసరమయే ఉద్యోగులను ఎక్కువ జీతాలు ఇచ్చి తీసుకువెళ్ళారు. వార్తాపత్రిక ఆరంభం తర్వాత వారపత్రికని ప్రారంభించి, ఆది నుండే కథలకి ప్రోత్సాహం ఇచ్చి, ఎందరో రచయితలను తెలుగు సాహితీలోకానికి పరిచయం చేయడమే కాకుండా, వారిని శ్రేష్ఠులుగా గుర్తించటానికి కృషి చేసింది. తెలుగు కథారచయితలకి ఆంధ్రపత్రికలో కథ ప్రచురింపబడటం.. ఓ ప్రత్యేక గుర్తింపుగా ఉండేది. కథలతో పాటు సీరియల్స్, సాహితీ వ్యాసాలు, కవితలు, సినిమా విశేషాలు, రాజకీయ విశ్లేషణలు, కార్టూన్లు.. ఒకటేమిటి అందరిని ఆకట్టుకునే అన్ని శీర్షికలతో పత్రిక అందుబాటు ధరలో లభ్యమయ్యేది. నాగేశ్వరరావు పంతులుగారి తర్వాత, శివలెంక శంభుప్రసాద్ గారు సంపాదకులుగా ఉండేవారు. 1910లోనే ఉగాది ప్రత్యేక సంచిక ప్రారంభించిన ఘనత కూడా ఆంధ్రపత్రికకే దక్కింది.

తెలుగు వారపత్రికలలో ఓ చరిత్ర సృష్టించిన ఈ పత్రిక 1990 లో మూతపడింది.

## విశిష్ట అతిథి



**శ్రీ మల్లిక్**

ఏ భాషలోనైనా హాస్యానికి ఓ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఎంత పెద్దవారినైనా సరే హాస్యం కదిలిస్తుంది. ఆహ్లాదపరుస్తుంది. సీరియస్‌గా ఉండే వారు కూడా, హాస్యాన్ని ఇష్టపడతారు. అసలు జీవితంలో హాస్యం ఉండాలనేది నిర్వివాదాంశం. అంతేకాదు, నవ్వు నాలుగు విధాల చేటు కాదు, నాలుగు విధాల ఉపయోగం అని నేటి శాస్త్రజ్ఞులు కూడా చెప్తున్నారు. అలాంటి హాస్యంలో 1843 లో ఆరంభమైన కార్టూన్ (వ్యంగ చిత్రం) ప్రక్రియ, ఈ రోజు ప్రజలందరినీ అలరిస్తోంది. ఈ ప్రక్రియలో తెలుగు ప్రముఖులను చెప్పుకుంటే బాపుగారు అగ్రపీఠంలో ఉండేవారు. తర్వాత తరం వారిలో, తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపుతో స్వయం ప్రకాశంతో, అటు కార్టూనిస్టుగా, ఇటు రచయితగా ఐదు దశాబ్దాలుగా తెలుగువారిని నిత్యం అలరించే నవ్వుల రారాజు శ్రీ మల్లిక్ గారు. గీతలోనూ, రాతలోనూ 'మల్లిక్' మార్క్ సంపాందించారంటే.. వెనుక ఉండే కృషి, దృఢసంకల్పమే అని ఖచ్చితంగా చెప్పాలి. అంతటితో తన అభిలాషల్ని సరిపెట్టుకోలేదు. ఓ వైపు ఆంధ్రా బ్యాంకులో ఉద్యోగం చేస్తూ, సాహిత్యంతో పాటు, సితార్ నేర్చుకుని హిందుస్థానీ సంగీతంలో డిగ్రీ సాధించారు. కార్టున్లకే పరిమితం కాకుండా, కథలు, నవలలు, ధారావాహికాలు, నాటికలు, రేడియో నాటికలు, పాటలు, టీవీ సినిమా కథలు, మాటలు.. ఇలా అన్ని ప్రక్రియలో తన కలం ఝుళిపించారు.

మల్లిక్ గారు హైస్కూలులో చదివే రోజుల్లో ఖాళీగా కనబడే నోట్స్ పుస్తకాలలో బొమ్మలు వేయడం, పత్రికలో కనబడే కార్టూన్లను నిశితంగా గమనించి.. తన ఆలోచనలను కాగితాల మీద పెట్టడం, పుస్తకాలు చదవడం.. ఇవన్నీ ఆయన రచనావ్యాసంగానికి దారితీయించాయి. చెప్పాలంటే.. సుమారుగా కథ, కార్టూను మల్లిక్‌గారి కలం నుంచి ఒకేసారి పురుడు పోసుకున్నాయి.

మల్లిక్ గారు కేవలం హాస్య కథలకే పరిమితం కాలేదు. కలం చేపట్టిన కొత్తలో వీరి కథలన్నీ మధ్య తరగతి మందహాసాలే! మెరుపుల ముగింపులతో, పాఠకుల్ని ఆలోచనల్లోకి దింపుతాయి. వీరి ఐదు వందలకు పైగా కథలు వివిధ పత్రికల్లో వచ్చాయి. కథ సీరియస్సైనా, హాస్యమైనా... చురుక్కుమనిపించే సందేశం ఉంటుంది. తెలుగువారి జీవన సౌందర్యం, జీవనశైలి, సహజమైన సంభాషణలు, సంఘటనలు, సరళమైన భాష.. మల్లిక్‌గారి కథల్లో కనబడతాయి. ఇక పాత్రల చిత్రీకరణలో అటు కథలలో, ఇటు కార్టూన్లలో పాఠకుడికి, తన చుట్టూ కనబడే పాత్రలే సాక్షాత్కరిస్తాయి! అరమరికలు లేకుండా, సూటిగా, ధాటిగా... హృదయాన్ని హత్తుకు పోయే రీతిలో వీరి కథా కార్టూన్లు ఉంటాయి. తెలుగు పద సంపదలో సహజంగా కనబడే వ్యంగ్యాన్ని, మల్లిక్‌గారి అస్త్రాలుగా మార్చి రచనలలో అందిస్తారు. ఇదో గొప్ప చతురత! రాజమండ్రిలో పుట్టి, హైదరాబాదులో పెరిగి పెద్దై, అక్కడే అన్నీ ప్రస్థానాల్ని ఆరంభించి సాహితీ అజేయులుగా ఉన్న మల్లిక్‌గారి కథ,

కాలమ్, కార్టూన్లతోనే సగం పేజీలు నింపుకున్న పత్రికలు తెలుగువారికి సుపరిచితమే! యుక్తవయసులో వెండితెరకు రచయితగా వెళ్ళాలని ప్రయత్నాలు చేసినప్పుడు సఫలీకృతం కాలేదు గాని, పేరు గడించిన తర్వాత అవకాశాలు వాటంతటవే వెతుక్కుంటూ వచ్చాయి. అలా కొన్ని సినిమాలకు మాటసాయం చేసారు. టీవీ సీరియల్స్‌కి పాటలు వ్రాసి, స్వరకల్పన కూడా చేసిన మల్లిక్ గారు.. అంతర్జాలంలో కూడా తన రచనా పటిమను చూపెడుతూ, తెలుగువన్.కాం అనే వెబ్సైట్ కి ముఖ్య సంపాదకులుగా, తెలుగు వన్ టి.వి.కి కంటెంట్ హెడ్‌గా సేవలు అందిస్తున్నారు.

ముప్పై ఏళ్ళ వయసులో మల్లిక్ గారు వ్రాసిన "ఇంపోర్టెడ్ కెమెరా" అనే నాటిక, ఆల్ ఇండియా రేడియో వారు నిర్వహించే అఖిల భారత నాటకోత్సవాలలో ఎంపికై, అన్ని కేంద్రాలనుంచి ప్రసారం చేయబడింది. ఆ నాటిక ద్వారా పిన్న వయసులోనే చాలా గుర్తింపు వచ్చింది. పత్రికలలో సాధారణంగా సినిమా హీరో, హీరోయిన్ల ముఖచిత్రాలతో విడుదలవుతాయి. అలాంటి రోజుల్లో మల్లిక్‌గారి ఫోటో ముఖచిత్రంతో ఓ పత్రిక విడుదలవడం.. ఆయన పాపులారిటీకి నిదర్శనం.

ఆంగ్లభాషలో కూడా కార్టూన్లు వేసిన మల్లిక్‌గారి "చిట్టి, సిగ్గు సిగ్గు, హాట్ షాట్, మొగుడ్స్ పెళ్లమ్స్, టింగు.." వంటి కార్టూన్ ఫీచర్స్, " పరుగో పరుగు, రెడీమేడ్ మొగుడు, భళారే విచిత్రం.." వంటి నవలలు, స్టాండ్ అప్ కామెడీ యూట్యూబ్ విడియో షోలు, కొన్ని వందల స్కిట్స్‌తో పాటు, పదకొండు సంవత్సరాల పాటు ధారావాహికంగా ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురింపబడిన "నవ్వితే నవరత్నాలు" కథారత్నాలు... ఇలా ఎన్నో కథలు, కథానికలు తెలుగు పాఠకులను అలరించాయి.

కలం ఝుళిపిస్తే కథో కార్టూనో కాగితం మీద రాలి, తెలుగువారిని నవ్విస్తాయని అచ్చంగా హామీ ఇవ్వగల బహుముఖ ప్రజ్ఞావంతుడు శ్రీ మల్లిక్ గారు.. కోరిన వెంటనే ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు ఆయనకి ధన్యవాదాలు తెలుపుకుంటూ, మరో ఇన్ని 'నవ్వే' రత్నాలను చిరకాలం అందచేయాలని కోరుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**కీ.శే. ఏయస్వీ రమణారావు**

"పరిచయమయిన కొత్తలోనే "మీ కథలు ఇవ్వండి, చదువుతానని.." మొహమాటపెట్టి, తెప్పించుకుని చదివిన తర్వాత "ఈ కథలు చదవడానికి కష్టపడ్డాను. అంటే చదవడానికి కాదు, కథని జీర్ణం చేసుకోడానికి! వాక్కు, విషయ పరిజ్ఞానం, వచనాన్ని కూడా కవిత్వవాసనలో రచించగల నేర్పరితనం ఉండీ కూడా, మనం ఎన్నడూ చదవని పత్రికలకి ఈయన ఎందుకు రాసాడో..!" అని ఆ రచయిత గురించి ఏభై ఏళ్ల క్రిందట వాపోయారు భరాగోగారు. ఆ రచయిత ఎవరో కాదు.. ప్రముఖ కథా, నవలా, సినీ, టీ.వి. రచయిత కీ.శే. ఏయస్వీ రమణారావు అనబడే ఆలమూరు సూర్య వెంకట రమణారావు గారు.

బలీయమైన కథ, వ్రాసే విధానం, కథా వస్తువులో నూతనత్వం, చదివించగలిగే శైలి.. రమణారావుగారి కథల్లో కనబడతాయి. మన చుట్టూ కనబడే వక్ర సంఘటనల మీదా, వక్ర బుద్ధులున్న వ్యక్తుల మీదా చాలా కసితో కథలు వ్రాసారు. అలాగే జీవిత ఘటనలను మరో కోణంలో చూపిస్తూ, మంచి చెడులను ఎత్తి చూపెట్టే కథలను వ్రాసారు. "పరిహారం, రెండు తప్పులు, రిక్షా అప్పారావు కొడుకు, ప్రతీకారం, పన్నుగడ..." వంటి వీరి కథలలో సమాజంలో వక్రంగా కనబడే విషయాల మీద, చెడుగా ప్రవర్తించే మనుషుల మీద అక్షర దాడి కనబడితే, "పద్మవ్యూహం, జెయిల్లో చందమామ, కథావశిష్టులు, సంస్కారం.." కథల్లో మనుషుల జీవితాల్లో తొంగి చూసే మరెన్నో సన్నివేశాలు కనబడతాయి. రమణారావుగారి కథల్లో మధ్య తరగతి కుటుంబాల కదలికలు సాక్ష్యత్కరిస్తాయి. సమాజాన్నీ, దాని నమ్మకాలన్నీ అలవాట్లనీ మరో కోణంలో చూపించే కథలను అందించిన రమణారావుగారికి సినిమా రంగంతో కూడా కాస్త పరిచయం ఏర్పడి, కొన్నిసినిమాల వెనుక కలం చేసుకున్నారు. నాటకాల అనుభవంతో పాటు, జీవితంలో ఎదగడానికి ఎదుర్కున్న కష్టాల అనుభసారంతో.. రమణారావుగారి కలం చాలా పదునెక్కిందనే చెప్పాలి. దానికి తోడు విశాఖసాహితి సమావేశాల్లో దొరికిన ప్రోత్సాహం అందుకుని వర్ధమాన రచయిత నుంచి ప్రముఖ రచయిత దాకా ఎదిగారు. 1964 నుంచి కథలు, నవలలు వ్రాసిన రమణారావుగారి కథల్ని ప్రారంభ సంచికలలో, ప్రత్యేక సంచికలలో అభ్యర్తించి కూడా ప్రచురణలు జరిగాయి. చెయ్యి తిరిగిన రచయితగా ప్రముఖుల మన్ననలను పొందిన రమణారావుగారి చేతివ్రాత కూడా బావుండేది. నాటిక పోటీలకు న్యాయనిర్ణేతగా కూడా అనుభవం ఉన్న రమణారావుగారికి అటు సినిమా ప్రముఖులు, ఇటు ప్రముఖ రచయితల సాంగత్యం... అంతకు మించి వయో భేదం లేకుండా ఉండే స్నేహగుణం.. కష్టపడే మనస్తత్వం రమణారావు గారి వెలకట్టలేని ఆస్తులుగా చెప్పాలి.

1943 ఆగస్టు 4న విజయనగరం జన్మించారు. అక్కడే విద్యాభ్యాసం. తర్వాత అప్పటి మధ్యతరగతి కుటుంబాల్లో కనిపించే కష్టాలు పడి, విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఎంప్లాయీస్ కో–అపరేటివ్ సొసైటీలో ఉద్యోగం సంపాదించి, అక్కడే స్థిరపడ్డారు. చాలా కాలం విశాఖసాహితీలో ట్రజరర్‌గా, కార్యదర్శిగా కూడా సేవలు అందించారు. తన 22 ఏట నుండే కథా రచనలు చేసిన రమణారావుగారికి చాసో, చలం, శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి రచనలంటే చాలా ఇష్టం! తను అలా రాయాలనీ కూడా తలచేవారు. అయితే... ఆశువుగా మధ్యతరగతి కుటుంబ వాతావరణాన్ని కథనాలలో గుమ్మరించి, కథలని రక్తి కట్టించడం ఆయనకే దక్కింది. 1964లో తన మేనత్త జీవితాన్ని చూసి, చలించి మొట్టమొదట కథ "అంకితం" వ్రాసారు. తన 23వ ఏట తన మొదటి నవల "సుచరిత" నవజ్యోతి పత్రికలో ప్రచురణ జరిగింది. ఏభైకి పైగా కథలు, మూడు నవలలు, పలు టి.వి సీరియల్స్‌కి స్క్రిప్టులు.. రమణారావుగారి సాహితీసంపద. కొద్ది కాలం సినిమారంగంలో వివిధ విభాగాలలో కూడా పనిచేసారు. రమణారావుగారి "మెరుపుతీగ, మేడిపండు, కథావశిష్టులు, కళ్లు, పద్మవ్యూహం, జెయిల్లో చందమామ, సహజాతాలు.." వంటి కథలు, "ఈ తరం కథ, తలంబ్రాలు, అనూహ్య.." వంటి టి.వి. సీరియల్స్ బహు జనాదరణ పొందాయి.

అడగ్గానే, రమణారావుగారి వివరాలు ఇచ్చి, ఆయన గురించి ఎన్నో సంగతులు పంచుకున్న వారాబ్బాయి శ్రీ వీర్రాజుగారికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, సెప్టెంబరు2019 న మరణించిన రమణారావుగారిని చుట్టాలు, స్నేహితులు ఆయన్ని "చిరంజీవి" అని పిలిచేవారుట! నిజంగా ఆయన తెలుగు కథ ప్రపంచంలో ఓ "చిరంజీవి" గానే ఉంటారని భావిస్తూ, ఆయనకి నివాళి అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం.**

## కథా పరిచయం

## కీ. శే. పోరంకి దక్షిణామూర్తి గారి కథ "పొగడపూలు"

కథల మంచి, చెడ్డలకి బహుమతులు, అవార్డులు కొలామానం కాదు. ఓ కథ చదివిన తర్వాత.. ఓ తియ్యటి అనుభూతి, ఆనందం, దుఃఖం, కోపం, కసి, నవ్వు, నిస్సహాయత... ఇలా ఏదో ఒక భావన మేఘంలా పాఠకుడ్ని ఆవరించినప్పుడు, ఆ కథ చాల మంచి కథ అవుతుంది. ఆ కథ శైలి కావొచ్చు, కథనం, కథావస్తువు, శిల్పం.. ఏ అంశం అయినా సరే పాఠకుక డ్ని కుదిపిందంటే ఆ కథకి అదే అవార్డు. రచయిత పేర్లు గుర్తుండక పోయినా.. వారి కథలు గుండెలో గూడు కట్టుకుని ఉండిపోయాయి. రచయిత పేరుతో పాటు, వ్రాసిన అన్ని కథలు చిరస్థాయిగా నిలబడేలా రచనలు చేసిన, నాటి మేటి కథకుల్లో చెప్పుకోదగ్గ రచయిత కీ.శే.పోరంకి దక్షిణామూర్తి గారు. ఆయన కథలు చదువుతుంటే.. మధ్యలో "పొగడపూ–లు" కనబడింది. కథ విషయానికి వస్తే..

ఆ కథలో విశాలాక్షి ఇల్లాలు, రామారావు ఆవిడ భర్త. ఆమె ఓ రోజు సాయంత్రం పొగడపూల దండ కడుతూ భర్త కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఆ దండ  భర్తకి కనబడకుండా దాచి, ఊరించి ఊరించి, తర్వాత తల్లో పెట్టుకోవాలనుకుంది. రామారావు రాగానే నవ్వుతూ ఎదురు వెళ్తుంది విశాలాక్షి. కాని అతను నీరసంగా, బెంగగా కనపడ్డాడు. అతను బట్టలు మార్చుకుని వాలుకూర్చిలో కూర్చుంటే, ఆమె కాఫీ ఇస్తూ..'ఏమిటలా ఉన్నారంటూ' అడుగుతుంది. అతని మనసు బాగో–నప్పుడో, ఒంట్లో బాగోనప్పుడో, ఉద్యోగం బాగోనప్పుడో.. అలా ఉండటం ఉంటుంది. అతను బస్సు కండక్టరు. ఉద్యోగరీత్యా ఇబ్బందులు చాలా చూసిన అనుభవం అతనిది. రెండు మూడు సార్లు భార్య అదే ప్రశ్న అడిగేసరికి, ఇంట్లోకి వెళ్ళి ఓ పాకెట్ తెచ్చి, ఆమెకిస్తాడు. పాకెట్ లో ఓ స్వెట్టరు, ఓ ఉత్తరం ఉంటాయి. ఆ ఉత్తరాన్ని ఆమెనే చదవమంటాడు.

ఓ చెల్లెలు అన్నయ్యకి వ్రాసిన ఉత్తరం అది.

ఆ అన్నయ్య దగ్గర్నుంచి ఉత్తరాలు రావడం లేదనీ, వాళ్ళ అమ్మ కంగారు పడుతోందనీ, ఓవేళ అతనికి ఒంట్లో బావుండకతా పోతే, ఊర్లో ఉన్న డాక్టరుతో మాట్లాడి మందులు పంపుతాననీ వ్రాస్తుంది. ఓసారి కనీసం ఒక్క రోజైనా సెలవు పెట్టి, వస్తే మంచిదని రాస్తూ, అమాయకంగా.. అసలు "మీకు సెలవులు ఇవ్వరా, నిన్నసలు ఇంటికే పంపరా?" అంటూ రాస్తుంది. అలాగే తనకి పరీక్షల్లో స్కూలు ఫస్టు వచ్చిందని, ఈ నెలఖారులోగా స్కూలు ఫీజు కట్టకపోతే, పేరు తీసేస్తారనీ, ఇంటి అద్దె ఒక్కసారిగా పెంచేసారనీ, బియ్యం ధర కూడా పెరిగిపోయిందని రాస్తుంది. నువ్వు ఉద్యోగానికి వెళ్ళిపోయిన తరువాత, ఈ ఊరు చాలా మారిపోయింది. నువ్వు మిలట్రీలో చేరితే, ఇక్కడ వాళ్ళు యుద్ధం పేరు చెప్పుకుని లాభాలు చేసుకుంటున్నారు. అన్నట్టు ఇవన్నీ నీకు రాసేనని అమ్మకి తెలిస్తే, నన్ను చంపేస్తుంది. డబ్బు విషయం ఊరికే రాసాను. నువ్వేం ఇబ్బంది పడి పంపొద్దు. ఎలాగోలా సర్దుకుంటాంలే!" ఇలా వ్రాస్తూ చివర్లో ఓ విషయం రాస్తుంది. "ఓరే చిన్నన్నయ్యా.. మీ దగ్గర చలి ఎక్కువగా వుంటుంది కదా, మొన్న నీ కోసం స్వెట్టరు అల్లేను. రాత్రిళ్లు అది వేసుకుని పడుకో.. మంచులో తిరగొద్దని అమ్మ వ్రాయమంది. మరీ తప్పకపోతే దుప్పటి కప్పుకుని వెళ్ళమంది. మొన్న వానకి, పక్కింటి వాళ్ళ పొగడపూల చెట్టు పడిపో–

యింది. నీకు ఆ పూలంటే ఇష్టమని, ఎంత దేవుళ్లాడినా ఎక్కడా దొరకలేదు. ఏమి అనుకోకు.. ఇట్లు నీ చెల్లి, కమల” అంటూ ముగిస్తుంది.

విశాలాక్షి ఆ ఉత్తరం చదువుతుంటే రామారావు కళ్ళు మూసుకుని వింటాడు. ఆ పాకెట్ బస్సులో దొరికిందని, ఆ అమ్మాఆయికి పంపుదామంటే అడ్రసు లేదని, ఇంకేం చేయాలో తోచక తెచ్చేసానని అంటాడు. ఉత్తరం చదివిన ఆ భార్య కూడా చాలాసేపటి వరకు తేరుకోదు. ఏదో జ్ఞాపకం వచ్చి, లోపలికెళ్ళి పొగడపూలు తెచ్చి ఆ పాకెట్లో పోసి, భర్త చేతికి ఇస్తుంది. అతను ఆ పేకట్టుని జాగ్రత్తగా కట్టి, మిలట్రీ హెడ్ క్వార్టర్స్‌కి పంపుతూ, దాని మీద “కమల అనే చెల్లెలు గల చిన్నన్నయ్యకి ఇవ్వవలసింది!” అని రాస్తాడు.

ఇది కథ. ఓ ఉత్తర రూపంలో గుండె తడి చేసే కథాంశంతో నడిచిన కథ పాఠకుల్ని కట్టిపడేస్తుంది. కథలో అంతర్లీనంగా ప్రేమ, అనురాగం, కథలో చెప్పకనే తెలియచేసే విషాదం, ఇలా ఎన్నో విషయాలు కనబడతాయి. అసలు మిలట్రీ వాళ్ళ జీవితాలు అక్కడకి పోయి చదవక్కర్లేదు, ఓ పల్లెటూరిలో ఓ చిన్నమ్మాయి తనకు తెలిసిన పరిజ్ఞానంతో వ్రాసిన ఈ కథ చదివితే చాలు! సహజ వాతావరణంలో, మనింట్లోనో పక్కవారి ఇంట్లోనో జరిగినట్టు కనబడుతుంది. ఈ కథ “భారతి” మాసపత్రికలో వచ్చింది. ఇలాంటి కథల్ని జ్ఞాపకం ఉంచుకోడానికి పదేపదే చదవక్కర్లేదు. ఒక్కసారి చదివితే చాలు, గుండెల్లో గూడు కట్టుకుపోతాయి.

*పరిచయకర్త : జయంతి ప్రకాశ శర్మ*

*I know they will send freely if I opt for that. But my intention is to encourage the activity. They must be incurring some expenditure for recording and transmitting the documentary to us besides miscellaneous expenses which cannot be described.*

*If we pay the subscription, they will be enthused and encouraged and perform better and deliver more qualitatively.*

*The other side is I don't want anything free. All the services I get should be paid for. If we go to Daspalla we pay the bill for 1000/- or 2000/- without questioning. That is just for one time. Whereas, here we enjoy the whole year just for 200/-. If we go by car from RTC complex to Rishikonda and back we have to spend 300/- for petrol.*

*I have paid 6000/- towards life membership of our club also.*

**ఓ అభిమాన పాఠకుడు**

తల్లి చిరునామా.. కథ చాలా బాగా వ్రాసేరండి గాయత్రి గారు. తల్లీ కొడుకుల అనుబంధం చాలా సున్నితమైన అంశం. ఎంతో చక్కగా వివరణ చేశారు గాయత్రిగారు. రచయిత్రి భావాన్ని సుస్పష్టంగా వినిపించారు. సరస్వతి మేడం మీ voice modulation చాలా బావుంది అండి. కలం, గళం రెండూ కలసి ఒక దృశ్యకావ్యంలా అనిపించింది. కథను కళ్ళకు కట్టినట్టుగా వినిపించారు సరస్వతిగారు. తల్లి చిరునామా అనే ఈ కథను అందించిన ఇద్దరికీ ధన్యవాదములు.

**సుధారమణ పూడి పెద్ది**

ఎవరు అనాథలు? పేరు కోసం గొప్ప కోసం అనాథ శరణాలయాలకు చేసే సేవ నిజమైన పరమార్థ సేవ కాదు. కథ చాలా బాగుందండి పఠనం బాగుంది.

**వి. వి. సత్యప్రసాద్**

# మనసు నేర్చుకున్న పాఠం

ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

✆ 9849013002

***"ఆయన అందరితోనూ గొడవలేనండీ! అటు మా వాళ్ళు, ఇటు వాళ్ళ వాళ్ళు ఎవ్వరూ ఇంటికి రారు. నోరు మంచిది కాదండి. నిజం చెప్పాలంటే ఆ నాలుకకి నరం లేదండి. ఏది పడితే అది మాట్లాడుతారు. ఎవరిని పడితే వాళ్ళని తిట్టి పోస్తారు. పోనీ బ్యాంకులో వాళ్ళు ఏమైనా సహాయం చేస్తారా అంటే, అక్కడా అందరితో గొడవలే!***

ఆ రోజు ఉదయాన్నే "శాంతా! ఈ రోజు 'స్కేమోజ్ సెల్ కార్సినోమా' సర్జరీ ఉంది. పేషెంట్ నలభై అయిదేళ్ల బ్యాంకు ఉద్యోగి. అతను, అతని భార్య పదిహేను రోజుల క్రితం వచ్చారు. నాకు చూడగానే అనుమానం వచ్చింది. కేసు కొంచెం కాంప్లికేటెడ్‌గానే ఉంది. బాగా డిలే చేసి వచ్చారు!" అన్నాను నేను భార్య శాంతతో.

"మీరు ఆ టెక్నికల్ టర్మ్స్ వాడడం మానరు కదా?" అంది శాంత నవ్వుతూ.

"నువ్వు నా భార్యవి. అంటే అర్ధాంగివి. సగం డాక్టర్‌వి! ఇంకా నువ్వు మామూలు మనిషిలా మాట్లాడితే ఎలాగా?" అన్నాను నేను నవ్వుతూ.

"సరేలెండి. మీరు ఎప్పుడు అలాగే అంటారు" అంటూ మూతి ముప్పై మూడు వంకర్లు తిప్పింది శాంత.

"ఇలా నువ్వు చాలా ముద్దు వస్తున్నావోయ్" అన్నాను నేను, శాంత పెదాలపై నా చూపుడువేలు కదుపుతూ.

"చాలులెండి సంబడం." అంది శాంత, ప్రేమగా కసురుకుంటూ.

"అయినా కేసు డిలేడ్, కాంప్లికేటెడ్ కాకపోతే మీ దగ్గరకు ఎందుకు వస్తారు? వేరే డాక్టర్ దగ్గరికి వెళ్ళేవాళ్ళు. మీరేమో, ప్రపంచం అంతా మీదేననుకుని ఇరవైనాలుగు గంటలు, పేషెంట్స్, వాళ్ళ సేవల్లో మునిగిపోతారు. ఇంట్లో పెళ్ళాం, పిల్లలు ఉన్నారనే సంగతే మర్చిపోతారు." అంది శాంత.

"శాంతా, నీకు ఇంతకు ముందు ఎన్నోసార్లు చెప్పాను. మళ్ళీ చెపుతున్నాను... ఒక కాన్సర్ స్పెషలిస్ట్‌గా, పేషెంట్‌కి ట్రీట్మెంట్ చేసిన తరువాత, అతనికి ఇంతో, అంతో రిలీఫ్ వచ్చి, అతనిలో కనిపించే స్వస్థత లక్షణాలు, బాధనుంచి ఉపశమనం పొందుతామన్న ఆశ, అతని కుటుంబసభ్యుల కళ్ళల్లో కనిపించే ఆనందం, ఒక డాక్టర్‌గా, ఒక మనిషిగా, నాకు ఎంత తృప్తిని, సంతోషాన్ని కలిగిస్తాయో, నేను మాటలలో చెప్పలేను. భగవంతుడు, ఒక డాక్టర్‌గా, సాటిమనిషికి వైద్యం అందించి, వాళ్ళ బాధలను, వ్యధలను తగ్గించే అవకాశం, వాళ్ళ జీవితాలలో కొత్త వెలుగు, ఆశలు నింపే అవకాశం, కోట్లలో, కొంతమందికే ఇచ్చాడు. అటువంటి అదృష్టవంతులలో నేను ఒకడిని!" అన్నాను నేను.

"మీరు చెప్పింది కాదనను. కానీ మీరు కాస్త మమ్మల్ని కూడా పట్టించుకోవాలి కదా." అంది శాంత.

“అలా ఎందుకనుకుంటావు శాంతా! నాకు నా వృత్తి, నా కుటుంబం రెండు కళ్ళలాంటివి. అటువంటప్పుడు ఒక కంటికి ప్రాముఖ్యతనిచ్చి, రెండో కంటిని నిర్లక్ష్యం చేస్తానా! కాకపోతే భగవంతుడు నాకు ఇచ్చిన అవకాశం, బాధ్యతని నా శాయశక్తులా, నిర్వహించేందుకే నా ప్రయత్నం. ఆ ప్రయత్నంలో అప్పుడప్పుడు మీకు కేటాయించాల్సిన సమయం కాస్త తగ్గుతోందేమో. కానీ మిమ్మల్ని ప్రేమించడంలో, అభిమానించడంలో, మిమ్మల్ని నా పంచప్రాణాలుగా చూసుకోవడంలో, ఏ భర్తకీ, ఏ తండ్రికీ తీసిపోనని మాత్రం గుండెల మీద చెయ్యివేసుకుని చెప్పగలను!” అన్నాను నేను.




“అబ్బా! ఎందుకండీ ఏదేదో ఆలోచించేస్తారు? ఈరోజు మన పాప పుట్టినరోజు. గుర్తుందా అని అడుగుదామనుకుని అనుకున్నాను. ఇంతలో...” శాంత మాటలకు అడ్డు తగిలాను.

“శాంతా! నా తల్లికి రాత్రి పన్నెండు గంటలకి విషెస్ చెప్పాను. బొకే ఇచ్చాను. నిన్న హాస్పిటల్‌నుంచి వచ్చేటప్పుడే, దానికి ఇష్టమైన మంచి డ్రెస్ కొని తెచ్చాను. తల్లి ఇంకా నిద్ర లేవలేదనుకుంటాను. కావాలంటే లేచిన తరువాత తల్లిని అడుగు.” అన్నాను నేను ఉత్సాహంగా.

“సరే. టిఫిన్ రెడీ.” అంది శాంత.

“అరేంజ్ చేసెయ్యి... నేను బయలుదేరాలి” అంటూ ఫోన్ అందుకున్నాను నేను.

మా హాస్పిటల్... ఇంటి నుంచి బాగా దూరం! కొంత ఇబ్బందే. కారులో వెళితే ట్రాఫిక్ తక్కువైతే గంట, ఎక్కువగా ఉంటే గంటన్నర, రెండు గంటలు పడుతుంది. డ్రైవర్ కారు నడుపుతుంటే, నా ఆలోచనలు సర్జరీ చేయబోయే పేషెంట్ చుట్టూ, తిరుగుతున్నాయి.

పేషెంట్‌కి టంగ్ కాన్సర్. ముదిరిన స్థితిలో ఉంది. మాటకూడా సరిగా రావడంలేదు. సామాన్యులు అర్థం చేసుకోవడం కష్టమే! నాలాంటి స్పెషలిస్ట్ డాక్టర్లు, బహుశా కొంతవరకు అతని భార్య, అర్థం చేసుకోగలరు.

పేషెంట్ పేరు నరేన్. వయస్సు నలభై అయిదు. బ్యాంకులో ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు. అబ్బాయి డిగ్రీ చదువుతుంటే, అమ్మాయి టెన్త్ క్లాస్ చదువుతోంది. అస్తమానూ ట్రాన్స్‌ఫర్ల వల్ల, వాళ్ళ చదువు పాడవుతోందనీ, అలాగే తన ఆరోగ్యం దెబ్బతిందనీ చెప్పాడు. మొదటి విషయం నిజమని నమ్ముతాను. అయితే రెండో విషయం మాత్రం, మా నాన్నగారు తరచూ ఉదహరించే ఇంగ్లీష్ సామెత ప్రకారం “ఐ టేక్ ఇట్ విత్ ఎ పించ్ ఆఫ్ సాల్ట్...” అది అతని స్వయంకృతాపరాధం! ఊళ్ళు తిరగడం వల్లో, శీతోష్ణస్థితులవల్లో, ప్రభావితమై వచ్చిన అనారోగ్యంగా నాకు అనిపించడం లేదు. అసలు మెడిసిన్ కూడా ఇంచుమించు అదే చెబుతోంది.

అతనికి తాగుడు అలవాటు బాగా ఉంది. విపరీతంగా సిగరెట్లు కాలుస్తాడు. ఏ డాక్టరన్నా అతని పరిస్థితికి, ఆ రెండూ వెంటనే మానేయమంటాడు. బహుశా మొట్టమొదటసారిగా అతను కలిసిన డాక్టర్ కూడా, ఆ సలహాయే ఇచ్చి ఉంటాడు. అతను ఆ సలహా పాటించినట్లు లేదు.

నా దగ్గరకు రాగానే ఆ ప్రస్తావనే వచ్చింది. నేను కూడా ఆ రెండూ తక్షణమే మానేయమన్నాను. అతను వితండవాదన మొదలు పెట్టాడు.

“డాక్టరుగారూ, మీరు చెపుతున్నది బాగానే ఉంది. ఆ రెండూ అలవాట్లు లేని వాళ్ళు అందరూ ఆరోగ్యంగా ఉంటున్నారా?” అని నరేన్ నన్ను అడిగాడు.

“అలా అని కాదు. ఆ అలవాట్ల వల్ల మీకు వచ్చిన ప్రోబ్లెమ్స్ లాంటివి వచ్చే అవకాశం ఎక్కువ ఉంది!” అన్నాను నేను అతనికి నచ్చచెప్పే ధోరణిలో.

“నాకు అలాంటి వాటి మీద నమ్మకం లేదు. లైఫ్ ఈజ్ ఫర్ ఎంజాయ్మెంట్! అన్నీ మానుకుని వందేళ్లు బతికే కన్నా, హాయిగా జీవితం ఆస్వాదిస్తూ, ఎంజాయ్ చేస్తూ, ఏభై ఏళ్ళు బతకడమే మంచిది!” అన్నాడు నరేన్ నిర్లక్ష్యంగా!

“చూడండి. ఏ జీవి అయినా, ఎలాగైనా బతకాలని అనుకుంటుంది గానీ, చావాలని అనుకోదు. మీకు భార్యాపిల్లల బాధ్యత ఉంది. మీరు ఆ విషయం మర్చిపోకూడదు!”

“అయితే గాలి పీల్చడం కూడా మానేసి బతకమంటారా?” అన్నాడు నరేన్ కోపంగా.

కొంతమంది పేషెంట్స్ అనారోగ్యం వలన కలిగే బాధ, చిరాకు, నీరసం, నిరాశ వలన అలా మాట్లాడడం నేను ఎన్నో సందర్భాలలో చూసాను. కానీ నరేన్‌లా మూర్ఖంగా మాటలాడే పేషెంట్స్ అతి తక్కువ మంది తారసపడ్డారు.

“మీకు ఒక్క విషయం చెప్పదలచుకున్నాను. మంచి కండిషన్‌లో ఉన్న స్కూటర్ మీద, నలభై కిలోమీటర్ల వేగంతో, రోడ్డు రూల్స్ అన్నీ పాటిస్తూ, డ్రైవ్ చేస్తే ఆక్సిడెంట్ జరిగే అవకాశం ఎక్కువ ఉందా? లేకపోతే మద్యం మత్తులో, కండిషన్ బాగా లేని బండి మీద, ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా, డ్రైవ్ చేసుకుంటూ వెళితే ఆక్సిడెంట్ జరిగే అవకాశం ఎక్కువ ఉందా? ఆలోచించుకోండి!” అన్నాను నేను.

“డాక్టర్‌గారూ, నోరు మంచిది అయితే ఊరు మంచిది అంటారు. అంటే అందరితో మంచిగా మాట్లాడాలని, మంచిగా ఉండాలనీ... ఈ రోజుల్లో అదంతా వట్టి ట్రాష్. రెండు నాలుకలతో, అవసరం అయితే వెయ్యి నాలుకలతో

మాట్లాడేవాళ్ళే ఈ రోజుల్లో పైకొస్తారు. అందుకనే నేనూ అలాగే ఉన్నాను. భవిష్యత్తులో అలాగే ఉంటాను కూడా! ఈలోకంలో మంచివాణ్ణి చూస్తే మొత్తబుద్ధవుతందని అనుకునే వాళ్ళే ఎక్కువ!" అన్నాడు నరేన్ ఆవేశంగా.

ఇక అతనితో వాదించడం అనవసరం అనిపించింది.

"ఇంతకీ మీ సమస్య ఏమిటి?" అని అడిగాను.

"డాక్టర్‌గారూ, నాలుక మీద ఎర్రటి పుండులా ఏర్పడింది. విపరీతంగా నెప్పి పెడుతోంది" అన్నాడు నరేన్, మొదటిసారిగా బాధని వ్యక్తం చేస్తూ!

"ఎన్నాళ్ళనుంచీ?" అన్నాను నేను... అతని నాలుక సూక్ష్మంగా పరీక్షిస్తూ.

"అయిదారు నెలలు అయ్యింది."

"మరి ఎవరికన్నా చూపించారా?" అన్నాను.. ఆ పుండుని మెల్లిగా తడుముతూ. ఒక్కసారిగా రక్తం వచ్చింది. ఆలా ముట్టుకోగానే రక్తం రావడం మంచి లక్షణం కాదని నాకు తెలుసు. దూదితో ఆ రక్తస్రావం ఆపాను.

"ఇంట్లో వాళ్లు వేడిచేసిందని ఏదో గృహవైద్యం చేశారు. కానీ ఏమీ ఇంప్రూవ్‌మెంట్ కనపడకపోతే, మా ఆవిడ, నన్ను బలవంతం చేసి, ఒక డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళింది. ఆయన ఏవో మందులు రాసాడు. అవి నెల్లాళ్ళు వేసుకున్నాను. ఏమీ తగ్గలేదు. ఆయన మళ్ళీ మందులు మార్చాడు. అప్పుడు నాకు విసుగెత్తి అన్ని మందులు మానేసి, నా మందు డోస్ పెంచాను!" అన్నాడు నరేన్ అదోలా నవ్వుతూ.

"కొన్ని రోజుల తరువాత నోట్లోంచి రక్తం వచ్చింది. మా ఆవిడ ఏడ్చి గగ్గోలు పెట్టి, నన్ను ఒక సర్జన్ దగ్గరికి తీసుకెళ్లింది. అదిగో, ఆయన నన్ను తొందర పెట్టి, వెంటనే మిమ్మల్ని కలవమంటే, మీ దగ్గరకి వచ్చాను." అన్నాడు నరేన్.

నేను బలంగా నిట్టూర్చాను!

"సరే నరేన్‌గారూ, నేను కొన్ని టెస్టులు రాసిస్తాను, అవి చేయించండి. ఇక్కడే మా హాస్పిటల్లోనే చేస్తారు." అన్నాను.

"అంతే కదా డాక్టర్‌గారూ! మీ హాస్పిటల్లో ఉండేవి, మీకు, మీ హాస్పిటల్‌కి ఉపయోగపడే టెస్టులు రాస్తారు!" అన్నాడు నరేన్ వ్యంగ్యంగా.

ఒక్కసారిగా నాకు విపరీతమైన కోపం వచ్చింది. కానీ నేను డాక్టర్ విద్య చదువుకున్నప్పుడు చేసిన, హిపోక్రేట్స్ శపథం గుర్తుకు వచ్చి, నన్ను నేను నిగ్రహించుకున్నాను.

"మీరు ఏమనుకున్నా సరే, ఆ టెస్టులు చేయించుకోండి!" అన్నాను నేను కాస్త అసహనంగా.

"అమ్మా! ఆయనని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకు వెళుతున్నాం. బయాప్సీ కోసం చిన్న పీస్ తీస్తాను. ఆ రిజల్ట్ వచ్చాక, వేరే రిపోర్ట్స్ వచ్చాక, ఫ్యూచర్ కోర్స్ ఆఫ్ యాక్షన్ చూద్దాం!" అన్నాను నరేన్ భార్యతో. అంతలో బాయ్ వచ్చి, వీల్‌చైర్ మీద నరేన్‌ని ఆపరేషన్ థియేటర్ వైపు తీసుకెళ్ళాడు. నరేన్ భార్య అనుసరించబోయింది.

నేను నరేన్ భార్యతో, "మీరు ఇక్కడే ఉండండి. మిమ్మల్ని లోపలకి రానివ్వరు! బహుశా ఆపరేషన్ అవ్వొచ్చు. మీవాళ్ళు ఎవరైనా ఉంటే సహాయానికి రమ్మనండి." అన్నాను నేను.

ఆవిడ కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంది. "ఆయన అందరితోనూ గొడవలేనండీ! అటు మా వాళ్ళు, ఇటు వాళ్ళ వాళ్ళు ఎవ్వరూ ఇంటికి రారు. నోరు మంచిది కాదండి. నిజం చెప్పాలంటే ఆ నాలుకకి నరం లేదండి. ఏది పడితే అది మాట్లాడుతారు. ఎవరిని పడితే వాళ్ళని తిట్టి పోస్తారు. పోనీ బ్యాంకులో వాళ్ళు ఏమైనా సహాయం చేస్తారా అంటే, అక్కడా అందరితో గొడవలే!" అంది ఆవిడ బాధగా.

"ఓహ్... అన్నీ మావాళ్ళే చూసుకుంటారులెండి. మీరు జస్ట్ ఆయనకి మోరల్ సపోర్ట్‌గా ఉండండి చాలు! ఇన్సూరెన్స్ ఏమైనా ఉందా?"

"బ్యాంకు వాళ్ళు మొత్తం ఇస్తారండి. పైన కాస్త పడినా ఏదో తంటాలు పడతాలెండి!" అంది నరేన్ భార్య.

"కంగారు పడకండి! ఆపరేషన్ అవసరం అవ్వొచ్చు అన్నాను గానీ, కచ్చితంగా అనలేదు కదా! ఒకవేళ ఆపరేషన్ అయినా, ఒకరోజు ఇక్కడ ఉండాలి. అన్నిటికి ఛార్జెస్ బాగా తగ్గించి వేయమంటానులెండి. వారం రోజులు లిక్విడ్ డైట్ ఇవ్వాలి. మాటలు మళ్ళీ రావడానికి కాస్త టైమ్ పట్టవచ్చు. అలాగే రేడియేషన్, కీమోథెరపీ అవసరం పడవచ్చు! ఇవన్నీ ఇప్పుడు ఊరికే చెపుతున్నాను. నిజంగా ఆపరేషన్ చేస్తే అప్పుడు మా వాళ్ళు అన్నీ వివరంగా చెపుతారు." అంటూ ఆపరేషన్ థియేటర్ వైపు నడిచాను.

నేను అనుకున్నట్టుగానే ఆపరేషన్ అవసరం అయ్యింది!

"సర్, హాస్పిటల్‌కి వచ్చేసాం" అన్న డ్రైవర్ మాటలకి ఆలోచనలోంచి బయట పడ్డాను.

★★★

కొన్ని రోజుల తరువాత నా భార్యతో మాట్లాడుతూ ఉంటే నరేన్ ప్రస్తావన వచ్చింది.

"శాంతా, ఇంతకు ముందు నీకు ఒక 'స్కేమోజ్ సెల్ కార్సినోమా' కేసు గురించి చెప్పాను. పేషెంట్ గురించి, అతని వ్యక్తిత్వాన్ని గురించి చెప్పాను గుర్తుందా? ఆపరేషన్ విజయవంతం అవడం, పేషెంట్ ఊహించినదాని కంటే త్వరగా కోలుకోవడం జరిగింది! విచిత్రం ఏమిటంటే, అతను తన పాత అలవాట్లకు పూర్తిగా దూరం అయిపోవడం! అందరితో మంచిగా ఉండడం, మంచిగా ప్రవర్తించడం, వచ్చీరాని మాటలే చాలా నెమ్మదిగా, మృదుమధురంగా మాట్లాడడం! అనారోగ్యం అతని జీవితంలో ఎవరు ఊహించని మంచి మార్పు తెచ్చింది. కాన్సర్ ట్రీట్మెంట్ చాలా పురోగతి చెందింది. ఇంకా చెందుతోంది. అందుకని, అతని జీవితకాలం అయిదు సంవత్సరాలా... అంతకంటే ఎక్కువా... అన్నది ఎవరూ చెప్పలేని విషయం! అతని నాలుకలో భౌతికంగా, అతనిలో మానసికంగా చాలా మంచి మార్పు వచ్చింది. అతని శేషజీవితం చక్కగా నడుస్తుందని, అతని భార్య, అతనికి ట్రీట్ చేసిన ఒక డాక్టర్‌గా నేను, ఆశ పడుతున్నాం. కాలమే గాయాలు మానుపుతుంది. అలాగే కాలమే పాఠాలు నేర్పుతుంది. ఏమంటావ్?" అన్నాను నేను.

"నూటికి నూరు పాళ్ళు నిజమండీ. నిజం చెప్పాలంటే అది అతని మనసు నేర్చుకున్న పాఠం!" అంది శాంత అంగీకారంగా తల ఊపుతూ!

# స్వర్గాదపి గరీయసి

పాణ్యం దత్తశర్మ

✆ 9550214912

> *'అపి స్వర్ణమయీ లంకా న మే లక్ష్మణ రోచతే,*
> *జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరియసీ॥'*
> *"తమ్ముడా, బంగారు భవనాలతో విలసిల్లుతున్న ఈ లంకానగరం నన్ను ఆకట్టుకోవడం లేదు. కన్న తల్లి, కన్న ఊరు స్వర్గము కంటె మిన్న కదా"*
> *మంజునాథలో ఒక ఆలోచన! వెంటనే తన రిజిగ్నేషన్‌ను సి.ఇ.ఓ.కు మెయిల్ చేశాడు!*

'ఎర్నస్ట్ అండ్ యంగ్ ఎల్.ఎల్.పి' అన్న ఎరుపు రంగు నియాన్ లైట్ల అక్షరాలు ఆ భవనం మీద మెరుస్తున్నాయి. కెనడాలోని ఎడ్మాన్‌టన్ నగరం. సెకండ్ స్ట్రీట్, సౌత్ వెస్ట్. ముప్పై ఎనిమిది అంతస్తుల భవనం. ఇరవై రెండో అంతస్తు నుండి, ఇరవై నాలుగు వరకు 'ఇ అండ్ వై' కంపెనీ వారు తీసుకున్నారు. కన్సల్టింగ్, లా, స్ట్రాటజీ, టాక్స్ అండ్ ట్రాన్సాక్షన్స్, ఇలాంటి ప్రొఫెషనల్ సేవల్లో అంతర్జాతీయంగా పేరుగాంచింది ఆ సంస్థ. ఎల్.ఎల్.పి అంటే లిమిటెడ్ లయబిలిటీ పార్టనర్‌షిప్. ఫ్లెక్సిబుల్ బిజినెస్ ఆపరేషన్స్‌కు, ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ కంటే అనుకూలమైనది.

ఇరవైమూడో అంతస్తులో, ట్యాక్స్ అండ్ ట్రాన్సాక్షన్స్ వింగ్‌లో, తన ఛాంబర్‌లో కూర్చుని ఉన్నాడు మంజునాథ. ఛాంబర్ ముందు 'శిష్ట్లా మంజునాథ, ట్యాక్స్ ఎగ్జిక్యూటివ్ కన్సల్టెంట్, ఇ.వై.' అన్న బంగారం రంగు అక్షరాలు, నేరేడుపండు రంగు పెయింట్ వేసిన టేకు పలక మీద కాంతులీనుతున్నాయి.

మంజునాథ టేబుల్ మీద ఇంటర్‌కమ్ 'బజ్'మంది.

తీసి, "హాయ్! జాడ్!" అన్నాడు.

"కెన్ యు కమ్ టు మై ఛాంబర్ మాన్?" అన్నాడు అవతల నుంచి, జాడ్ షిమాలీ, సి.ఇ.వో, ఇ.వై. కెనడా. అతని గొంతులో అసహనం, అధికారం పోటీపడ్డాయి.

"కమింగ్, జాడ్!" అని రిసీవర్ పెట్టేసి, తన ఎగ్జిక్యూటివ్ ఛెయిర్ నుంచి లేచాడు మంజునాథ. తన పి.ఎ. సెలీనాకు తాను బాస్ దగ్గరకు వెళుతున్నానని, తనకేవైనా కాల్స్ వస్తే రిసీవ్ చేసుకొని, రికార్డు చేయమని చెప్పాడు.

"గుడ్ న్యూన్, జాడ్!" అన్నాడు తలుపు తీసుకోని లోపలికి వెళ్లి.


జాడ్ షిమాలీ మళ్లీ విష్ చేయలేదు. మంజునాథకు సీట్ ఆఫర్ చేయలేదు.

"మిస్టర్ ఆండర్సన్ వాళ్ల ఫర్మ్‌కు సంబంధించిన ట్యాక్సేషన్ స్టేట్‌మెంట్ ఇంకా వాళ్లకు మెయిల్ చేయలేదెందుకు? యు నో,

హి ఈజ్ ఎ కిన్ టు దోజ్ హు ఆర్ అట్ ది హెల్మ్ ఆఫ్ అఫెయిర్స్ ఇన్ ది కెనెడియన్ గవర్నమెంట్" అన్నాడు సి.ఇ.వో. కోపంగా.

"జూడ్, ప్లీజ్ బేర్ విత్ మి ఫర్ ఎ ఫ్యూ ఆర్స్! ఐ హేవ్ బీన్ ఆన్ దెయిర్ జాబ్ ఓన్లీ!" అన్నాడు మంజు.

మల్టీ నేషనల్ కంపెనీల్లో అందరూ పేర్లతోనే పిలుచుకుంటారు. గౌరవ వాచకాలుండవు. కాని అది పైపై మెరుగే. కావలసినంత ఇన్‌సబార్డినేషన్ ఉంటుంది.



"నో, మాన్, ఇటీజ్ హై టైమ్ యు టు డిడ్ ఇట్... లెట్ మి బీ క్లియర్. ఇఫ్ యు ఫీల్ దిసీజ్ నాట్ యువర్ కప్ ఆఫ్ టీ... యు కెన్ క్విట్!"

పనిచెయ్యలేకపోతే దయచెయ్యమని దానర్థం. మంజునాథ ముఖం ఎర్రబారింది. పెదవులు వణుకుతున్నాయి. విసురుగా తన ఛాంబర్ కొచ్చేశాడు.

'ఎంత చేశాడు కంపెనీకి తను! టాక్స్ అండ్ ట్రాన్సాక్షన్స్‌లో ఇ.వై.ని కెనడా లోనే సమున్నతంగా నిలబెట్టాడు. ఎంత చులకనగా మాట్లాడాడు' – 'ఇది నీ కప్పు టీ కాదు అనుకుంటే, ఉద్యోగం మానెయ్యి! బేస్ ఇన్‌గ్రాటిట్యూడ్.'

సడన్‌గా అతనికి గుర్తొచ్చింది. ఇ.వై. డౌన్‌సైజింగ్ గురించి ఆలోచిస్తున్నదని. అంటే సిబ్బందిని తగ్గించడం. ఆ ప్రక్రియలో ముందుగా హైప్రొఫైలర్స్ మీదే వేటు పడుతుంది. ఎందుకంటే హైపెయిడ్ కదా!

మంజునాథ హిందూపురంలో ఇంటర్ చేసి, సి.ఎ. ఎంట్రన్స్ రాశాడు. దాంట్లో సెలెక్టయి, బెంగుళూరులో 'నంజుడప్ప అసోసియేట్స్ దగ్గర ఆర్టికల్‌షిప్ (సి.ఎ. ఇంటర్న్‌షిప్) చేసి, రెండు పార్టులూ ఐదేండ్లలో పూర్తి చేశాడు. అనంతపురంలో ఛార్టెడ్ ఎకౌంటెంటుగా ప్రాక్టీసు చేస్తుండగా, కెనడాలో ఈ అవకాశం వచ్చింది.

కెనడాల్లో ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నాడు. తీవ్రమైన పని ఒత్తిడి. కారులో కూడా ల్యాప్‌టాప్‌లో పని చేసుకుంటాడు. వెల్ పెయిడ్ బట్ ఇల్‌ట్రీటెడ్. 'ఇండియా నుంచి బ్రతకడానికి వచ్చారు. చేయక ఛస్తారా?' అన్న యాటిట్యూడ్ బాస్‌లలో!

మరో మూడు గంటల్లో మిస్టర్ ఆండర్సన్ వాళ్ల స్టేట్‌మెంట్ వెళ్లిపోయింది. జాడ్‌కు కూడా.

ఇంటికి వెళుతున్నాడు. కారులో మ్యూజిక్ సిస్టమ్ అన్ చేయమన్నాడు డ్రైవర్ ఫ్రెడరిక్‌ను. ఉదయం ఆపిన చాగంటి వారి ప్రవచనం ప్లే అవసాగింది. "ఎన్ని దేశాలు తిరిగినా, ఎంత సంపాదించినా, పుట్టిన గడ్డను మించింది లేదు." రావణవధానంతరం శ్రీరామచంద్రులవారు, లక్ష్మణస్వామితో ఇలా అంటున్నారు.

'అపి స్వర్ణమయీ లంకా న మే లక్ష్మణ రోచతే।

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరియసీ॥'

"తమ్ముడా, బంగారు భవనాలతో విలసిల్లుతున్న ఈ లంకానగరం నన్ను ఆకట్టుకోవడం లేదు. కన్న తల్లి, కన్న ఊరు స్వర్గము కంటే మిన్న కదా"

మంజునాథలో ఒక ఆలోచన! వెంటనే తన రిజిగ్నేషన్‌ను సి.ఇ.ఓ.కు మెయిల్ చేశాడు!

★★★

మంజునాథ భార్య త్రిపుర. ఆమె గృహిణి. వారికి ఒకే కూతురు. టొరొంటో విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీలో పి.జి. చేస్తుంది. ఆ అమ్మాయి చదువును డిస్టర్బ్ చేయడం ఇద్దరికీ యిష్టం లేదు. తర్వాత కెరీర్‌ను ఎలా ఎక్కడ మలుచుకుంటుందో తన యిష్టం. తాను కారులో తీసుకున్న నిర్ణయాన్ని భార్యకు చెప్పాడు. ఆమె హ్యాపీగా ఫీలయ్యింది!

★★★

కెనడాలో అన్నీ సెటిల్ చేసుకుని ఫ్లైట్‌లో బెంగుళూరు చేరుకున్నారు భార్యాభర్తలు. అక్కడ నుండి క్యాబ్‌లో వాళ్ల సొంత ఊరు 'సోమఘట్ట'కు చేరుకున్నారు. హిందూపురానికి సుమారు నలభై కిలోమీటర్ల దూరంలో ఉంటుందా పల్లెటూరు. దారిలో లేపాక్షి వస్తుంది. నేషనల్ హైవేలోని కొడికొండ చెక్‌పోస్టుకు ఎనిమిది కిలోమీటర్లు సుమారుగా ఉంటుంది.

కారు నేరుగా వెళ్లి ఒక ఇంటి ముందాగింది. మంజు స్నేహితుడు కేదార, అతని భార్య పారిజాత వారిని సాదరంగా రిసీవ్ చేసుకున్నారు. స్నానాలు, భోజనాలై స్థిమితపడినాక విశ్రాంతిగా హాల్లో కూర్చున్నారు.

"సడన్‌గా ఇటువంటి నిర్ణయమేందిరా మంజూ! హాయిగా కెనడాలో పెద్ద ఉద్యోగం వదిలేసి, ఏం చేయడానికిరా వచ్చేసినావు?" అన్నాడు కేదార.

"ఒరేయ్! అదంతా నీకు ఫోన్లో చెప్పాను కదా! మా యిల్లు అంతా శుభ్రం చేయించి, రెడీ చేశావా లేదా? అది చెప్పు ముందు!"

"పట్టుపురుగుల పెంపకానికి బాడుగకిచ్చిండాము కదా! ఇప్పుడు పట్టుగూళ్ళు మరో నాలుగైదు రోజుల్లో తయారైతాయి. చంద్రవంకలకెక్కుతాయి. తర్వాత ఖాళీ చేస్తామన్నారు. మరో పది రోజులు. అంతవరకు ఈ బీద మిత్రుని ఇంట్లో ఉంటే సరే, లేదా హిందూపురంలో ఏదైనా హోటల్..."

"నోరు ముయ్యి! నీతోనే ఉంటా! సరే గాని, మన ఊర్లో నీటి వసతి గల పొలం ఎకరా ఎంత పలుకుతుందేమిటి?"

"మన మధుగిరి నరసింహస్వామి కొండకు పొయ్యే దారికి చక్కగా సిమెంటు రోడ్ వేసినారు. దానికి దగ్గరలో ఐతే ముప్పై లక్షల వరకు ఉంది ఎకరా. కొంచెం లోపలికి ఐతే ఇరవై, ఇరవై రెండు..."

"నాకు ఒక ఐదెకరాలు చూడు. నీరు పుష్కలంగా ఉండాలి."

"వ్యవసాయం చేస్తావా? నీకేమయినా పిచ్చా, వెర్రా? నీ దగ్గరున్న డబ్బుతో హాయిగా బెంగుళూరులో ఏదైనా ఫ్రాంచైజీ తీసుకోని..."

"వద్దురా కేదా! ఆ సిటీ లైఫ్‌తో విసిగిపోయాను. ఇద్దరం ఫిఫ్టీ ప్లస్‌కి వచ్చాము. ప్రశాంతంగా ఉండాలి."

"నీవు ఫోన్‌లో చెప్పిన తర్వాత విచారించాను. మన ఊరి కరణంగారిదే ఐదెకరాల పొలం ఉంది. బోరు వేశారు. మూడు వందల అడుగుల్లోనే జల పడింది. ప్రశస్తమైన ఎర్రనేల. ఎకరం ఇరవైఐదు లక్షలు చెబుతున్నాడు. బేరం చేస్తే, రెండో మూడో తగ్గవచ్చు."

"రేపే వెళ్లి పొలం చూద్దాం."

★★★

పొలం చదునుగా, బాగుంది. ఇరవై మూడుకు సెటిలయింది. గోరంట్లలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సోమఘట్టకు కిలోమీటరున్నర దూరంలోనే మధుగిరి నరసింహస్వామివారు, కొండపై ఒక గుహలో వెలసి ఉన్నారు. మంజునాథ కుటుంబానికి ఇలవేల్పు ఆయన. స్వామివారి దర్శనం చేసుకొని వచ్చారు.

కేదార పదిహేను రోజుల్లో ఇల్లు శుభ్రం చేయించి, చిన్న చిన్న రిపేర్లు చేయించాడు, పెయింట్స్ వేయించాడు. మంజునాథ అందులోకి మారాడు. సోమఘట్ట కర్నాటక బార్డరు గ్రామం. చల్లగా ఉంటుంది. అనంతపురం జిల్లా కరువు ఛాయలు అంత ఉండవు.

"నీ పొలంలో అల్లనేరేడు మొక్కలు నాటుదాం. ఆ పండ్లకు బాగా డిమాండ్ ఉంది. డయాబెటిస్ రోగులకు అవి మంచివని తెలిసి ఈ మధ్య సాగు ఎక్కువైంది. రెండున్నర ఎకరాలలో నేరేడు తోట పెంచుదాం. మిగతా పొలంలో కూరగాయలు

సాగు చేద్దాం. నీకు అన్ని విధాల తోడుగా ఉండి, అన్ని పనులు చేసుకోవడానికి, 'కదిరప్ప' అనే అతన్ని మాట్లాడాను. అతనికి మన పొలంలోనే ఒక వసతి ఏర్పరుస్తే సరి. చుట్టూ ఐదడుగుల ఇటుక గోడలు తీపి, ఏటవాలుగా రీపర్స్ చేసి, వాటిమీద యాజ్‌బెస్టాస్ రేకులు వేసిస్తే సరి. నీవొక యాక్టివా కొనుక్కో, పొలానికి వెళ్లి రావడానికి!" చెప్పాడు కేదార.

"అవసరం లేదురా! మన యింటి నుంచి గట్టిగా రెండు కిలోమీటర్లు కూడా లేదు. హాయిగా నడుస్తా. ప్రత్యేకంగా వాకింగ్ చేయాల్సిన పని ఉండదు."

★★★

బెంగుళూరుకు దగ్గరగా ఉన్న దేవనహళ్లి అన్న ఊరికి వెళ్లారు. అక్కడ 'తేజ నర్సరీ' చాలా ఫేమస్. అక్కడ మూడు వందల అల్లనేరేడు మొక్కలు, అంటు కట్టినవి, కొన్నారు. వారం రోజుల్లో ప్లాంటేషన్ పూర్తయింది. నీరు ఆదా చేయడానికి డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.

మొక్కకు, మొక్కకు ఇరవై అడుగుల దూరం వదిలారు. నాటినప్పుడు మొక్క రెండడుగులే ఉంటుంది కాని, మూడు నాలుగేళ్లకు ఇరవై అడుగుల వరకు పెరుగుతుంది. దాని పందిరి గుబురు (క్యానొపీ) విశాలంగా విస్తరిస్తుంది.

ట్రాక్టరుతో అంతర సేద్యం చేయించారు. తియ్యగుమ్మడి విత్తనాలు చిక్కబళ్లాపుర నుంచి తెప్పించి నాటారు. మూడు నాలుగు నెలల్లో, గుమ్మడి పాదులు నేలంతా పరచుకున్నాయి. మరో రెండు నెలల్లో, బంగారు రంగులో, తెల్లని చారలున్న గుమ్మడి కాయలు కాశాయి. చిన్నవే, కిలో కంటే తూగవు. కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో వీటికి డిమాండ్ ఎక్కువ.

మూడవ సంవత్సరంలో అంతరపంట ఆపేశారు. అల్లనేరేడు చెట్లు కొద్దిగా కాపు కాశాయి. కేవలం జూన్, జూలై నెలల్లో మాత్రమే కాపు వస్తుంది – 'బహుడోలీ' రకం చెట్లు అవి. పళ్లలో గింజ చాలా చిన్నగా ఉండి, గుజ్జు, జ్యూస్ అధికంగా ఉంటుంది. పండు, నూనె రాసినట్లు, నిగనిగ మెరుస్తుంది.

తోటలో తిరుగుతూ ఉంటే హాయిగా ఉంది. ఇద్దరూ ప్రతి శనివారం మధుగిరి నరసింహుని దర్శించుకుని వస్తున్నారు. మిగతా రెండున్నర ఎకరాల్లో, ఒక ఎకరాలో బేనిషాన్ రకం మామిడి మొక్కలు నాటారు. మిగతా పొలంలో క్యాప్సికం, వంకాయ, టమోట వేశారు. మంజునాథ స్వయంగా తోట పనులు చేస్తున్నాడు. కదిరప్ప, అతని భార్య రేవతి అక్కడే కాపురం. నేరేడు చెట్లు విపరీతంగా ఆకులు రాలుస్తాయి. వాటినన్నింటినీ తొలగించి ఒక చోట కంపోస్టు ఎరువు చేస్తున్నారు. పిందె తొడిగే సమయంలో, రాలకుండా స్ప్రే చేస్తున్నారు.

నాలుగేళ్లు గడిచాయి. రివర్స్ 'వి' ఆకారంలోని ల్యాడర్స్ గౌరిబిదనూరు నుంచి తెప్పించాడు మంజునాథ. వాటి మీద ఎక్కి ఆడకూలీలు జాగ్రత్తగా పండ్లను తెంపి, నడుముకు కట్టుకున్న సంచీలో వేసుకుంటారు. జూన్, జూలై నెలలలో ఆ సంవత్సరం పదివేల ఐదువందల కేజీల పంట దిగింది. బెంగుళూరునుంచి పన్నెట్స్ (Punnets) అనే అరకేజీ కంటెయినర్స్ ఇరవై వేలకు ఆర్డరిచ్చారు. పలుచని ప్లాస్టిక్‌తో వాటిని చేస్తారు. మధ్య మధ్య చిన్న రంధ్రాలు ఉండి, లోపలి పళ్లకు చక్కగా గాలి, వెలుతురు తగులుతాయి. పంటను హోల్‌సేల్ వ్యాపారులకు గంపగుత్తకి ఇవ్వకుండా, తానే స్వంతంగా మనుషులను పెట్టి మార్కెటింగ్ చేయించాడు. కిలో పళ్ల ధర నూటపది రూపాయలు పలికింది బెంగుళూరు మార్కెట్‌లో. పది లక్షలు వచ్చింది. తన దగ్గర పనిచేసే వాళ్లందరికీ బట్టలు పెట్టి, తలా ఐదువేలు బోనస్ ఇచ్చాడు.

వాళ్లందరికీ రాత్రి ఇంటి దగ్గర చదువు చెబుతున్నారు దంపతులు. ఊర్లోని కోదండ రామాలయాన్ని పునరుద్ధరించి శ్రీరామనవమి ఉత్సవాలు స్వంత ఖర్చుతో జరిపారు. సోమఘట్టలోని అప్పర్ ప్రయిమరీ స్కూలుకు బాలికలకు మరుగుదొడ్లు కట్టించాడు మంజునాథ.

అలా తన సంపాదనలో కొంత భాగం సమాజం కోసం ఖర్చు పెడుతున్నాడు. కెనడాలో తన సంపాదనతో పోలిస్తే, ఇక్కడ నేరేడు పంట దిగుబడి వల్ల వచ్చేది తక్కువే! కానీ 'స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః' అని కదా గీతాచార్యుడు చెప్పింది.

ఆ రోజు పన్నెట్స్‌లో నేరేడుపళ్లను ప్యాక్ చేయిస్తూ ఇలా అనుకున్నాడు మంజునాథ

'యస్! దిసీజ్ మై కప్ ఆఫ్ టీ! ది మోస్ట్ డెలీసియస్ వన్!'.

# ఋణం


## రాపాక కామేశ్వర రావు

✆ 7032905901


***ఒక రోజు కర్రిడికి బాగా జ్వరం వచ్చింది. ఆమె మందు బిళ్ళలు తెచ్చి ఇచ్చింది. అయినా తగ్గలేదు. ఆ ఊరిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళి డాక్టరు గారిని సంప్రదించింది. టైఫాయిడ్ జ్వరమని చెప్పి మందులు కోర్సు వాడమని చెప్పారు. డాక్టర్ చెప్పినట్టు మందులు వాడింది. అయినా తగ్గలేదు. బంగారమ్మలో ఆందోళన ఎక్కువయింది. తన జీవితంలో అనుకోకుండా దేవుడిచ్చిన ఆసరా పోతుందేమోనని భయం పట్టుకుంది.***

అనాదిగా మగ దురహంకారానికి ఎదురుతిరిగే శక్తి లేక ఆడది అబలగానే ఉండిపోయింది. తిరుగుబోతులు, తాగుబోతులైన మగాళ్ళ దాష్టీకం వలన ఎందరో ఆడపిల్లల జీవితాలు బుగ్గిపాలుఅవుతున్నాయి.

“బంగారే... బం... గా...” అతడి అరుపు, మందుమత్తులో నిద్రపోయింది. అంతకు గంట ముందు ఒక సీసాడు సారా లాగించి వచ్చాడు వీరేసు. బంగారమ్మను చితకబాది, ఆమె కొంగులో మూటగట్టుకున్న పైసల కోసం వేధించి లాక్కుపోయాడు. మళ్ళీ మరో పీపా లాగించి ఇంటికొచ్చాడు. రాత్రి పదకొండు గంటలవుతుంది.

బరంపురం రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరములో, బెజ్జిపురం జంక్షన్‌లో తన టీ కొట్టు పాకలోనే వీరేసుతో సంసారం చేస్తున్న బంగారమ్మ, ఆదరాబాదరాగా దొరికిన నాలుగు గుడ్డల్ని మూట కట్టి, తలపైన పెట్టుకుని, పిల్లలిద్దరిని చెరో చేత్తో లాగుకుంటూ స్టేషన్ వైపు దారి తీసింది. ఈ విషయం తెలియదా మగ మహారాజుకి!

“అయ్యా, ఈ పిల్లల్ని అందుకోవా?” పరుగు పరుగున వచ్చిన బంగారమ్మ, చేతిలో పిల్లల్ని ఒక పెద్దమనిషికి అందించి, తను కూడ ఆ రైలుపెట్టెలోని జన సంద్రంలోకి దూకింది.

రాత్రి పన్నెండు గంటలవుతుంది. లోకమంతా చీకటిలో చిక్కుకుంది. నిశీధి తనకేమీ కొత్త కాదన్నట్టు, రైలు ఆ చీకటిలో దారి వెతుక్కుంటూ సాగింది.

“టికెట్... టికెట్...” అంటూ టి.టి.ఇ. తన విధి నిర్వహణలో భాగంగా బంగారమ్మ దగ్గరకు వచ్చి, టిక్కెట్టు చూపించమన్నాడు. ‘లేదు’ అని చెప్పిన బంగారమ్మని తదుపరి రైల్వేస్టేషన్‌లో దించేసాడు.

అర్ధరాత్రి అమావాస్య! కళ్ళు పొడుచుకున్నా కనిపించని కటిక చీకటి! రైలుపెట్టెల్లో కూడ లైట్లు మసకగా వెలుగుతున్నాయి. చిట్టచివరి పెట్టెలోంచి దిగిన బంగారమ్మ ఆ చీకటిని చీల్చుకుంటూ ముందుకు నడుస్తోంది. అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ రైలుబండికి సిగ్నల్ ఇచ్చి, బండి కదలగానే సిగ్నల్ లైట్ ఆర్పి తన రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. అది ఏ ఊరో కూడ తెలియలేదు. బుకింగ్ కౌంటర్ ఎదురుగా ఉన్న వెయిటింగ్ హాల్‌లో ఒక మూలన కూర్చుంది పిల్లలతో బంగారమ్మ.

★★★

పల్లెకు, పట్టణానికి మధ్యస్థముగా ఉండే ఊరు సోంపేట. ఆ ఊరిలో దూరముగా విసిరేసినట్టున్న ఒక పేట 'కొత్త పేట'. చౌకగా ఇల్లు కట్టుకునేవారు లేదా తక్కువ అద్దెతో నివాసముండేవారు అక్కడుంటారు. అంటే సాదాసీదా జనాల స్థావరం. అందులో ఒక మూలన మిగిలిన ఇళ్ళకు దూరముగా, పక్కనే ఉన్న హైస్కూల్ పిల్లల ఆటస్థలానికి సమీపంలో ఒక పూరి గుడిసెలో నిద్రపోతున్న 'కర్రిడు', వేకువజామున చెవిలో అలారం మోగినట్టు ఠక్కున లేచాడు. బయటికొచ్చి చూస్తే చిమ్మచీకటి. అయినా, అలవాటు ప్రకారం తలపైకెత్తి చూసాడు... వేగు చుక్కకోసమై! ఇంతలోనే "నీ టైం అయిందిరా" అని చెప్పినట్టు ఒక కోడి కూసింది.



ఊరు, పేరు లేని ఒక అనాథ 'కర్రిడు'. తన ఏడేళ్ళ వయసులో సోంపేట రైల్వేస్టేషన్ వెయిటింగ్ హాల్లో ఒంటరిగా కూర్చుని ఏడుస్తుంటే, గుర్రాల అప్పలస్వామి చూసి చేరదీసాడు. సోంపేట రైల్వేస్టేషన్ ఆ ఊరికి మూడు మైళ్ళ దూరములో ఉంటుంది. రైల్వేస్టేషన్‌కు వెళ్ళాలంటే ఆ రోజుల్లో ఏకైక ప్రయాణ సాధనం జట్కా బండి. ఆ జట్కాలు కూడ రెండే ఉండేవి. అందులో ఒకటి గుర్రాల అప్పలస్వామిది! ఆ ఊరిలో ఎవరైనా కుటుంబముతో రైలు ప్రయాణము చెయ్యాలంటే, ముందు రోజు రాత్రి ఎవరో ఒకరికి కబురు పెడితే, ఆ రైలుబండి టైముకి ఒక గంట ముందుగా వారి ఇంటిదగ్గర సిద్ధముగా ఉండేవారు. గుర్రాల అప్పలస్వామి నెమ్మదస్తుడు అవడము వలన ఎక్కువ మంది ఆయన జట్కానే కోరుకునేవారు.

అప్పలస్వామి, తనకు రైల్వేస్టేషన్‌లో దొరికిన కుర్రవాడిని ఇంటికి తెచ్చి పెంచుకున్నాడు. ఎవరూ లేని తన

ఒంటరి జీవితానికి దేవుడే ఒక తోడిచ్చాడనుకుని మురిసిపోయాడు. ఆ కుర్రవాడికి ఊరు పేరు తెలియని కారణముగా, మరియు చూడ్డానికి నల్లగా ఉండడము వలన, ఆ చుట్టు ప్రక్కల వాళ్ళు 'కర్రిడు' అని పిలిచేవారు. అదే తన పేరుగా అందరికి పరిచయమయ్యాడు 'కర్రిడు'.

★★★

అప్పలస్వామికి జట్కా ద్వారా వచ్చిన డబ్బులుతో తన తిండి, గుర్రంకు దాణా పోగా ఇంకేమీ మిగిలేవి కావు. 'పెళ్ళాం పిల్లల్ని ఎలా పోషిస్తాం' అని అనుకునేవాడు. 'సంసారి దుఃఖి, సన్యాసి సుఖి' అన్న సామెతను ఆకళించుకుని, ఇంక పెళ్ళిచేసుకోవాలనే ఆలోచన విరమించుకున్నాడు. ఒంటరి జీవితానికి అలవాటు పడిపోయాడు. తండ్రి ఆస్తిగా వచ్చిన ఆ పూరిగుడిసెలో కాలం గడిపేవాడు.

కర్రిడుకి ఇరవయ్యేళ్ళు వచ్చేసరికి అప్పలస్వామి చనిపోయాడు. అప్పటివరకూ అప్పలస్వామికి తోడుగా ఉండి, అతని పనులలో సహాయపడే కర్రిడు స్వంతముగా జట్కా నడపడం మొదలు పెట్టాడు. అప్పలస్వామి చనిపోయే ముందే తన పాత గుర్రం ముసలిదై పోయిందని, వయసులో ఉన్న ఒక కొత్త గుర్రం కొన్నాడు. అప్పలస్వామి పోయిన కొద్ది రోజులకు పాత ముసలి గుర్రానికి కూడ కాలం చెల్లింది.

అప్పలస్వామిలాగే కర్రిడు కూడ ఒంటరే! పెళ్ళి తలపు రానీయలేదు. తనవారంటూ ఇంక ఎవరు లేరు. ఇప్పుడు తను, గుర్రం, జట్కా బండి ఒకరికొకరుగా బ్రతుకుతున్నారు. అలా ఇంకో ఇరవయ్యేళ్ళు గడచిపోయాయి కర్రిడు ఒంటరి బ్రతుకులో.

ప్రతి రోజులాగే ఆ రోజు కూడ వేకువ జామునే లేచిన కర్రిడు. తన కాలకృత్యాలు తీర్చుకున్న పిదప గుర్రానికి ఉలవలు నానబెట్టిన దాణా పెట్టాడు. కొద్దిగా పచ్చగడ్డిని కూడ పెట్టి, మిగిలిన పచ్చగడ్డిని గోనెసంచిలో మూట కట్టి జట్కా అడుగు భాగములో ప్రయాణీకుల సామానుల కోసమై గోనె అంకెంతో జోలెలా కట్టిన చోట భద్రపరిచాడు. గుర్రాన్ని జట్కాకు కట్టి కమ్మ పట్టుకుని తూరుపు తిరిగి దండం పెట్టుకుని బయలుదేరాడు.

★★★

"అమ్మే... అమ్మే" అని పిలుస్తూ, తన వద్దనున్న టార్చి లైటు ఆమె మీద వేసాడు కర్రిడు. చలిలో వణికిపోతున్న పిల్లల్ని తన పైటచెంగుతో కప్పి, రైల్వేస్టేషన్ వెయిటింగ్ హాల్‌లో చీకటిలో కూర్చున్న బంగారమ్మ ఆ వెలుతురుకి కళ్ళు విప్పి చూసింది. లైటు కళ్ళ మీద పడ్డంతో ఎదురుగా ఉన్న వ్యక్తి కనబడ్డంలేదు. మళ్ళీ కళ్ళు మూసుకుంది.

కొంతసేపు పోయిన తరువాత మళ్ళీ అడిగాడు కర్రిడు "అమ్మే, యా ఊరు ఎల్తావు?"

"ఇదే టేసిని?" అడిగింది బంగారమ్మ

"సోంపేట టేసిని, నీవెక్కడికెల్లాల?"

బంగారమ్మకు ఏడుపొచ్చింది అయినా ఏడుపు బయటికి రాకుండా నోటిలో చీర చెంగు కుక్కుకుంది, పిల్లలు లేస్తారేమోనని.

అలా కొంత సేపు ఏడవనిచ్చి మళ్ళీ అడిగాడు కర్రిడు. "యా ఊరెల్తావో సెప్పితే నా జట్కాలో దిగబెడతాను"

మళ్ళీ మౌనమే సమాధానం

"నీకిక్కడ ఎవుల్లేరా? సరే రా, అందాక మా ఇంటిలో ఉందువు గాని" అని, ఆమె దగ్గరున్న బట్టల మూటని ఒక చేత్తో తీసుకుని, ఇంకో చేత్తో ఒక పిల్లడిని ఎత్తుకుని జట్కా వైపు వెళ్ళాడు.

బ్రతుకే శూన్యమైపోయిన బంగారమ్మకి కర్రిడు ఎలాంటోడో, ఏమి మోసం చేస్తాడో అన్న సంశయం కూడ రాలేదు. కనీసం పేరు కూడ అడగకుండా అతని వెనక నడిచింది. 'నిండా మునిగిన వాడికి చలేమిటి?' అనుకుందో లేక 'ఇన్నాళ్ళకు దేవుడే ఒక దారి చూపిస్తున్నాడు' అని అనుకుందో.

కర్రిడుకి ఆ రోజు వేకువజామున సోంపేట రైల్వేస్టేషన్లో ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్లో దిగిన వేరే ప్రయాణీకులెవరూ లేకపోవడముతో బంగారమ్మని ఎక్కించుకుని సోంపేటలోని తన ఇంటికి బయలుదేరాడు.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. ఆమెను, పిల్లల్ని ఇంటి దగ్గర దింపి బస్‌స్టాండ్ దగ్గరున్న టిఫిన్ కొట్లో ఇడ్లీ తెచ్చి ఇచ్చాడు.

"నేనెళ్ళిపోతున్నాను తలుపేసుకో, కుదురుమీద బుట్టలో బియ్యమున్నాయి చూడు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

మళ్ళీ సాయంత్రమొచ్చిన కర్రిడు ఇంటికి కావలసిన సరుకులు, కూరగాయలు తెచ్చాడు. రాత్రి బయట అరుగు మీద చాప వేసుకుని పడుకున్నాడు.

ఇలా తన దైనందిన కార్యక్రమాలు... వేకువనే లేవడం, గుర్రముకు దాణా పెట్టడం, జట్కా సిద్ధం చెయ్యడం మళ్ళీ రాత్రికి ఇంటికి చేరడం, రాత్రి బంగారమ్మ వంటచేసి పెట్టినది తినడం, తరువాత పడుకోవడం జరిగిపోతున్నాయి.

ప్రస్తుతం సోంపేట రైల్వేస్టేషన్‌కు వెళ్ళడానికి రిక్షాలు, ఆటోలు మొదలగు ఇతర ప్రయాణ సాధనాలు కూడా అందుబాటులోకి రావడం వలన కర్రిడు ఆదాయం తగ్గింది. ఆటో ప్రయాణం ఖర్చుతో కూడుకున్నదని భావించేవారు మాత్రమే జట్కా ఎక్కేవారు.

'అమ్మ పుట్టిల్లు మేనమామకెరుక' అన్నట్టు డబ్బులకోసం కర్రిడు పడుతున్న ఇబ్బందిని అర్థం చేసుకుంది బంగారమ్మ.

"నేనేదైనా పనికెల్తాను!" నాలుగు రోజులు పోయిన తరువాత రాత్రి భోజనం పెట్టినప్పుడు బంగారమ్మ మాట కలిపింది.

"నీకేటి సేతవుతుంది?"

"మాకు ఒటేలు ఉండేది. టిపినీలు సెయ్యగలను. ఇంట్లో కంచం కుడుములు సేసి ఈ పేటలో అమ్మితే సాలదా?"

"ఇక్కడ అందరు పకాలి తింతారు. టిపినీలు సెయ్యరు."

"టిపినీలు పిరం అని ఎవులూ తినరు. మనం కుడుములు సేసి సవకన ఇస్తే అందరు తింతారు."

"అలాగే సెయ్యి. ఏటి కావాలో సెప్పు, రేపు తెస్తాను"

బంగారమ్మ అనుకున్నట్టుగానే ఆమె కుడుములకు అలవాటు పడ్డారు ఆ పేట జనులు. అనతి కాలములో ఆ పేటలో కుడుములమ్మగా పేరు సంపాదించింది బంగారమ్మ. ఉదయం కుడుములు చేసి అమ్మేది. ఆ తరువాత గుర్రం కోసం చుట్టుప్రక్కల పొలాల గట్ల మీద పచ్చగడ్డి కోసుకొచ్చేది. అలా కర్రిడు, బంగారమ్మ ఒకరికొకరుగా బ్రతుకుతున్నారు.

బంగారమ్మ తన బంధువులమ్మాయని, మొగుడు విడిచిపెట్టి పారిపోయాడని అక్కడివారికి చెప్పాడు కర్రిడు. కర్రిడు ఒక అనాథ అని, అప్పలస్వామి పెంచుకున్నాడని ఆ పేటలో చాల మందికి తెలుసు గనుక, కర్రిడు చెప్పిన మాటనెవ్వరూ నమ్మలేదు. ఎలాగైతేనేం కర్రిడు ఒక ఇంటివాడయ్యాడని వారు సంతోషించారు. కాని బంగారమ్మను ఇంతవరకు కనీసం తాకనైనా లేదు కర్రిడు.

కొన్నాళ్ళు పోయిన తరువాత కొంతమంది సూచన మేరకు బస్‌స్టాండ్ ఎదురుగా రోడ్డు పక్కన ఒక పాక వేసి అందులో టిఫిన్ కొట్టు ప్రారంభించారు కర్రిడు, బంగారమ్మ.

'బంగారమ్మ టిఫిన్స్'గా అది ప్రాచుర్యం పొందింది. అక్కడి చుట్టుప్రక్కల గ్రామాల వారు కూడ బంగారమ్మ టిఫిన్ సెంటర్‌లో తిని బస్ ఎక్కి వెళ్ళిపోతుండే వారు.

నలుగురికి కర్రిడి భార్యగా తెలిసిన బంగారమ్మని అందరు 'కర్రి బంగారం' అనే వారు. బంగారమ్మ టిఫిన్స్‌తో పాటు 'కర్రి బంగారం' కూడ ప్రాచుర్యం పొందింది.

★★★

దరిమిలా ఆ పేట పంచాయతీ వార్డు మెంబరు చనిపోవడం వలన ఏర్పడ్డ ఖాళీలో ఆ ఊరి సర్పంచ్‌గారి ప్రోద్బలంతో అక్కడి వోటర్లందరు ఆమెను ఏకగ్రీవముగా ఎన్నుకున్నారు. బంగారమ్మ దశ తిరిగింది. అనతి కాలంలోనే ఆ ఊరిలో మంచి పేరు సంపాదించింది.

'కర్రి బంగారం' ఆ పేటలో సిమెంట్ రోడ్లు మరియు కొత్తగా విద్యుద్దీప స్తంభాలను వేయించటంలో కృషి చేసింది. అందరికి తలలో నాలుకయింది.

ఒకరోజు కర్రిడికి బాగా జ్వరం వచ్చింది. ఆమె మందు బిళ్ళలు తెచ్చి ఇచ్చింది. అయినా తగ్గలేదు. ఆ ఊరిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళి డాక్టరు గారిని సంప్రదించింది. టైఫాయిడ్ జ్వరమని చెప్పి మందులు కోర్సు వాడమని చెప్పారు. డాక్టర్ చెప్పినట్టు మందులు వాడింది. అయినా తగ్గలేదు. బంగారమ్మలో ఆందోళన ఎక్కువయింది. తన జీవితములో అనుకోకుండా దేవుడిచ్చిన ఆసరా పోతుందేమోనని భయం పట్టుకుంది.

ఆ రాత్రి ఆమెకు నిద్ర పట్టలేదు. కర్రిడి దగ్గరికి వెళ్ళి నుదుటిపై చెయ్యి వేసి చూసింది. ఆ స్పర్శకు కర్రిడు ఉలిక్కి పడ్డాడు.

"కేవు ఉందా?" అని అడిగింది

"ఊ..." నీరసముగా అన్నాడు కర్రిడు.

"కాలు పట్టనా?"

ఒద్దులే అన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

అయినా ఆమె కర్రిడి కాళ్ళు చేతులు ఒత్తింది. ఇన్నాళ్ళ సాంగత్యములో ఆమెలో పెరిగిన ప్రేమాభిమానాలు మొదటిసారి కర్రిడు చవిచూసాడు. తొలిసారి ఆమె స్పర్శించడం వలనేమో, కర్రిడి గుండె వేగంగా కొట్టుకోసాగింది. అప్రయత్నముగా ఆమెను దగ్గరికి లాక్కొని గుండెలపై అదిమి పట్టుకున్నాడు.

ఆమెలో కూడ ఏదో తెలియని అనుభూతి... ఆత్మీయ భావం పెల్లుబికింది. అతనికి మరింత చేరువై ఒత్తుకుంది. ఆపద సమయములో తనని ఆదుకున్న ఆ దేవుడిని మనసారా మొక్కుకుంది.

కొద్ది క్షణాలు ఇరువురి శరీరాలు భావోద్వేగానికి లోనయ్యాయి.

తరువాత కర్రిడు దీర్ఘముగా శ్వాసించి వదిలాడు. అదే అతనికి తుది శ్వాస అయింది. అతని గుండెలయ ఆగిపోయింది.

ఏ ఋణానుబంధమో వారిద్దరిని కలిపింది. కర్రిడి ఋణం తీరిపోయింది.

# ఏమున్నది లేదా?

వెంకటమణి ఈశ్వర్

✆ 9492244586

***ఎన్నికల వేళ మనకింత ఎరవేసి ఆ సొమ్మూ, భూమీ, ఆస్తిపాస్తులు దోచుకునేందుకు ఆ ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకుంటున్నాడు రాజకీయ నాయకుడు. అతగాడు తమ సొమ్మే కాజేస్తున్నాడని, తమ భూమే ఆక్రమిస్తున్నాడని, ఆ సొమ్మూ, భూమీ తమ ఉమ్మడి ఆస్తి అని ప్రజల గ్రహింపునకే రావడం లేదు. ఆ సొమ్మూ, భూమి అక్రమార్కుల పాలబడకుండా సద్వినియోగమైతే, ఇప్పుడు అనుభవిస్తున్న దౌర్భాగ్యపు జీవితం స్థానంలో ఎంతో మెరుగైన జీవితాన్ని అనుభవించవచ్చునన్న ఆలోచనే రావడంలేదు.***

"ఊళ్లో ఏ పార్టీవోళన్నా డబ్బులు పంచిన అలికిడయినాదేటి?" అడిగాడు అప్పలనాయుడు తన పక్క పొలంలో గాబు తీస్తున్న పోలినాయుడిని.

"నువ్వడగడంగానీ... సెడుగు పని సేసీటప్పుడు ఎవుడైనా అలికిడి సేత్తాడా యేటి?" నవ్వాడు పోలినాయుడు.

"అవుననుకో... అయినా ఈపాళి ఎవుళూ ఓటుకు నోటు తీసుకోరులే! ఏ నాయకుడికీ ఓటూ యెయ్యరులే... నోటాకే ఎత్తారు. తిలక్ బావు సెప్పేల్లాక ఒకరిద్దరు మినాయించి ఊరంతా ఒకమాట అనుకున్నాం గదా, నోటాకే ఏద్దారని."

పోలినాయుడు ఉస్సంటూ "ఏటో నోటా నోటా అంతన్నారు గానీ, ఈ నోటా యేటో నాకర్థవై సావడంనేదు!" అనన్నాడు.

"నోటా అంతే మరేటో కాదురా. అదో గురుతు! పోటీలోనున్న అభ్యర్థుల్లో ఎవుళూ మనకి వద్దనుకుంతే ఈ నోటా గురుతును ఎంచుకోవాలనమాట. ఉప్పుడు సానా సోట్ల నోటాకి ఎక్కువగానే ఓట్లు పడతన్నాయట. ఈవీయమ్మ మిసనీలోన, బేలట్టు పేపర్లోన సివార్నుంతాది ఆ గురుతు. తెలిసిందా!"

"అది సర్నే, నోటాకేత్తే మనకేటి పయోజనవా అని?"

"ఉప్పుడుకుప్పుడు మనకేటో ఒరిగిపోద్దని గాదు, సమాజంలోన మార్పుకోసం ఓ ఆలోసన బలపడతాదంట! ఏటి నాయం జరుగుతందిరా ఈ వ్యవస్థలోన? ఏదీ నేదు! అది మారాల. మారాలని కోరుకుంతే, నోటాకి ఓటెయ్యాల! పెశ్న పుడితేనే కదా జవాబు పుట్టీది. రోగవేటో తెలిత్తేనే గదా, దానికి తగ్గ వైద్యగమేటో చేసీది. మన, మన పిల్లోళ్ల బాగ్గోకోసమే ఇదంతా!"

పోలినాయుడుకి కొంత కొంత అర్థమవుతున్నా ఇంకా అర్థంకానిది ఎంతో మిగిలివున్నట్లు అన్పిస్తోంది. మట్టిచేత్తోనే బుర్ర గోక్కున్నాడు. అతనొక్కడికే కాదు, కాశీపురం గ్రామస్థుల్లో అనేకులదీ అదే పరిస్థితి! ఎక్కడ చూసినా నోటా గురించే చర్చ!

తిలక్ అని ఓ సామాజిక కార్యకర్త రాజకీయాల్లో మార్పుకోసం కాశీపురాన్ని కేంద్రంగా చేసుకుని గత పదేళ్లుగా పనిచేస్తున్నాడు. మొదట్లో గ్రామంలోని వారెవ్వరూ అతణ్ణి పట్టించుకునేవారు కాదు. కానీ అలుపెరుగని నిస్వార్థ కృషి

ఫలితంగా, క్రమంగా అతన్ని లక్ష్యపెట్టే స్థితికి వచ్చారు జనం. అతడు ఈసారన్నా తన మాట వినండని, ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటు వేయొద్దని, నోటాకు మాత్రమే ఓటు వెయ్యాలని గ్రామస్థులను కోరాడు. దేశవ్యాప్తంగా నోటాకు ఆదరణ పెరుగుతోందని, కొన్నిచోట్ల కొన్ని ప్రధానపార్టీల అభ్యర్థుల కంటే నోటాకు అధికంగా ఓట్లు పోలవుతున్నాయని, నచ్చని అభ్యర్థిని తిరస్కరించే అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకుంటే, అటుపైన పార్టీలు మంచి అభ్యర్థులను ఎన్నికల్లో నిలిపే అవకాశముంటుందని, అందుకని నోటాను బలపరచాలని, అది బలపడితే రాజకీయపార్టీలు కొంతైనా దారికి వస్తాయని వారికి చెవినిల్లు కట్టుకుని చెప్పాడు. ఏ పార్టీ వచ్చినా తమకు ఒరుగుతున్నదేమీ లేదని గ్రహించిన గ్రామస్తులు, ఈసారి పార్టీవాళ్లు ఇచ్చే డబ్బు, మందు పుచ్చుకోమని, నోటాకే ఓటేస్తామని ఆయనకి మాటిచ్చారు. పోలింగు తేదీ దగ్గర పడుతున్నవేళ, ఆ మాట మీదనే ఎక్కువగా చర్చ జరుగుతోంది గ్రామంలో.



పోలినాయుడికి ఇంకా అనుమానం తీరక, "నాకు తెలవకడుగుతాను. ఒకేళ నోటాకు పోటీలో నిలబడినోళ్లందరి కంటే ఎక్కువ ఓట్లు వత్తే అప్పుడేటి సేస్తారు?" అనడిగాడు.

"ఆ దవుటు మావూ అడిగినాం తిలక్‌బావుని! ఆ విసయంమీన ఎవులో మళ్లీ ఎన్నికలెట్టాలని సుప్పిరీం కోర్టుకు పోనారట. కానీ కోర్టు ఒప్పనేదట. అయితే మన తిలక్ బావు కూడా అదే మంచిదంటన్నాడు. పోటీలో నిలబడ్డ అభ్యర్థులందర్నీ వోటరు వద్దనుకున్నప్పుడు, ఆళ్లని తప్పించీసి, కొత్త అభ్యర్థులతో మళ్లీ ఎన్నిక ఎట్టాలంతన్నాడు. నాకూ అదే కరెక్టనిపిస్తంది. అలా సేత్తే పార్టీలోళ్లకి కుసింతైనా బుద్దొత్తాది. ఆ భయంతోనైనా కొద్దోగొప్పో మంచోళ్లను నిలబెట్టడానికి ముందుకొత్తారు" అని చెప్పుకుపోతున్నాడు.

ఇంతలో దూరాన్నుంచి "వోరె అప్పల్నాయుడో... అప్పల్నాయుడో..." అన్న కేక వాళ్ల చెవినబడింది.

"సత్తెంబాబు కేకేత్తన్నట్టుగున్నాడు..." అని "వోరె... ఏవిరోయ్?" అని ప్రతిగా తనూ కేకేశాడు అప్పలనాయుడు.

"అప్పల్నాయుడో! మీ ఇంటికాడ పెద్ద గొడవే జరుగుతంది. బేగి పా౯్రా... పా౯్రారోయ్."

అప్పలనాయుడు చేతిలోని పారను జారవిడిచి, పంచె ఎగ్గట్టుకుని పొలంలోంచి పైకొస్తూ, "వోరె.. ఏవైనాదిరోయ్?" అని కేకేసి అడిగాడు.

సత్తింబాబు దగ్గరకంటా వచ్చి "ముత్తాల్ని మీ రాంబాబు కొట్నాడు. నీకు సెప్పడం మంచిదని పారొచ్చినాను" ఒగురుస్తూ చెప్పాడు.

కొడుకు ఆడదాని ఒంటి మీద చెయ్యివేసాడని వినగానే అప్పలనాయుడు ఉద్రేకపడిపోయాడు. తుండుగుడ్డ భుజాన విసురుగా వేసుకుని "దేనికి గొడవ పడతన్నారు పనికిమాలోళ్లు?" అని ఉరుకుల పరుగుల మీద ఇంటికి బయలుదేరాడు.

★★★

అప్పల్నాయుడికి ఇద్దరు కొడుకులు. పెద్దోడు వెంకట్రావు. చిన్నోడు రాంబాబు. ఇద్దరికీ పెళ్లిళ్లయిపోయాయి. అప్పల్నాయుడి ఇంట్లోనే చెరో వాటాలో ఉంటున్నారు. ఈమధ్యన ఓ వ్యవహారంలో రాంబాబుకు ఒకరి నుండి డబ్బు ముట్టింది. ఆ డబ్బులో కొంత అన్న వెంకట్రావుకు, వదినె రత్నంకూ, అతగాడి కొడుక్కూ, అలాగే తన భార్య ముత్యాలు అమ్మ, అన్న తరఫువారికి వాటాలు ఇవ్వాల్సివుంది. అయితే వాళ్లెవ్వరికీ ఇవ్వకుండా తనే అట్టిపెట్టేసుకున్నాడు. ఆ విషయం ఎలా తెలిసిందో, తన వాటాకు రావలసిన డబ్బులు ఇచ్చెయ్యమని వెంకట్రావు తన తమ్ముడి నడిగాడు. ఎంతడిగినా రాంబాబు ఇవ్వలేదు. ఇక ఇలా కాదని వెంకట్రావు తన భార్య రత్నాన్ని ఎగదోసాడు. ఆమె వెళ్లి రాంబాబు భార్య ముత్యాలుని డబ్బులడిగింది. డబ్బులు గిబ్బులు ఏమీ లేవు పొమ్మంది ఆమె. 'దీనికి ఇలా కాదు' అని నిన్న ఆ విషయాన్ని మోసుకెళ్లి ఆమె అమ్మగారి, అన్నగారి తరఫువాళ్ల చెవుల్లో ఊదింది. అంతే... వాళ్లొచ్చి ముత్యాలు ఇంటిమీద పడ్డారు. మొఖామొఖాలు చూసుకోకుండా మాటా మాటా అనుకున్నారు.

"ముత్యాలూ ఇదేం పద్ధతిగాదు. మా డబ్బులు పడేసుకుంతే వల్లకుంతామనుకుంతన్నావా?" అని కోప్పడింది అన్న పెళ్లాం రాజ్యలక్ష్మి.

ఆమె అలా అడుగుతుంటే పక్కనుండి రత్నం "అదీ అలాగడగండి దాన్ని! ఈ ముండకింకా ఏటి సాల్లేదో.. ఊరోళ్ల సొమ్ముడీసుకోనానికి..." అని నోరు జారేసింది.

"ఇదుగో ముండా గిండా అన్నావంతే మరియాద దక్కదు. నోరు తిన్నగా రానియ్యి, నేకపోతేనా?" అని ఒంటికాలి మీద లేచింది ముత్యాలు.

"నేకపోతే ఏటి సేత్తావే? ఆఁ... ఏటి సేత్తావ్? ఆఁ ఏటి సేత్తావంటా!" అని ఆమె మీదకు వెళ్లింది రత్నం.

"ఏహోలే... మీదమీదకొత్తన్నావ్. తంతావా? ఏది తన్ను సూద్దాం" అని ఎదురెళ్లింది ముత్యాలు.

"ఏటే తన్నడం మా గొప్పంటే. రాయే నా సవితి... రా, తన్ని సూపిత్తాను రాయే..." విడిపోయిన జుత్తు ముడేసుకుని ఆమె

మీదకు ఉరికింది రత్నం. ఇద్దరూ రోడ్డుమీద కలబడ్డారు. జుట్టు పట్లు పట్టేశారేమో, ఒకపట్టాన వాళ్లని విడిపించడం కుదర్లేదు.

ముత్యాలు జబ్బ పట్టుకుని ఆమె భర్త రాంబాబు ఆమెను వెనక్కి లాగుతూ, “ఒరే! మాటలు తిన్నగా ఆడమని నీ పెళ్లానికి సెప్పు, బాగా నోరొదిలేత్తంది అది!” అన్నాడు.

ఆ మాటకి “వోరేట్రా నా పెళ్లానికి నువ్వు నీతులు సెప్పేదీ? ముందు నీ పెళ్లం నోరు మూయించు! అసలుకి దాన్ది నోరా, తాటిపట్టా?” అని తన భార్య రత్నం చేతిని వదిలేసి రాంబాబు మీదకు వెళ్లాడు వెంకట్రావు.

“ఇందాకట్నించి సూస్తన్నాను, ఏట్రా తెగ నీలుగుతున్నావ్?” కొట్టడానికి తయారయ్యాడు రాంబాబు.

వెంకట్రావు ఎర్రెత్తిపోయాడు. “నా కొడకా... ఈయేళ నీ పని అయిపోనాదిరా! అదేపోన్లే తమ్ముడివని వూరుకుంతుంటే ఓ రెచ్చిపోతన్నావ్!” అంటూ అరుగుపక్కన కర్రల మోపులోంచి కర్రనొకదాన్ని ఎక్కలాగి రాంబాబుపైకి ఎత్తాడు. ఇంకొక్క క్షణం ఆలస్యమైతే దెబ్బ అతగాడి నెత్తిని పగలగొట్టేదే! అంతలో వచ్చి అప్పలనాయుడు కర్రకు అడ్డం పడ్డాడు. ఆ దెబ్బ అతడి నెత్తిమీద పడింది. తలకాయ ఓ చోట చిట్లింది. “అబ్బా!” అని అరుస్తూ నేలకూలాడు అతడు. ఆ అరుపుతో, అక్కడి వాతావరణం మారిపోయింది. రాంబాబు, వెంకట్రావు, ముత్యాలు, రత్నం నిశ్చేష్టులై నిలబడిపోయారు. జనం మూగేశారు.

“అమ్మో! సంపేసినార్రో... అప్పల్నాయుడిని సంపేసినార్రో...” సత్తింబాబు అందర్నీ తోసుకుని ముందుకొచ్చి కిందపడిన అప్పలనాయుడిని ఒడిలోకి తీసుకున్నాడు. అప్పలనాయుడి తల నుండి రక్తం ధారగా కారుతోంది. సత్తింబాబు ఆందోళనగా “ఏటర్రా అలా దిక్కులు సూత్తన్నారు. ఆస్పత్రికి తీసుకుపోదాం... ఎవులైనా బండట్టుకురండి!” అని కేకలేశాడు. ఆ కేకలతో తెలివిలోకి వచ్చిన రాంబాబు స్కూటర్ పట్టుకొచ్చాడు. అప్పలనాయుడిని మధ్యలో కూర్చోబెట్టి అతడిని కాచుకుంటూ వెనక కూర్చున్నాడు సత్తింబాబు. మేడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపోయాడు రాంబాబు.

“ఇక్కడికెందుకు తీసుకొచ్చినావురా? ఓ డాట్టరుంతాడా, మందులుంతాయా?” కారుతున్న నెత్తురును తుండుగుడ్డతో తుడుచుకుంటూ బండి దిగాడు అప్పలనాయుడు. సత్తింబాబు అతగాడి భుజాలు పట్టుకుని లోనికి నడిపించుకుంటూ తీసుకువెళ్లి “డాట్టరుబావు నేడా?” అని అడిగాడు. లేరని నర్సమ్మ చెప్పింది.

“అమ్మా! కిందపడిపోయి నెత్తికి దెబ్బ తగిలినాది... కాస్త నువ్వయినా కట్టు కట్టమ్మా” అనడిగాడు సత్తింబాబు. “అయోడిన్ లేదు... కాటన్ నిన్ననే అయిపోయింది. ఆర్ఎంపీ డాక్టరు దగ్గరకి తీసుకుపో!” అని చెప్పిందామె.

ఆస్పత్రినుండి బయటికొచ్చేశారు. అప్పలనాయుడు అంత బాధలోనూ “అదిరా మన ఆస్పత్రి పరిస్తితి. ఆ పథకం ఈ పథకమని వైద్యగం పైవేటోడి సేతిలో ఎట్టీనారు. ప్రభుత్వ ఆస్పత్రులు కుష్టురోగం పట్టిపోనాయి. కాటన్ గుడ్డకి కూడా కరువే. మన సొమ్ముని దోసుకుని మనకే ఎసరెట్టే ఏ నాయకుడికీ ఓటెయ్యొద్దని అందుకేరా సెప్పేదీ. మీరు మాటినుకుంతన్నారా?” అని ఆవేశపడ్డాడు.

“సర్నే వల్లకుందు” అని చెప్పి అతగాడిని అక్కడనుండి ఆర్ఎంపీ డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లారు.

“పెద్ద దెబ్బేం కాదు” అని మూడు కుట్లు వేసి, మందురాసి, కట్టు కట్టాడు ఆ డాక్టరు.

అప్పలనాయుడిని ఇంటికి తీసుకొచ్చేశారు.

జరిగిన గొడవ మీద వీధిలో చర్చోపచర్చలు సాగిపోతున్నాయి. అప్పలనాయుడిని తీసుకొస్తుండడం చూసి అందరూ కిమ్మనకుండా వుండిపోయారు. అప్పలనాయుడిని బండి దింపి అతని ఇంటి అరుగు మీద కూర్చోబెట్టారు.

పెద్దకొడుకు వెంకట్రావు, వీధి కాలువ మదుం మీద కూర్చుని తిట్ల దండకం చదువుతూనే ఉన్నాడు. వీధిలో వాళ్లు ఒకళ్లిద్దరు, "వల్లకో బాబూ... గొడవపడకండి" అని సముదాయించబోయారు. విన్లేదు అతడు. అతగాడి మాటలు అప్పలనాయుడికి కంపరం పుట్టించాయి. విని ఊరుకోలేక, "అసలుకి ఆడేటి సేసినాడని? ఆడ్ని కొట్టవలసిన పనేవొచ్చింది నీకు?" అనడిగాడు వెంకట్రావుని అంత బాధలోనూ.

"ఆడేటి సేసినాడా? ఏటి సేసినాడో ఆడ్నే అడుగు!" అన్నాడు వెంకట్రావు.

"ఏటి సేసినావురా నువ్వు?" అని రాంబాబు నడిగాడు అప్పలనాయుడు.

వెంకట్రావు భార్య రత్నం అందుకుంది. "ఆ బావేటి సెప్తాడు... సెప్పుకుంటే సిగ్గు. నాను సెప్తాను యిను మాయ్యా! నిన్న రాములోరి గుడిదగ్గిర అర్ధరేతిరికాడ తెలుగునాడు పార్టీవోళ్లు గుట్టుసప్పుడు కాకండా డబ్బులు పంచినారు. మాకని, మా తరుపోళ్లకని యిచ్చిన డబ్బులు కూడా ఆ బావే పడీసుకున్నాడు. మాకిమ్మని డబ్బులు యిచ్చినారంట కదరా అని నా మొగుడు ఆ బావుని అడిగినాడు. ఆ బావు డబ్బులు గిబ్బులు ఏటీ యియ్యలేదని అబద్ధం ఆడీసినాడు. ఆళ్ల పిల్లోని మీద ఒట్టీసి ఆ మాటే సెప్పమన్నాం. ఆ... మేవు అబద్ధాలాడతామా అని తిరిగి మామీద గొడవకి దిగినారు." చెప్పిందామె ఉక్రోషంగా.

"బావుందమ్మా... శానా బావుంది. ఆళ్లు సేసిన పనీ, మీరు సేసిన పనీ, అతగాడెవుడో ఎలచ్చన్లలో ఓటేయమని డబ్బులియ్యడం... ఆ డబ్బులికి కక్కుర్తిపడి అన్నదమ్ములిద్దరూ కొట్టుకోడం.. శానా బావుందమ్మా! ఆళ్లకి బుద్ధినేకపోతే పోనాది, మీకేటి సిగ్గునేకపోనాదమ్మా? జుత్తులట్టుకోని, తన్నుకోనానికి!" కోడళ్లిద్దరికీ చీవాట్లేశాడు అప్పలనాయుడు. కిమ్మనలేదు వాళ్లు.

"ఓరే రాంబాబూ! మొన్నామద్దెన తిలక్ బావొచ్చి ఏం సెప్పి ఎళ్లినాడురా? ఓటుకి డబ్బులు తీసుకోవద్దని సెప్పినాడా, లేదా? డబ్బులు పంచే నాయకుడికి ఓటెయ్యొద్దని సెప్పినాడా, లేదా? అయినా మన గ్రేమాన్ని ఇంతకాలం ఏటి ఉద్ధరించీసినారని ఈ నాయకులకి ఓటెయ్యడం సెప్పు! ఎమ్మెల్యేబాబు ఆళ్ల కల్లాలకి తారు రోడ్డేసుకున్నాడు గానీ, మనూరి మట్టిరోడ్డుపైన ఇంతవొరకు తారు పోయించినాడా? ఏం సిగ్గు నేదురా మనకి ఓటెయ్యనానికి! ఊళ్లో ఎవులూ డబ్బులు తీసుకోకుండా సూత్తానని నువ్వు కూడా ఆరోజున తిలక్ బావుకి మాటిచ్చినావుగదరా... మరిప్పుడు నువ్వు సేసిన పనేటిదిరా!" నిలదీశాడు.

గొడవ సాగుతూనే వుంది.

★★★

ఇంతలో విషయం తెలుసుకుని డెమోక్రటిక్ సొసైటీ అధ్యక్షులు తిలక్ హుటాహుటిన మేడివాడకి చేరుకున్నాడు. తిలక్ రావడం చూసి అందరూ గమ్మునుండిపోయారు. తల పగిలిన అప్పల్నాయుడిని పరామర్శించాడు తిలక్. అప్పలనాయుడు

ఆయన చేతుల్ని పట్టుకుని "సూడండి బాబూ... ఈ ఎధవలు ఎంత పని సేసినారో.." అని జరిగిందంతా వివరించాడు.

"ఓటుకు నోటు తీసుకోవడమే తప్పు! పైగా అలా తీసుకున్న డబ్బుల కోసం వీధినపడి కొట్టుకోవడమా? ఛ... ఛ... పార్టీలు వేసే ముష్టికోసం మనం ఇంతగా దిగజారిపోవాలా?" అని పెదవి విరిచాడు తిలక్. విచారస్వరంతో, "మార్పునకు నాంది పలుకుతారని ఆశించాను. ఓటుకు నోటు తీసుకోవద్దని మీకు మరీ మరీ చెప్పి వెళ్లాను. పార్టీలవాళ్లు ఇచ్చిన డబ్బు, మద్యం ముట్టకుండా 'ఏ పార్టీ మాకొద్దు' అని నోటా గుర్తుకు ఓటేసి ఉద్యమానికి ఊపునిస్తారని ఎంతగానో ఆశించాను. నా ఆశల్ని మంటగలిపేశారు!" అని ఆవేదన చెందాడు.

అపరాధభావంతో జనంలో కొందరు తలలు తిప్పేసుకున్నారు.

"ఈవేళ పార్టీల డబ్బుల పంపకాలప్పుడు మీరు పడుతున్న గొడవలు చూస్తుంటే నాకో విషయం గుర్తుకొస్తోంది. అది మన తాతలనాటి సంగతనుకోండి. అప్పట్లో తొలకర్లు కురిసినంతనే కరణంగారి జీతగాడు మాల మాదిగలు, కొన్ని శూద్ర కులపువాళ్ల వద్దకు పోయి కరణంగారి అరికలు కట్టాలి... యింటికొకడు చప్పున రండిరా అని చెప్పెళ్లేవాడు. కరణం పొలమంటే కనుసూపు మేర పొలం! చుట్టుపక్కల వూళ్లనుండి కూడా అరకలు వచ్చేవి.. దున్నడం, దుక్కికొట్టడం ఓ తిరణాల్లాగా సాగేదంట. మాలమాదిగోళ్లు, కూటికి లేని శూద్రపోళ్లు మధ్యాహ్నం ఎప్పుడవుతుందా అని ఎదురు చూసేవారంట.

ఎందుకు? మధ్యాహ్నమైతే కూటి కావిళ్లు వచ్చేవి. అదే కూలి! వేరే కూలి ఏదీ ఉండేదికాదు. ఆ కూటి కావిళ్ల వైపు వాళ్లు వెర్రిగా చూసేవారట! కూలోళ్లు వరుసగా కూర్చుంటే జీతగాళ్లు తాటాకు రేకుల్లో వడ్డించేవాళ్లు. పచ్చడికోసం పోట్లాడుకునేవారంట. పచ్చడి నీకెక్కువ పడిందంటే, నీకెక్కువ పడిందని తిట్టుకునేవారంట. ఒక్కోసారైతే కొట్టుకునేవారు కూడానంట. కూలోళ్లు పచ్చడి మెతుకులకోసం తిట్టుకుని కొట్టుకుంటుంటే గట్లమీద కూర్చుని కరణం, తోటి పెద్దలు వినోదం చూసేవారట!

దుక్కులప్పుడే కాదు, నాట్లు వేసేటప్పుడు, కోతలప్పుడు, నూర్పులప్పుడు కూడా ఇదే తంతు! కుప్పలు నూర్చాక కరణం దానం కింద మూడు చేటల వడ్లు ఇచ్చేవాడు. ఆ తర్వాత కల్లాం గింజ వదిలేవాళ్లు. కల్లాంలో మిగిలిన ఆ తాలుగింజకోసం, నేల పగుళ్లలో పడిన వడ్ల గింజకోసం కూలిజనం తన్నుకునేవారు. ఆ గింజ కోసం గొడవ ఒక్కోసారి మాలపల్లి, మాదిగ పల్లెల మధ్య కూడా జరిగేది. అప్పుడు కరణమే కల్లాలు పంచి ఇచ్చేవాడు. కరణం ఎంత ధర్మాత్ముడో అనుకునేవారు ఆ అమాయకజనం! అటు మాలవాళ్లకు గాని, ఇటు మాదిగవాళ్లకు గాని, అటుపైన శూద్రులకు గాని ఏ ఒక్కరికీ కల్లం తాలుగింజ మీద మాత్రమే కాదు, తమకు హక్కు ఉన్నది, కరణం గాదెల నిండా ఉన్న ధాన్యం మీద కూడా తమకు హక్కు ఉన్నదనే ఆలోచన వచ్చేది కాదు. ఏ కరణం వాళ్ళకు భూమి లేకుండాచేసి, వాళ్ల శ్రమని వెట్టిగా మార్చి దోపిడీ చేసేవాడో అతగానికే తమకు వాటాలు పంచమని పెత్తనం అప్పగించేవారు. ఆ వెర్రితనం ఎక్కడికీ పోలేదు. వాళ్లూ వీళ్లూ అన్న తేడాలేకుండా ఇప్పటికీ అన్నివర్గాల ప్రజల్లోనూ అది చెక్కుచెదరకుండా అలానే వుంది. ఏముంది ఆనాటికీ ఈనాటికీ తేడా? చెప్పండి?" అని ప్రశ్నించాడు.

జనం నుండి జవాబు లేదు!

"ప్రభుత్వం ప్రజలది. ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రజలవి. ప్రభుత్వ భూమి ప్రజలది. ప్రభుత్వ సొమ్ము ప్రజల సొమ్ము. ప్రజలు కట్టే పన్నులతోనే ప్రభుత్వాలు నడిచేది. ఎన్నికల వేళ మనకింత ఎరవేసి ఆ సొమ్మూ, భూమీ, ఆస్తిపాస్తులు దోచుకునేందుకు ఆ ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకుంటున్నాడు రాజకీయ నాయకుడు. అతగాడు తమ సొమ్మే కాజేస్తున్నాడని, తమ భూమే ఆక్రమిస్తున్నాడని, ఆ సొమ్మూ, భూమీ తమ ఉమ్మడి ఆస్తి అని ప్రజల గ్రహింపునకే రావడం లేదు. ఆ సొమ్మూ, భూమి అక్రమార్కుల పాలబడకుండా సద్వినియోగమైతే, ఇప్పుడు అనుభవిస్తున్న దౌర్భాగ్యపు జీవితం స్థానంలో ఎంతో మెరుగైన జీవితాన్ని అనుభవించవచ్చునన్న ఆలోచనే రావడంలేదు. ఆఁ... ఏముందిలే, అతగాడు ఎక్కడిదో భూమి ఆక్రమించుకుంటే మనకెందుకు? ఓ అరవై గజాలముక్క మనకి రాస్తే చాలనుకుంటున్నారు. ఏ పథకంలోనో అవినీతికి పాల్పడి వేల కోట్లు కొల్లగొడితే మనకేం పోయింది? ఎన్నికలనాడు ఓ వెయ్యో పయ్యో చేతిలో పెట్టాడా లేదా అని మాత్రమే చూసుకుంటున్నారు. ఎప్పటికి మారతారు మీరు? అసలెప్పటికైనా మారతారా అని..."

"మీ పిచ్చిగానీ బాబూ! ఈళ్లు మారతారా? మారరు బాబూ... మారరు!" నిర్వేదంగా పలికాడు అప్పలనాయుడు.

"మీ బతుకుల్లో మార్పు రావాలీ అంటే మారాలి అప్పలనాయుడూ... మారాలి!"

# కూలుతున్న గోడలు

డా. మామిడాల శైలజ

✆ 8500173819

*"ఒకసారి ఆలోచించయ్య! బండి మైలపడుతుందో లేదో కానీ, నువ్వు చేసిన ఉపకారానికి వాళ్లు జీవితాంతం నిన్ను గుండెల్లో పెట్టుకుంటారు. వాళ్లు కులానికి తక్కువ కానీ గుణానికి కాదయ్యా. సాయం చేస్తే ప్రాణం ఇచ్చే రకం! దీనివల్ల ఊర్లో నీ స్థాయి పెరుగుతుందే గాని తగ్గదు, జర సోచాయించు."*

తూర్పు తలుపులు తెరుచుకొని బాలభానుడు తన పసిడి కిరణాలతో వెలుగులను ప్రసరిస్తూ లోకసంచారానికి సన్నద్ధం అవుతున్నాడు. రాగేశ్వరి నది అలల తరంగాలతో భూపాలరాగం ఆలపిస్తూ తన ఆత్మీయనేస్తానికి సాదర స్వాగతం పలుకుతోంది. నది పొడవునా పచ్చని పైరులు వాటి మధ్య వాగులు రకరకాల అడవి చెట్లు గాలికి తలలూపుతూ, చిరకాల మిత్రుల ఆలింగనానికి మురిసిపోతున్నాయి.

అప్పటివరకు కొమ్మల్లో దాగిన పంచవన్నెల పక్షులు తమ కలకూజితాలతో ప్రకృతి ఆస్వాదనకు బయలుదేరాయి. దూరంగా చేదారమ్మ ఆలయ జేగంటలు ఆ ఉషోదయ సమీర తరంగాలలో వలయాలు వలయాలుగా, దొంతరలుగా ఊరంతా పరుచుకొని తన్మయత్వానికి గురి చేస్తున్నాయి. పచ్చని ప్రకృతి ఒడిలో నిశ్శబ్దంగా ఒదిగిన ఒంటిమిట్టపల్లి ఊరుని తిలకించడానికి రెండు కళ్ళూ చాలవు అన్నట్లుగా ఉంది.

రాత్రంతా నిదురమ్మ ఒడిలో సేదతీర్చుకున్న ఊరి ప్రజలు జీవచైతన్యాన్ని ప్రోది చేసుకుంటూ, ఆరోజు దినచర్యకు సన్నద్ధం అవుతున్నారు. చాగంటి రేవు నుంచి గాజుపల్లికి, గాజుపల్లి రేవు నుంచి చాగంటికీ వెళ్లాల్సిన ప్రయాణికులు రెండు పక్కల రేవుల్లో పడవ కోసం వేచి చూస్తున్నారు. తెల్లవార్లు పడవల మీద నదిలో చేపలవేట సాగించిన మత్స్యకారులు, వాటిని మార్కెట్లో అమ్మడానికి ఆరాటపడుతూ వలలోని చేపలను సంచులలో నింపుతున్నారు.

ఎటు వెళ్లాలన్నా పడవ మీద తప్ప బయట ప్రపంచంలోకి అడుగుపెట్టలేని ఆ ఊరిలో, వంద గడపలకు మించి ఉండవు... ఊరి శివార్లలో ఉన్న రెండు దళితవాడల్లోని పూరిగుడిసెలను కలుపుకొని! పడవదారిని కాకుంటే, ఎగుడుదిగుడు మట్టిరోడ్డు నుంచి ద్వారకానగర్ మీదుగా ఎటువంటి ప్రయాణ సౌకర్యాలు లేని దారిలో రెండు వందల కిలోమీటర్ల పైగా ప్రయాణించాల్సి ఉంటుంది. అది ఆ ఊరి వారికి సాధ్యం కాని పని. అందుకే బయట ప్రపంచం చూడాలంటే రేవు దారే శరణ్యం.

రేవు దాటి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న కాసింగూడలోని స్త్రీ శక్తి బ్యాంకులో చప్రాసిగా పని చేసే గౌరమ్మ పడవ దిగి ఎదురుగా వస్తున్న ఊరి ప్రజలందరినీ ఆత్మీయంగా పలకరిస్తోంది. ఎనిమిదవ తరగతి చదివి బ్యాంకులో పనిచేసే గౌరమ్మను గొప్పగా చూస్తుంటారు ఊరంతా. ఎందుకంటే ఆ ఊరిలో చదువుకున్న వాళ్ళు చాలా తక్కువ.

“అగో ఎవరు మన సువార్తమ్మలాగా కొడుతోందే.” గౌరమ్మ వెనుక మాటున బ్యాగులతో నిలబడి ఉన్న అమ్మాయిని చూస్తూ అన్నాడు.

“సువార్తమ్మలాగా కొట్టడం కాదు… సువార్తమ్మే! సెలవులు ఇచ్చారట అవ్వ, బాపులను చూడడానికి వస్తోంది!”

“బాగున్నవానే సిద్దయ్య తాత. అవ్వ ఎట్టా ఉంది? నేను పోయే ముందు పానం బాగాలేదు కదా ఇప్పుడు నిమ్మలమేనా?” నవ్వుతూ పలకరించింది సువార్త.

“అబ్బో నా తల్లే… పట్నం పోయి పెద్ద సదువులు సదువుతున్నా ఎవ్వల్ని మర్శిపోలేదు. అవ్వకేం బాగానే ఉంది సువార్తమ్మా. నువ్వేం ఇట్టా వచ్చావు పరీచ్చలు అయిపోయాయా?”

“పరీక్షలు అయిపోలేదు తాతా నాలుగు రోజులు సెలవులు ఇచ్చారు. అవ్వ బాపులను చూడాలని మనసు పుట్టింది. అందుకే రెండు రోజుల కోసమని వచ్చా…”

“అవునా! చల్లంగుండు బిడ్డ… పెద్ద చదువులు చదివి ఊరుకు మంచిపేరు తేవాలి. గొప్పదానివి కావాలి” అంటూ ఆశీర్వదించి ఊరిబాట పట్టాడు సిద్ధయ్య.



ఐదు అడుగుల నాలుగు అంగుళాల ఎత్తు, చామన చాయతో మంచి కనుముక్కుతీరుతో ఉన్న సువార్త అందర్నీ కలుపుగోలుగా పలకరిస్తూ గౌరమ్మతో ఊరి గురించి విచారిస్తూ నడవసాగింది.

“సువార్తమ్మా నువ్వేనా! గురుతే పట్టలేదు ఎంతగా మారిపోయావో... దొరసానమ్మలాగా ఉన్నావు ఏంటి పరీక్షలు అయిపోయాయా ఊరు వచ్చావు?” దారిలో పలకరించాడు కమ్మరోళ్ల సాంబయ్య.

“సెలవులకు వచ్చాను మామ... అత్త, సూర్యం కులాసాగా ఉన్నారా? సూర్యంగాడు బాగా చదువుతున్నాడా?” ఆరా తీసింది సువార్త.

“అంతా బాగే బిడ్డ... ఆడికి ఇప్పుడిప్పుడే అచ్చరాలు పట్టుబడుతున్నాయి. నువ్వు మాత్రం బాగా చదువుకో బిడ్డ. ఈ ఊరి ఆశలన్నీ నీ మీదనే. నేను మాపటేల వచ్చి కలుత్తలే!”

అలా నడుస్తూ ఆగిపోయింది సువార్త. ఊరి మధ్యన ఎన్నేళ్ల వయసో కూడా చెప్పలేని రావిచెట్టు, కొమ్మలు సాచి విస్తరించి ఉంది. దాని కాండం చుట్టూ నాపరాళ్ళతో నిర్మించిన రచ్చబండ. అక్కడక్కడ పెచ్చులు ఊడినా రాజసంగానే కనిపిస్తోంది. చిన్నప్పుడు ఆడుకున్న సంగతులు గుర్తుకు వచ్చి, ఒక్కసారి దాన్ని ఆప్యాయంగా తడిమి, కాసేపు సేదతీరిన సువార్తమ్మ గౌరమ్మతో “చాలా రోజులవుతుంది ఊరిని చూసి మనసుకు తృప్తిగా ఉంది గౌరమ్మ...” అంటూ వీపు మీద ఉన్న బ్యాగును ఒకసారి ఎగదోసి చేతిలో సంచిని పట్టుకొని ముందుకు కదిలింది.

ఆ చెట్టుకు పక్కగా దక్షిణ ముఖంలో ఉన్నది పటేల్ పెంకుటిల్లు. ఊరి పెద్ద రైతు పటేల్ రామ నరసయ్య ఇల్లు హుందాగా కనిపిస్తోంది. మంగుళూరు పెంకులతో మట్టిగోడలపై సన్నని దూలాలు పెట్టి, గోడ పైనుంచి ఏటవాలుగా వాసాలు అమర్చి, వాటిపై అడ్డంగా సన్నని చెక్కలు వేసి నిర్మించిన పక్కా ఇల్లు అది.

ఆ ఇంటి వసారాలో రాజహంసలా నిలబడి ఉన్న తెల్లని కారును పైపుతో నీళ్లు పడుతూ మిలమిలా మెరిసేలా రుద్దుతున్నాడు రాజీరు. ఊరిలో తన అధికారానికి గుర్తుగా ఉన్న ఆ కారును పెద్దగా వాడకపోయినా మధ్య మధ్యలో వచ్చి అపురూపంగా చూసుకుంటాడు పటేల్. రోజుకు రెండుసార్లు దానిని తుడిపించి చిన్న దుమ్ము రేణువు పడకుండా జాగ్రత్తపడతాడు. ఊరందరిలో కారు ఉన్నది ఒక పటేల్‌కే. పటేలు ఇద్దరు కొడుకులు పట్నంలో ఉద్యోగాలు చేస్తున్నారు.

“ఒరే రాజీరూ! కారు తుడవడం అయిపోయిందారా గుడ్డ కప్పావా?” అంటూ బయటకు చూసిన రామనరసయ్య దూరంగా వెళ్తున్న గౌరమ్మ, సువార్తలను పరిశీలనగా చూస్తూ “అరే గట్ల పోతున్న పోరి ఎవర్రా? మాదిగ అంజయ్య బిడ్డ లాగా కొడుతోంది... అది పట్నంలో చదువుతున్నది కదరా?” అన్నాడు.

“అలా కొట్టుడు కాదయ్యా అంజయ్య బిడ్డనే. పట్నం నుండి అయ్య, అవ్వలను చూడ్డానికి వస్తున్నట్టుంది.” అన్నాడు రాజీరు కారును తుడవడం ముగించి పశువులకు గ్రాసం పెట్టడానికి దొడ్డి వైపు నడుస్తూ.

“ఓరి... ఓరి పట్నం నీళ్లు బాగా వంట బట్టాయిరా, పోరికి ఒళ్ళు చేసి రంగు తేలింది”

“ఏమయ్యో ఏం చేస్తున్నావు ఇడ్డెన్లు వడ్డించాను తిందువు గాని రా” అని “ఒరే రాజీరూ.. నీక్కూడా ఇక్కడ పెట్టాను తిని పో”

అంటూ మూడు ఇడ్లెన్లు , పల్లీల పచ్చడి ఉన్న గిన్నెను అరుగు మీద పెట్టింది పటేలమ్మ.

సాలోచనగా అటువైపే చూస్తూ పంచె కాలితో పైకి అనుకొని ఎగ్గట్టి లోపలికి వెళ్ళాడు రామనరసయ్య.

గుడిసెలో చెరోవైపు కూర్చొని, టీ నీళ్లు తాగుతున్న అంజయ్య, మరిదమ్మలు బిడ్డను చూసి ఒక్క ఫలాన లేచి “ఏంది బిడ్డ! చెప్పా పెట్టకుండా ఇట్టా వచ్చావు పానం గాని బాగా లేదా?” అంటూ దగ్గరికి వచ్చి సంచి అందుకుంటూ గాబరాగా అడిగింది మరిదమ్మ.

“ఏంది బిడ్డ ఏమైంది?” కంగారుగా అన్నాడు అంజయ్య.

“బాగానే ఉన్నానే! కానీ రోజొక్క తీరుగా కలలోకి వస్తున్నారు మీరు. పరీక్షలకు సిద్ధం కావడానికి నాలుగు రోజులు సెలవులు ఇచ్చారు కదా... మిమ్మల్ని చూడాలనిపించి ఇట్టా వచ్చాను” అంది కళ్ళల్లో నీళ్లు తిరుగుతుండగా.

అంజయ్య, మరిదమ్మలకు ఒక్కగానొక్క కూతురు సువార్త. చిన్నప్పటి నుంచి చదువులో చురుకుదనం చూసి బల్లో పంతుల్లందరూ పెద్ద చదువు చెప్పిస్తే గొప్పది అవుతుందని చెప్తే, మాదిగపిల్లకు చదివెందుకని పెద్ద కులపోల్లు అంటున్నా వినకుండా, అందరికీ సమాధానం ఇచ్చి నానా కష్టాలు పడి పట్నంలో చదివిస్తున్నారు ఆ దంపతులు.

కాసేపు స్థిమితపడ్డాక ఆప్యాయంగా బిడ్డ తల నిమురుతూ “మాటిమాటికి మా మీద బెంగెట్టేసుకొని ఇలా వత్తే సదువెట్ట సాగుతాది బిడ్డ. నువ్వు పెద్ద కలెక్టరమ్మ అయ్యి ఊరుని ఉద్ధరించాలి. ఊరికి రోడ్డు వేయించాలి, బళ్ళు కట్టించాలి...”

తండ్రి మాటలకు అడ్డుపడుతూ “లే నాయనా నేనెప్పుడూ నా లక్ష్యం యాది మరువలే. ఎట్టయిన కలెక్టర్ అయ్యి ఈ ఊరికి, మీకు మంచి పేరు తెత్తా” విశ్వాసంగా అంటున్న బిడ్డను మురిపెంగా చూసారు ఇద్దరూ.

సువార్తమ్మ ఊరికి గొప్ప పేరు తెస్తుందని మాదిగ వాడంతా ఆశలు పెట్టుకున్నారు. రేవుకు ఆవల ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న విధారావుపేట ఎస్సీ హాస్టల్లో ఉండి చదువుతోంది సువార్తమ్మ . ఇప్పుడు డిగ్రీ ఫైనల్ ఇయర్ చివరి ఎగ్జామ్స్ రాస్తుంది. తర్వాత కలెక్టర్ చదువును అక్కడి పంతుళ్ళు ఉచితంగా చదివిస్తామని హామీ ఇచ్చారు.

అప్పుడే ఎలా తెలిసిందో కానీ సువార్తమ్మ వచ్చిందని మాదిగవాడ జనం అంతా చూసి పోవడానికి ఒక్కొక్కరే రావడం మొదలుపెట్టారు.

★★★

“వెళ్తున్నావా సువార్తవ్వా! జాగ్రత్తగా వెళ్ళు పరీచ్చలు బాగా రాయి” దారి పొడుగునా అందరూ పలకరించే వారే ఆశీర్వదించేవారే!

రెండు రోజులకే తిరిగి వెల్లాలనుకున్నా నాలుగవ రోజుకు గానీ బయలుదేరలేకపోయింది సువార్త. తెల్లారితే పరీక్షలు. మనసులో ఆందోళనగా ఉన్నా బాగా రాస్తాననే ఆత్మవిశ్వాసం ఆమెను నిబ్బరంగా ఉంచుతోంది.

వీళ్ళిద్దరిని చూడగానే ఓడ మల్లన్న చెట్టుకు కట్టేసి ఉన్న, ఓడ తాడు విప్పదీసి గెడ కర్రనందుకొన్నాడు. సువార్తతో పాటు రేవు మీద ఉన్న అందరూ ఎక్కగానే సరంగు అప్పన్న సాయంతో ఓడను అడుక్కు అదిమిపడుతూ మెల్లమెల్లగా నదిలోకి తోయడానికి ప్రయత్నించాడు మల్లన్న.

చాలా సేపు ప్రయత్నించాక గాని అర్థం కాలేదు పడవ అడుగు భాగంలో ఏదో అడ్డు పడుతుంది. ఇంతలో ఒకేసారి పడవ కుడి భాగం నుంచి నీరు వెల్లువలా పడవలోకి రావడం మొదలైంది. అదిరిపడ్డాడు మల్లన్న.

“ఒరేయ్ అప్పిగా గూడెం వెళ్లి వడ్ల వెంకన్నను సరంజామా పట్టుకుని రమ్మను పో... జల్ది” అని కేకేశాడు.

ఈ అనుకోని అవాంతరానికి దిగాలు పడిపోయింది సువార్త. ఇప్పుడు బయలుదేరితేనే సాయంత్రం వరకు పట్నం చేరుకోవచ్చు. తెల్లారితే పరీక్షలు! ఇప్పుడు గనుక పడవ నడవకపోతే తన పరిస్థితి? కళ్లు వర్షించడానికి సిద్ధంగా ఉన్న మేఘాల్లా అయ్యాయి.

“బుజ్జమ్మ... నువ్వు బుగులు పడకు, కూసింత ఓపిక పట్టు. అగో వెంకన్న రానే వస్తున్నాడు. ఏమైందో చూసి వెంటనే బాగు చేసేస్తాడు!”

ఉరుకులు పరుగుల మీద ఒగర్చుకుంటూ వచ్చిన వెంకన్న అరగంట సేపు ప్రయత్నించిన తర్వాత, పడవను బాగుచేయడం తన వల్ల కాదు అని చేతులెత్తేశాడు.

అది విన్న సువార్తమ్మ కళ్ళు జలజలా వర్షించడం మొదలుపెట్టాయి. అప్పటివరకు ఆరారగా తిరుగుతున్న ఆకాశంలో నల్లమబ్బులు భోరున కురుస్తూ సువార్త గుండెల్లోని దుఃఖానికి ప్రతీకగా నిలిచాయి. పుస్తకాల సంచి తడవకుండా ప్లాస్టిక్ కవర్ చుట్టింది గౌరమ్మ.

“ఇదేందిరో కాలంగాని కాలంలో ఈ పాడు వాన! అసలే పడవ గిట్ట అయిందని సోచాయిస్తుంటే” మల్లన్న తల పట్టుకుంటూ అన్నాడు.

ఈ సంగతి తెలిసి వానను సైతం లెక్కచేయకుండా ఓడ పని తెలిసిన వాళ్ళందరూ పడవను బాగుచేసే అవకాశాలన్నింటినీ చూశారు. చాలా కాలం క్రితం నాటు పడవ కావడం వల్ల అలా అయిందని ముక్తాయించారు.

ఆ మాటలు విని ఒక్కసారిగా కుప్పకూలి పోయింది సువార్త. అందరి కళ్ళల్లోనూ నీళ్లు సుడులు తిరిగాయి. తమ ఊరిని ఉద్ధరిస్తుందనుకున్న ఒకే ఒక్క ఆశాకిరణం సువార్త పరీక్ష రాయకుండా అయిపోతున్నదే అన్నదే వాళ్ళ బాధ!

★★★

“అయ్యా పెద్దయ్య...” భార్య వేసిన వేడివేడి పకోడీలు ఆరగిస్తున్న రామనరసయ్య, ఈ వానలో ఈ సమయంలో ఎవరికి ఏం అవసరం వచ్చిందో అనుకుంటూ పళ్లెం పక్కన పెట్టి బయటికి వచ్చాడు.

“ఏందిరా మాదిగగూడెం అంతా ఇట్టా వచ్చారు వానలో, ఏంది కత?” అన్నాడు గుంపుగా నిలబడి ఉన్న జనాలను చూస్తూ.

“అయ్యా తమరి నుంచి ఒక సహాయకం కావాలయ్యా...” చేతులు కట్టుకొని అన్నాడు గంగయ్య.

“ఏందో అడుగుండ్లిరా సల్ల కొచ్చి ముంత దాసుడు ఎందుకు?”

“అదేనయ్యా మన ఊరి నుంచి బయట ప్రపంచానికి వెళ్లే ఒకే ఒక ఆధారం మన నాటు పడవకు కంత పడిందయ్యా...”

"అట్టానా, నేను ఎప్పుడో చెప్పాను కదరా 'దానికి కాలం అయిపోయింది జర జాగ్రత్త' అని! సరే పోండి కొత్త పడవ కొనడానికి పదోపరకో ఇత్తానులే దానికి ఈవేళప్పుడు రావాలా?"

"అందుకు కాదయ్యా వచ్చింది. మా సువార్తమ్మ లేదూ..."

"అదెవత్తి... ఓ అంజిగాడి బిడ్డ కదా, ఏమైంది దానికి?"

"ఏం కాలేదయ్యా! రేపు పొద్దున బిడ్డకు పట్నంలో పెద్ద పరీచ్చ ఉందయ్యా. రేపు పొద్దుగాల కల్లా అక్కడ ఉండాలి, ఇప్పుడు పడవ సూస్తేనేమో... " నాన్చాడు వెంకయ్య.

"అయితే ఏందిరా! ఈ ఏడు కాకపోతే వచ్చే ఏడు రాత్తది పరీక్ష... అయినా మాదిగ పోరికి చదువెందుకు అంటే అప్పుడే వినలేదు మీరు! నా మాట వినకుండా తలకు మించిన సాహసం చేస్తిరి. సక్కగా ఇండ్లల్లకు పోండ్లి వర్షం ఎక్కువ అవుతున్నది." పోవడానికి వెనక్కి తిరిగాడు.

"అట్టా అనకండి అయ్యా! అది మీ ఊరి పిల్ల. అది పెద్ద పరీక్షలు రాసి గొప్పదైతే మీకు గర్వమే కదా!" కాళ్ల మీద పడడానికి సిద్ధమవుతూ అన్నాడు సిద్ధయ్య.

"మాదిగ పోరి కలెక్టర్ అయితేంది, ముఖ్యమంత్రి అయితేంది? దాని బతుకు ఏడబోతది? దాని పుట్టుక ఏడబోతది? మీ మాదిగ బతుకులకు సదువులే వద్దంటే ఆడపోరిని కలెక్టర్ అని కంకరరాయి అని..." వెటకారంగా అంటూ వెనక్కి జరిగాడు రామనరసయ్య.

"దండం పెడతా అలా అనకండయ్యా! ఎలాగైనా మీ ఊరి బిడ్డ, మీరు తలుసుకుంటే రేపు పరీక్ష టైమ్ వరకు ఆయమ్మను పట్నంలో చేర్చగలరు. మాకు ఈ సాయం సేసి పుణ్యం కట్టుకోండయ్యా మీ ఉప్పు తిని బతకుతున్నం మా చర్మంతో చెప్పులు కుట్టిస్తాం."

"ఇప్పుడు నన్ను ఏం చేయమంటార్రా?"

చివరికి ధైర్యం చేసి అన్నాడు సుబ్బయ్య. "బాబయ్య జర మీ కారులో సువార్తమ్మను ఈ ఒక్క పాలి పట్నంలో దింపితే ఆయమ్మ పరీచ్చ రాస్తుందనీ"

ఒక్కసారిగా శివాలెత్తాడు పటేల్ "ఏందిరా మాదిగ లంజా కొడకా... ఎన్ని గుండెల్రా మీకు! ముట్టుకోవడానికే అర్హత లేనోళ్ళు నా కారునే ఎక్కుతానంటార్రా... దొబ్బేయిండ్లి ఇక్కడి నుంచి" కళ్ళెర్ర జేసి అంటూ, "ఒరేయ్ రాజీరుగా ఏడ సచ్చావ్, వాళ్ళందర్నీ బయటికి నెట్టై" అంటూ లోపలికి వెళ్లి దడాల్న తలుపు మూసుకున్నాడు రామ నరసయ్య.

"అయ్యా... అయ్యా అలా అనకండయ్యా ఈ ఒక్క పాలి సహాయకం సేయండయ్యా జన్మలో ఇంక మిమ్మల్ని ఏమీ అడగం..."

వర్షం ఉధృతికి ఆ మాటలు గాల్లోనే కలిసిపోయాయి..

"బాబాయి, పిన్నీ, నా ప్రాప్తం ఇంతే అనుకుంటాను. నావల్ల మీరు మాటలు పడవద్దు. దయచేసి ఇక్కడి నుంచి వెళ్ళిపోదాం పదండి!" అది సువార్త ఏడుస్తూ.

సువార్త మాటలను ఎవరూ లెక్క చేయలేదు. అంజయ్య, మరిడమ్మ పరుగు పరుగున వచ్చారు. వెలివాడలోని జనాలంతా అక్కడ చేరిపోయారు క్షణాల్లో.

రాత్రి పది గంటలు అయింది. రాంనర్సయ్య భోజనం కూడా కానిచ్చేశాడు. పటేలమ్మకు మాత్రం భోజనం సహించలేదు. ఆమె ఆలోచనలో పడిపోయింది. బయట నుంచి వారి ఆవేదనాపూర్వకమైన అభ్యర్థనలు, రోదనలు ఆమె చెవిని సోకుతున్నాయి.

"ఏమయ్యా" నెమ్మదిగా పిలిచింది.

"ఏందే..."

"అయ్యా... వాళ్ళంతా అక్కడే ఉన్నారయ్యా, ఒక్కళ్ళు కూడా కదలడం లేదు. చూస్తుంటే తెల్లారేదాకా ఇక్కడే ఉండేటట్టు ఉన్నారు."

"ఉంటే ఉండనీ... వాళ్ళ కర్మకు నన్నేం చేయమంటావు? చెబితే వినెనోళ్లను సావంగ చూడాలి" అన్నాడు వక్క నోట్లో వేసుకుంటూ.

"పోనీ అంతలా అడుగుతున్నారు కదా! ఈ ఒక్కతూరి ఆ పిల్లను మన కారులో..."

"ఏందే ఏమంటున్నావు? ఆ మాదిగ పోరిని..."

"పటేలమ్మ అడుగుతున్నారు కదయ్యా ఈ ఒక్కతూరి... పాపం పరీచ్చ అంటున్నారు కదా..!" రాజీరు నసిగాడు.

"ఏందిరా పాలేరు ముండా కొడకా! నువ్వు కూడా నాకు సలహాలు ఇచ్చేటోనివైనావ్రా?" గద్దించాడు రామనర్సయ్య.

"అది కాదయ్యా పాపం పిల్ల కట్టపడి చదివింది. ఊరు ఊరంతా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు దానిమీద..." ధైర్యం చేసి అన్నాడు.

పటేలమ్మ అందుకుంది "ఒకసారి ఆలోచించయ్యా! బండి మైల పడుతుందో లేదో కానీ, నువ్వు చేసిన ఉపకారానికి వాళ్లు జీవితాంతం నిన్ను గుండెల్లో పెట్టుకుంటారు. వాళ్లు కులానికి తక్కువ కానీ గుణానికి కాదయ్యా. సాయం చేస్తే ప్రాణం ఇచ్చే రకం! దీనివల్ల ఊర్లో నీ స్థాయి పెరుగుతుందే గాని తగ్గదు, జర సోచాయించు." లోపలికి వెళ్లిపోయింది పటేలమ్మ.

"అవునయ్యా అమ్మగారు చెప్పింది అక్షరాలా నిజం!" మొండిగా అన్నాడు రాజీరు.

లేచి నిలబడి సాలోచనగా చాలాసేపు అటు ఇటు పచార్లు చేశాడు రాంనర్సయ్య.

పది నిమిషాల తర్వాత గేటు తీసుకొని బయటికి వచ్చాడు. ఇంటిముందు చీకట్లో వర్షంలో తడిసి ముద్దయిపోయి గుంపుగా నిలబడి ఉన్న అందరూ ఉద్విగ్నంగా అటువైపు చూశారు.

“ఒరేయ్ రాజిగా కారు తీయిరా ఆ పిల్లను పట్నంలో తోలిరాపో” గట్టిగా అన్నాడు రామనరసయ్య.

అంత చీకట్లలోను గూడెంలోని జనాల కళ్ళల్లో వెలుగు కాంతులు స్పష్టంగా కనిపించాయి.

ఆ మాటలు సమాజంలో తరతరాలుగా అలుముకొని ఉన్న తారతమ్య గోడలను నిట్ట నిలువుగా చీల్చే పదునైన బాణాలుగా దూసుకు వచ్చి వెలివాడలోని ప్రజల చెవులకు వీనులవిందు చేశాయి.

# ప్రయాణం

కాళీపట్నపు పేర్రాజు

✆ 9441137947

***"మనిషికి ఏం బతుకులు వచ్చాయే తల్లి, పట్నాల్లోనే అనుకున్నా పల్లెటూళ్ళలో కూడా స్వచ్ఛమైన నీరు లేదూ, గాలి లేదు. తిండీ లేదు. అంతా కృత్రిమం, కాలుష్యం, కల్తీనూ. మా తరం కొంతైనా అనుభవించాం. పాపం మీకు అదీ లేదు. ఇలాంటి రోజులు చూస్తాం అనుకోలేదే తల్లీ!"***

"మామ్మా! మంచినీళ్లు కావాలా?" అంటూ అడిగింది సుభద్ర, అప్పుడే ఆటో దిగి ఇంట్లోకి వస్తున్న ప్రకాశమ్మగారితో.

"కావాలా అని అడుగుతావేమిటి సుభద్రా... అంత దూరం ప్రయాణం చేసి వచ్చారు కదా! అందులోనూ ఎండగా కూడా ఉంది తీసుకొచ్చి ఇవ్వు" అంటూ "ప్రయాణం బాగా జరిగిందా అత్తయ్యా?" అని ప్రకాశమ్మగారిని పలకరించి ఫ్యాన్ కిందకి కుర్చీ లాగుతూ కూర్చోమని చెప్పింది సావిత్రి.

మనుమరాలు తెచ్చిన గ్లాసును ఆత్రంగా అందుకుని గడగడ నీళ్లు తాగబోయి, రెండు గుటకలు వేసిన వెంటనే తాగడం ఆపేసి గ్లాసులోని నీళ్లవంక ఒకసారి పరీక్షగా చూసి గ్లాసుని కింద పెట్టేశారు ప్రకాశమ్మగారు.

'ఏమిటి అలా చూస్తున్నారు నీళ్ళని' అని అత్తగారిని అడగబోయి ఊరుకుంది సావిత్రి.

స్నానం చేసి వచ్చిన అత్తగారికి భోజనం వడ్డించింది.

భోంచేసిన తర్వాత చెంబుడు నీళ్ళు త్రాగడం అలవాటు ప్రకాశమ్మగారికి. అందుకని చెంబుతో నీళ్లు పెట్టింది. కానీ ప్రకాశమ్మగారు ఓ చిన్న గ్లాసులోకి నీళ్లు వంపుకొని 'తాగేను అనిపించుకున్నట్లుగా' తాగి గ్లాసు కింద పెట్టేసి లేచారు.

"నట్టింట్లో మంచం వేసాను అత్తయ్యా కొద్దిసేపు చేరబడండి!" అంది సావిత్రి వంటిల్లు సర్దుతూ.

కొద్దిసేపు నడుం వాల్చి, ప్రయాణపు బడలిక పూర్తిగా తీరకుండానే లేచి, ఆ రోజే ఇరుగుపొరుగుల పలకరింపులు పూర్తి చేశారు.

ఆ సాయంత్రం వంట చేస్తున్న కోడలి దగ్గర కూర్చుని తనెరిగి ఉన్న వాళ్ళందరి భోగట్టాలు తెలుసుకున్నారు.

రెండు రోజులపాటు అత్తగారి సందేహమేఘాలు అలా ఆ పూటా, ఈ పూటా ముసురులా ముసురుకొస్తూ ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఉన్నాయి.

కోడలు సమాధానాలన్నీసాఫీగా పారుతున్నవాగుల్లా సాగుతూనే ఉన్నాయి.

మధ్యమధ్య కొన్ని సంగతులు కోడలు సరిగ్గా చెప్పలేకపోయినప్పుడు ప్రకాశమ్మ ముఖంలో కోపపు మెరుపులు మెరుస్తూనే ఉన్నాయి.

మర్నాడు ఉదయం లేస్తూనే... కూర తరుక్కుంటున్న కోడలితో "సావీ... పెద్దాడు వచ్చి మళ్లీ నన్ను ఎప్పుడు తీసుకుపోతాడో, ఏమో తెలియదు.. ఈలోగా ఓసారి అన్నీ చూసొచ్చీయాలి. వేగిరంగా తెమిలి ముందు చింతమ్మతల్లి గుడికి, శివకోవెలకి వెళ్లి, అట్నుంచి అలా గౌరమ్మ వాళ్ళ అత్తగారిని చూసి వచ్చేస్తానే!" అన్నారు.

"అలాగే కాఫీ తాగి వెళ్ళండి. మీరు వచ్చేసరికి వంట పూర్తి చేస్తాను. మీ మనవరాలు ఉంది కదా! తీసుకెళ్తుంది." అంటూ "సుభద్రా... నువ్వు మీ మామ్మకి తోడుగా వెళ్ళు" అని కూతురికి చెప్పింది సావిత్రి.

ప్రకాశమ్మగారు గబగబా స్నానపానాదులు ముగించుకుని కాఫీ తాగి, వెంటనే బయలుదేరారు మనవరాలు సుభద్రతో.

ఇంటి నుండి కాలు బయట పెట్టడంతోటే ఆమెకు ఎందుకో గతం గుర్తొచ్చింది



సరిగ్గా డెబ్బైఏళ్ల క్రితం... తనకి అప్పటికి ఇంకా పద్నాలుగేళ్ళు. కొత్తగా చీరకట్టు నేర్చిన కొత్త సిగ్గుతో కాపురం చేయడానికి అత్తారింట తాను అడుగు పెట్టడం తనకింకా జ్ఞాపకం ఉంది. తరువాత రెండేళ్లకే పెద్దవాడు పుట్టడం. వరుసగా అయిదారేళ్లలో మరో మగపిల్లాడు, ఇద్దరు ఆడపిల్లలు ఈ ఊర్లోనే పుట్టి పెరగడం, ఉన్నఊర్లో చదువులయ్యాక మగపిల్లలు ఇద్దరూ చదువులకని పట్నం వెళ్లడం. ఆడపిల్లలకు పెళ్లిళ్లయి అత్తవారిళ్ళకు వెళ్లడం. పండుగలకు పబ్బాలకు, పురుళ్ళకు, పుణ్యాలకు వాళ్ల రాకపోకలు, మగపిల్లల చదువులు పూర్తి అవ్వడం, వాళ్ళ పెళ్లిళ్లు అంతా ఈ ఊళ్లోనే జరిగేయి.

తరువాత పెద్దాడు విజయవాడలో ఉద్యోగం చేస్తూ కాపురం పెట్టడం, చిన్నాడు ఊళ్లోనే వ్యవసాయం చూసుకుంటూ తండ్రికి తోడుగా ఉండిపోవడం, ఇంతట్లో హఠాత్తుగా ఆయన పోవడం, తరువాత కొన్నాళ్లకు పెద్దవాడు వచ్చి తనను బతిమాలి తన దగ్గరే ఉండమనడం, వాడి మనసు నొప్పించలేక తను బలవంతంగా బయలుదేరి వెళ్లడం, వాడికి అక్కడి నుండి హైదరాబాదు, మద్రాసు బదిలీ కావడం తను వాళ్ళతోటే ఆ ఊర్లు వెళ్లడం, వద్దాం వద్దామనుకుంటుండగానే పదిహేనేళ్ళు గడిచిపోవడం... అంతా సినిమారీలు తిరిగినట్లు గుర్తొచ్చిందామెకు.

"మామ్మా... ఏంటి ఆలోచిస్తున్నావు... ఆటోహారన్ వినిపించలేదా?" అంటూ సుభద్ర ఆమె చెయ్యి పట్టుకుని పక్కకు లాగడంతో వర్తమానంలోకి వచ్చారు ప్రకాశమ్మగారు

"ఏదో ఆలోచనలో ఉన్నానే" అంటూ చుట్టుపక్కల అన్నీ చూస్తూ, ఎరిగిన వారు ఎవరైనా కనిపిస్తారు ఏమో అని ఆశ పడుతూ అందరి ముఖాలు పరిశీలనగా చూస్తూ... "ఊరు ఎంత మారిపోయిందే...మరీ ఇంతలా మారిపోతుందని అనుకోలేదు సుమా!" అంటూ సుభద్ర వెనకే నడుస్తూ చింతమ్మతల్లి గుడికి చేరారు ప్రకాశమ్మగారు.

ఒకప్పుడు చుట్టూ మెట్టు భూములు, మధ్యలో ఎత్తైన గుట్టపై గుడి, వెనక పెద్ద గొడుగులా ఉండే బాదంచెట్టు, ఆ పక్కనే చింతమ్మ కోనేరు ఉండేవి. ఇప్పుడవేవీ లేవు. అంతా చదునుగా ఉండి గుడి చుట్టూరా గ్రిల్స్ పెట్టబడి ఉన్నాయి. ప్రకాశమ్మగారు గుడి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేసి వచ్చి సుభద్రతో ఇలా అన్నారు

"ఈ గుడిని మజ్జి సూరన్న అనే ఆయన కట్టించాడు. అంతేకాదు రోజూ దీపం పెట్టడానికని కొంత భూమి కూడా పూజారులకు రాసి ఇచ్చాడు. ఆయన పేరు గుడి వెనకాతల చిన్న అక్షరాలతో ఉండేది. ఇప్పుడు అతని పేరు ఎక్కడా కనబడడం లేదు. కానీ గుడిని పునరుద్ధరించడానికని దానాలు చేసిన వారి పేర్లున్న బోర్డులతో గుడి మొత్తం నిండిపోయింది. "ప్చ్... ఏమిటో అంతా కలికాలం" అంటూ చింతమ్మ తల్లికి దండం పెట్టుకుని వెనుదిరిగారు.

సుభద్ర ఆమెను రామమందిరం పక్కనుంచి శివకోవెలకి వెళ్లే దారిలోకి తీసుకొచ్చింది. ఆ ప్రాంతం అంతగా మారినట్టు అనిపించలేదు ప్రకాశమ్మగారికి! అందువలన పాత అలవాటు ప్రకారం ఎడమ వైపు మలుపు తిరిగిన ఆమెకు ఎదురుగుండా కనబడవలసిన శివాలయం గాని, దాని శిఖరం గాని, పచ్చగా ఇదివరలో కనిపించిన నాయుడుగారి వ్యవసాయ భూములు గాని, ఏవీ కనబడక పోవడంతో విస్తుపోతూ, తోవతప్పిన వెర్రిదాన్లా అక్కడే నిలబడిపోయి మనవరాలితో ..

"అమ్మా... ఇక్కడ వ్యవసాయ భూములు ఏవే? ఆ ఇళ్లన్నీ ఎవరివే? శివాలయం ఏదీ... కనబడదు... అడ్డంగా కనిపిస్తున్న ఆ గోడ ఏమిటి?" అన్నారు కాస్త చెమట పట్టిన ముఖంతో.

మనవరాలు నవ్వుతూ "ఇక్కడేం భూములు మామ్మా? ఇదంతా కొత్త కాలనీ రా...రా...ఆ కనిపిస్తున్నదే హైస్కూల్. దాని వెనకాలే శివాలయం" అంది.

"అది కాదే ఇదేనా తోవ? లేక మళ్లించి తీసుకువెళుతున్నావేమోనని..." అంటూ ఆగి నాలుగు పక్కల పరకాయించి చూసారు. తరువాత నెమ్మదిగా నాలుగు అడుగులు వేసి, దారి పక్కన నిలబడి దేని గురించో వెతుకుతున్నట్టు చూశారు ప్రకాశమ్మగారు. చివరికి ఆమె ఒక పెద్ద గొయ్యిని అనుమానంగా చూస్తూ కొయ్యబారినట్టు నిలబడిపోయారు.

"ఏం మామ్మా, అలా నిలబడి పోయావు.. నడవలేక పోతున్నావా?" అంది సుభద్ర.

"లేదే ఇక్కడా... ఇక్కడే... ఇక్కడే ఉండిదే నాయుడోరి మట్టీ నుయ్యి. అదేనే... నేల నుయ్యి అంటారు కదా! అదీ... కొంపదీసి అదేనేంటే ఇలా గొయ్యిలా ఉంది!"

"ఇక్కడ ఒక నుయ్యి ఉండేది అనేవారు మామ్మా. అది ఇదేనేమో మరి, నాకైతే తెలియదు." అంది సుభద్ర.

ఈలోపు అటుగా వెళుతున్నఒక పాతికేళ్ల యువకుడిని ఆపి "బాబూ...! ఇక్కడ నాయుడోరి నేల నుయ్యి ఉండేది కదా... ఏది?" అని అడిగారు ప్రకాశమ్మగారు.

“అదిగో ఆ కనిపిస్తున్నఆ గొయ్యే, అప్పటి ఆ నుయ్యి” అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ వెళ్లిపోయాడు.

ఇదేనా? అయ్యో... అయ్యో.. .ఏం గతి పట్టిందే తల్లి... దీనికి” అంటూ ఆ గొయ్యికి కొంచెం దగ్గరగా జరిగి దగ్గరి బంధువు శవాన్ని చూసినట్లు చూస్తూ, దుఃఖం పొంగి రాగా పయట కొంగుని నోటికి అడ్డంగా పెట్టుకుని, కొంతసేపు అలాగే నిలబడి ఇలా అన్నారు ప్రకాశమ్మగారు. “సుభద్రా! ఈవేళప్పుడు ఇక్కడ ఎలా ఉండేది అనుకున్నావ్. తీర్థప్రజ ఉండేవారే ఇక్కడ. స్నానాలు చేస్తూ, నీళ్లు తోడుకుంటూ, తోడిన నీళ్లు మోసుకుంటూ, బిందెలు తోముకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ, పందాలు వేసి పెద్దపెద్ద బారలు వేసి, నీరు తీస్తూ, హాస్యాలాడుకుంటూ ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ, కన్నెపిల్లలా కళకళలాడుతుండే దొసే ఈ ప్రాంతం అంతా! బరువు నీటి బిందెలు తెస్తూ అడ్డం పడ్డవాళ్లను తప్పుకుందుకు మహా ఇబ్బంది పడేవాళ్ళం. అసలు ఒకరికి ఒకరు మసల్డానికి కూడా వీలు ఉండేది కాదనుకో” అని ఒక్క క్షణం ఆగి, “అప్పటికి ఊర్లో ఓ ఐదారు నూతులు ఉండేవి. కానీ ఎక్కడా ఇంకో నుయ్యేలేదన్నట్టు అందరూ ఈ నూతికే వచ్చేవారు. ఈ నూతి నీటితో బట్టలు ఉతికితే తెల్లగా మిలమిలలాడిపోతూ ఉండేవి. ఈ నీటితో వండిన వంట చాలా రుచిగా ఉండేది. ఈ నూతి మహత్యం, ఈ నీటి మహత్యం అలా ఉండేది. ఆ మహానుభావుడు ఎవరో వెంకునాయుడు అని అతను తవ్వించాట్టే ఈ నుయ్యిని.” అంటూ ఒకసారి దండం పెట్టి, “ఏ ముహూర్తాన తవ్వించాడో గానీ తియ్యటి నీరు పడింది. తరగని గంగ. ఎప్పుడు చూసినా పిల్లల కోడిలాగ నూతి చుట్టూ జనం. అర్ధరాత్రే గానీ, అపరాత్రే గానీ ఎవరో ఒకరు ఉండేవారు నూతి దగ్గర. ఎంత ఎండాకాలం అవనీ, ఓ ఎండిపోవడం అని గానీ, నీళ్లు చాలకపోవడం అని గానీ ఉండేది కాదొసే. వర్షాకాలం అయితే బింది ముంచి పట్టుకు పోవడమే గాని చేదవేసి ఎరగం తల్లీ! ఇంక శివరాత్రి నాడూ, కార్తీక సోమవారాల్లోనూ జనాన్ని చూడవలసిందే. ఖాళీ అన్నది ఉండేది కాదు.” అంటూ “మా అత్తగారు ఏమనేవారో తెలుసా... ‘ఒసేయ్ కోడలా... గంగలో మునగాలంటే మనం కాశీ వరకూ వెళ్ళక్కర్లేదే! ఆ గంగమ్మ తల్లి, శివుడి నెత్తి మీద, కాశీలోనూ, ఇదిగో ఈ నూతిలోనూ ఉందే’ అంటూ ఏ లోకాన ఉన్నారో కానీ, ఆవిడకి నేనంటే ఎంత ఇదో...” అంటూ ఒకసారి ఆకాశం వైపు చూస్తూ రెండు చేతులూ ఎత్తి ఓ నమస్కారం పెట్టి, దీర్ఘ శ్వాస తీసుకుని ప్రకాశమ్మగారు మళ్లీ ఇలా అన్నారు

“ఇంతమందీ ఇలా నీరు వాడుకుంటున్నప్పటికీ, నాయుడోళ్ళ కంబార్లు ఏతామెత్తి ముప్పొద్దులా మునా ముద్దినుసు పంటలు వేసేవారు. ఈ మాలోకం మాలోకమంతా ఈ నీటితోనే పండించే వారంటేనమ్మ. ఈ ప్రాంతమంతా పచ్చగా కళ్ళకి ఎంత ఇంపుగా కనిపించేదో తెలుసా! ఎంత హాయిగా ఉండేదో...” అంటూ ఒక్క క్షణం కళ్ళు మూసుకొని, మళ్లీ తెరిచి “అలాంటి బంగార్లాటి నుయ్యి పాడైపోతూ ఉంటే, చూస్తూ ఎలా ఊరుకున్నారే ఊళ్ళో వాళ్లంతా? ఒక్కళ్ళకీ అయ్యో... అనిపించలేదే? వాళ్లకేం పోయేకాలం వచ్చిందే” అంటూ దుఃఖంతో పూడుకుపోయిన గొంతును సవరించుకుంటూ, ఒక క్షణం ఆగి మళ్లీ మొదలు పెట్టేరు ఆమె.

“అయ్యో... ఇన్నాళ్లు ఈ తల్లి నీళ్ళు తాగి ఇంత ఒళ్ళు పెంచుకున్నాం అన్న విశ్వాసమైనా ఎవరికీ లేకపోయిందేమే. బోరింగులు, కుళాయిలు వచ్చి ఉండొచ్చు. వేసవిలో బోరింగులు అడుగంటుతాయి. కొళాయిలు ఏ రెండు రోజులకో ఒకసారి వస్తాయి. అలాంటప్పుడు ఆపద్ధర్మంగానైనా ఇలాంటి నూతులు ఉపయోగపడతాయనే ఇంగిత జ్ఞానమైనా ఉండాలి కదా! ఔన్లే... ఈతలు ఈనినంతకాలం పశువు పాలు పిండుకు తాగి, ముసలవగానే కసాయి వాడికి వదిలినట్టు, బాగున్నంత కాలం తియ్యగా తాగి హాయిగా తానాలాడారు. ఆఖరికి అంతా కలిసి కుమలబెట్టేసారు.” అంటూ ఆ గొయ్యి వైపు చూస్తూ ‘బహుశా జీవులకు లాగానే వీటికి కూడా పుట్టుకలు చావులు ఉచ్ఛ, నీచాలు ఉంటాయి కాబోలు! శిలాభోగం

స్థలాభోగం ఎన్నాళ్ళో... అన్నాళ్లే అని ఊరకే అంటారా' అని మనసులో అనుకున్నారు.

"అయినా... ప్రజోపయోగం కోసం దానాలు, ధర్మాలు, ఆరామాలు, తటాకాలు, సత్రాలు కట్టించిన ఎందరో మహానుభావుల సేవలు, వినియోగించుకున్నంత కాలం వినియోగించుకుని కనీసం వాళ్ళ పేరైనా జ్ఞాపకం పెట్టుకోలేని ఈ లోకంలో ఇదో వింతటే సుభద్రా!" అని మనవరాలు వైపు చూశారు.

ఆవిడ చెబుతున్న విషయాలు కొంత అర్థమయ్యి కొంత అర్థం కాకుండా ఉండడంతో నోరేళ్ల బెట్టుకుని తన వంకే చూస్తున్న సుభద్రతో

"అవునే... ఇంతకీ మనం తాగడానికి నీళ్లు ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నాం?" అని అడిగారు.

"వస్తే కొళాయి నీళ్లు లేకపోతే బోరింగ్ నీళ్లు తెచ్చుకుంటాం." అంది సుభద్ర.

"మనిషికి ఏం బతుకులు వచ్చాయే తల్లీ, పట్నాల్లోనే అనుకున్నా పల్లెటూళ్ళలో కూడా స్వచ్ఛమైన నీరూ లేదూ, గాలీ లేదూ. తిండీ లేదు. అంతా కృత్రిమం, కాలుష్యం, కల్తీనూ. మా తరం కొంతైనా అనుభవించాం. పాపం మీకు అదీ లేదు. ఇలాంటి రోజులు చూస్తాం అనుకోలేదే తల్లీ!" అంటూ పెదవి విరిచి "నడూ... తిరిగి పోదాం" అంటూ కళ్ళ నీళ్లు తుడుచుకుంటూ వెనుదిరిగేరు ప్రకాశమ్మగారు!

"అదేంటి మామ్మా! శివాలయంకి వెళ్దామన్నావు కదా" అన్న మనుమరాలి మాటలకు సమాధానం ఇవ్వకుండానే ఇంటిదారి పట్టేరామె.

మనుమరాలు ఆమెను అనుసరించింది.

ఇంటికొచ్చి వీధి వరండాలో ఉన్న అరుగు మీద చతికిలపడి ఆలోచనలో మునిగిపోయారు ప్రకాశమ్మగారు.

కాళ్లు కడుక్కోవడానికని పెరట్లోకి వెళ్లిపోయింది సుభద్ర.

వాళ్ల రాకను గమనించిన సావిత్రి, అత్తగారి ముఖంలోకి చూస్తూ "అప్పుడే వచ్చేసారేంటి? ఎండ ఎక్కువగా ఉందని వచ్చేసారా... లేకపోతే నీరసంగా ఉందా... ఏమైంది?" అని అత్తగారి భుజం మీద ఒకసారి చెయ్యి వేసి అడిగి, "పోనీ రెండు రోజులు ఆగి వెళ్దురు గాని లెండి" అంటూ ఆమెకు సర్ది చెప్పి, ఇంట్లోకి వెళ్లి గ్లాసుతో నీళ్లు తీసుకువచ్చి అత్తగారి చేతిలో పెట్టింది.

గ్లాసులో ఉన్న నీటిని తదేకంగా చూస్తూ కాలగర్భంలో కనుమరుగవుతున్న నాటి జ్ఞాపకాలను పదిలపరుచుకుంటూనే వాటి లోతుల్లోకి కూరుకుపోకుండా, మానవ సమాజాభివృద్ధికి తోడ్పడే మార్పులను స్వాగతిస్తూ, ఈ కొత్తనీటితో కలిసి ప్రయాణించాలి' అని మనసులో అనుకుని గ్లాసును ఎత్తి నీటిని గడగడా తాగేశారు ప్రకాశమ్మగారు.

ఈసారి ఎందుకో ఆ నీరు అంత అరుచిగా అనిపించలేదు ఆమెకు!

# కథామంజరి

# బాలకథ

# కళ కళే కదా!

కంచనపల్లి వెంకట కృష్ణారావు
✆ 9348611445

***"తప్పేముంది కళ కళే కదా! కళకు ఎల్లలు లేవు. మన రాజ్యంలో నేను, ప్రజలు.. మన మీద రెండు సంవత్సరాల క్రితం దండెత్తిన జయపురం రాజ్య కవి సుధాముని ఖండకావ్యం చదివి ఆనందిస్తున్నాము కదా! ఇప్పటికీ ఆ కావ్యాన్ని గురించి చర్చించుకుంటున్నాం కదా!"***

కందర్పదేశ రాజు విశిష్టదేవ మంచి ఆలోచనలు కలవాడు. ప్రజల అభివృద్ధికి ఎంతో కృషి చేసేవాడు. ఆయనకు కళలు, కవులు, కళాకారులన్నా ఎంతో గౌరవం. కవులను, కళాకారులను తగిన విధంగా సత్కరిస్తే, వారికి మరింత ఆత్మవిశ్వాసం కలిగి, అద్భుతమైన రచనలనూ, కళాఖండాలను సృష్టించగలరని ఒకరోజు విశిష్టదేవ సభలో చెప్పాడు.

అందరూ ఒక్కసారిగా "మంచి ఆలోచన రాజా, ఆ విధంగా ఎందరో ఆణిముత్యాలవంటి కళాకారులు బయట పడతారు. వారి కళలను కాపాడటానికి ఎంతో అవకాశం ఉంటుంది" అని చెప్పారు.

"కేవలం మన రాజ్యంలోని కవులు, కళాకారుల్నే కాదు. ఇతర రాజ్యాలలోని ఉత్తమ కవులు, కళాకారులను గుర్తించి వారిని కూడా తగిన విధంగా సత్కరించాలనుకొంటున్నాను!" చెప్పాడు విశిష్టదేవ.

ఒక్కసారిగా సభికులు ఆశ్చర్యపోయారు. "మహారాజా! మరి మన శతృదేశాల్లో ఉన్న ఉత్తమ కవులు, కళాకారులను కూడా సత్కరిస్తారా?" అని అడిగారు సభికులు.

"తప్పేముంది కళ కళే కదా! కళకు ఎల్లలు లేవు. మన రాజ్యంలో నేను, ప్రజలు.. మన మీద రెండు సంవత్సరాల క్రితం దండెత్తిన జయపురం రాజ్య కవి సుధాముని



ఖండకావ్యం చదివి ఆనందిస్తున్నాము కదా! ఇప్పటికీ ఆ కావ్యాన్ని గురించి చర్చించుకుంటున్నాం కదా!" అని తన అభిప్రాయాన్ని చెప్పాడు రాజు.

ఆయన అభిప్రాయం విన్నాక సభలోని వారందరూ ఆలోచిస్తూ నిశ్శబ్దంగా ఉండిపోయారు! మంత్రి అందరితో చర్చించి, రాజుగారి అభిప్రాయాన్ని సభ అమోదించినట్టు రాజుగారికి తెలిపాడు.

ఆ సంవత్సరం జయపురం కవి సుధామని బంగారు కంకణంతో సత్కరించాలని, విశిష్టదేవ తన అభిప్రాయం తెలిపాడు.

ఈ మాటలు విని సభలో కలకలం మొదలయింది.

సభికుల ఆందోళన అర్థం చేసుకున్న రాజుగారు "ఆ దేశపు రాజు మనతో శత్రుత్వం కలిగి ఉండవచ్చు కానీ, ఆ రాజ్యపు కళాకారులు కాదు కదా! అలా ఆ దేశపు కవిని సత్కరిస్తే జయపురం రాజుకి ఈ విషయం తెలిసి, మన మంచితనాన్ని అర్థం చేసుకుని, మన రాజ్యాల మధ్య శత్రుత్వం తొలగిపోవడానికి కారణం కావచ్చు, ఆలోచించండి!" విశిష్టదేవ వివరించాడు.

రాజుగారి ఆశావహ దృక్పథం అందరికీ నచ్చింది. ఒక్కసారిగా సభ "జే జే"లతో మారు మ్రోగింది!

ఆ విధంగా విశిష్టదేవ మంచి ఆలోచన వలన జయపురం రాజులో కూడా మార్పు వచ్చింది. ఇతర రాజ్యాలలోని కవులను, కళాకారులను కూడా విశిష్టదేవ సన్మానించడం మొదలు పెట్టాడు. అందుకే కందర్ప దేశానికి శత్రువులు లేకుండా ఉత్తమ ఆలోచనలుగల రాజులందరూ మిత్రులయ్యారు!

కథామంజరి
బాలకథ

# స్నేహితుల గొడవ

ఓట్ర ప్రకాష్ రావు

✆ 09787446026

> *మేము సరదాగా గొడవపడుతుంటే నిజమైన గొడవ అనుకొని, చెడుబుద్ధితో మాంసం ముక్కల కోసం మేము అడగకపోయినా తీర్పు ఇస్తానని వచ్చావు. అందుకే మేమిద్దరం నీకు ఆకలి ఉందని తెలిసినా, మాంసం ముక్కలు ఇవ్వలేదు. ఇప్పుడు ఒక్కొక్కరిలో ఒక్కొక్క గొప్పతనం ఉందన్న నిజం చెప్పావుగా!"*

ఒక జమీందారు దగ్గర రెండు కుక్కలు వుండేవి. ఆ రెండు కుక్కలు స్నేహంతో కలసిమెలసి ఉండేవి. రెండు కుక్కలలో ఒక కుక్క వేటకుక్క! జమీందారు అడవికి వెళ్తున్నప్పుడు వేటకుక్కను తీసుకెళ్లేవారు. వేట నుండి తిరిగి రాగానే జమీందారు వేటకుక్కను ఇంటిముందు వదలి వెళ్లారు.

కాస్సేపటి తరువాత రెండు కుక్కలకు మాంసం ముక్కలు తెచ్చి పెట్టాడు నౌకరు.

మాంసం ముక్కలు తింటూ రెండూ మాట్లాడుకోసాగాయి.

"వేటకుక్కా, నీవు నాకన్నా గొప్పదానివి. అందుకే మన యజమాని అడవికి వెళ్తున్నప్పుడు, నిన్ను మాత్రమే తీసుకొని వెళ్తున్నాడు. ఇంతవరకు నేను ఒక్కసారి కూడా అడవికి వెళ్ళలేదు."

"మిత్రమా, నీవే నాకన్నా గొప్పదానివి! జమీందారు ఇంటికి దొంగలు ఎవరూ రాకుండా, ఆయన ఆస్తిని అనుక్షణము నీవు కాపాడుతున్నావు." అంది వేటకుక్క.

"వేటకుక్కా! నీవు నిజం అంగీకరించకుంటే నేనేమి చేస్తాను. వేటకుక్కగా అడవికి వెళ్లి జమీందారు దగ్గరకు క్రూరజంతువులు వస్తున్నట్లు తెలిస్తే, ముందుగానే హెచ్చరిస్తావు!"

"కుక్క మిత్రమా, నాకన్నా నీవే గొప్పదానివి!" కోపంగా అంది.

అదే సమయంలో ఒక గ్రద్ద అక్కడున్న చెట్టుపైన కూర్చొని, జరుగుతున్న గొడవంతా చూసి ఎలాగోలా వారిద్దరి



దగ్గరున్న మాంసం ముక్కలు తినాలని నిర్ణయించుకొంది.

"కుక్కల్లారా, ఏమిటి మీరిద్దరూ పోట్లాడు కొంటున్నట్లుంది?"

"మా ఇద్దరిలో ఆ కుక్క గొప్పది అంటే అంగీకరించడం లేదు." అంటూ కొన్ని కారణాలు చెప్పింది వేటకుక్క.

"ఓ గ్రద్దా, నీవు దాని మాటలు నమ్మకు. నాకన్నా అదే గొప్పది" అంటూ మరిన్ని కారణాలు చెప్పింది.

"వేటకుక్కా... నాకు ఆకలిగా వుంది. కొన్ని మాంసం ముక్కలు ఇస్తే, నేను తిన్నాక మీలో ఎవరు గొప్పవారో తీర్పు చెబుతాను." అంది గ్రద్ద.

"గ్రద్దా, నాకు మా యాజమాని పెట్టేదే చాలదు, నీకెలా ఇవ్వగలను? కావాలంటే ఆ కుక్కను అడిగి తీసుకో" అంది వేటకుక్క

గ్రద్ద, కుక్క వైపు ఆశగా చూసింది.

"నాకూ మా యజమాని ఇచ్చేది కొంచమే. నేను మాత్రం ఎలా ఇవ్వగలను!" అంది.

ఆకలితోనున్న గ్రద్దకు కోపం వచ్చింది.

"నాకు ఆకలిగా వుంది. మీకు తీర్పు చెప్పను. మీ సమస్య మీరే తేల్చుకోండి. అసలు మీరిద్దరూ గొప్పవారే. ఒక్కొక్కరిలో ఒక్కొక్క గొప్పతనం వుంది!" కోపంగా అంటూ ఆహారం కోసం వెళ్లబోతుంటే... "గ్రద్దా, ఒక్క నిమిషం. నీకు కావలసిన మాంసం ముక్కలు ఇస్తాము!" అంటూ రెండు కుక్కలు పిలవడంతో ఆశ్చర్యంతో చూసింది గ్రద్ద.

"నీవు మాంసం ముక్కలు కావాలని అడిగితే అప్పుడే ఇచ్చేవారం. మేము సరదాగా గొడవపడుతుంటే నిజమైన గొడవ అనుకొని, చెడు బుద్ధితో మాంసం ముక్కల కోసం మేము అడగకపోయినా తీర్పు ఇస్తానని వచ్చావు. అందుకే మేమిద్దరం నీకు ఆకలి ఉందని తెలిసినా, మాంసం ముక్కలు ఇవ్వలేదు. ఇప్పుడు ఒక్కొక్కరిలో ఒక్కొక్క గొప్పతనం ఉందన్న నిజం చెప్పావుగా!" అంది ఒక కుక్క.

"నీకు ఎంత కావాలో అంత తీసుకో!" అంది మరో కుక్క.

"మాంసం ముక్కలు కోసం నేను తొందరపడ్డాను, క్షమించండి! స్నేహమంటే ఇలాగే వుండాలి. ఇద్దరి స్నేహితుల మధ్య జరిగే గొడవ ఇలాగే ఉండాలి! మీకు అభ్యంతరం లేకుంటే, ఇక మీదట నేను మీతో స్నేహంగా ఉంటాను!" అంది గ్రద్ద.

# నేనూ - ఇంపోర్టెడ్ కెమెరా


మల్లిక్



✆ 9849394395


**విశిష్ట అతిథి కథ**

> ***"వారెవ్వా... కెమెరా జబర్దస్త్ ఉంది సార్. ఫారిన్ది లే." అవునన్నట్టు మేమిద్దరం తలలూపాం.***
> ***"నాకు అమ్మెయ్యండి సార్. మీ అస్మంటోళ్ళకి గిస్మంటి కెమెరా ఎందుకు సార్? గిది స్టుడియోల పంజేస్తది. నాకిచ్చెయ్యండి సాబ్. అర్రే కిషన్, రెండు చాయ్‌లు చెప్పరా."***
> ***"అబ్బే ఇది అమ్మడానికి కాదోయ్. నాకొకతను ప్రజెంట్ చేశాడు. దీన్ని ఎవరికీ ఇవ్వను" అన్నాన్నేను కెమెరాని యాదగిరి చేతిలోనుంచి లాక్కుంటూ.***
> ***"అర్రే కిషన్... చాయ్ కాన్సిల్" అరిచాడు యాదగిరి***

నేను ఎయిర్పోర్టుకి బయలుదేరా. ఎయిర్పోర్టుకి ఎందుకు బయలుదేరానంటే......

వారం క్రితం అమెరికాలో ఓ పెద్ద కంపెనీలో పనిచేస్తున్న నా స్నేహితుడు చిదంబరం నాకు ఉత్తరం రాశాడు. 'తనతోబాటే పనిచేస్తున్న విలియం జేమ్స్ అనే అతను ఇండియా చూడడానికి వస్తున్నాడనీ, రెండుమూడు రోజులు బాంబేలో గడిపి, హైదరాబాదుకు వస్తాడనీ, నన్ను ఎయిర్పోర్టుకెళ్ళి, ఆయనను రిసీవ్ చేసుకొని ఊరంతా చూపెట్టమని!'

ఉత్తరంతో పాటు నేను గుర్తుపట్టడానికిగాను, జేమ్స్ ఫోటో జతపరిచి పంపించాడు చిదంబరం.

ఆరోజు జేమ్స్ వచ్చేరోజు. నేను ఎయిపోర్టుకు వెళ్ళి, జేమ్స్‌ను రిసీవ్ చేసుకొని, నన్నతనికి పరిచయం చేసుకున్నాను.

"ఏదేని మంచి హోటల్‌కి తీస్కెళ్ళండి" అన్నాడు జేమ్స్ భుజాలు ఎగరేస్తూ.

"మీరు హోటల్లో ఉండడానికి వీల్లేదు. నా ఆతిథ్యం స్వీకరించండి. నాగదికి పోదాం పదండి!" అన్నాను.

జేమ్స్ "వద్దు బుష్షి బాబుగారూ, మీకు ఇబ్బంది" అంటూ అడ్డు చెప్పబోయాడు గానీ, నేను అతనిని నా గదిలో ఉండడానికి ఒప్పించాను. ఇద్దరం ఆటో ఎక్కి, ఇంటిముందు దిగాం.

జేమ్స్ తను ఇస్తానన్నా వినకుండా మీటర్ నేనే పే చేశాను.

"ఏంది సార్... మీటర్ మీద రెండ్రూపాయల్ ఎక్స్ట్రా ఇవ్వాలి" అన్నాడు ఆటోవాడు.

"నువ్వు ముం దు చెప్పలేదుగా" అన్నాను నేను.




"అట్లెట్ల ఇయ్యరు సార్. ఎయిర్పోర్టూ, రైలుస్టేషన్ల ఆటో ఎక్కితే ఎక్స్ట్రా ఇయ్యాలని తెలీదా?"

"నేనివ్వను" అన్నాను మొండిగా.

"గిట్ల చేస్తే, జబర్దస్తిగా గుంజుకోవాల్సుంటది" అన్నాడు వాడు నాకాలర్ పట్టుకుంటూ.

"ఏంషీ గొడవ... హేయ్ వదులు వదులు" అంటూ మా ఇద్దర్నీ విడదీశాడు జేమ్స్.

"వాడు మాట్లాడేది కూడా తెలుగే. హైదరాబాదులో తెలుగు అలాగే మాట్లాడతారు. వాడికి మీటర్ మీద రెండురూపాయలు ఎక్స్ట్రా కావాలట" చెప్పాను.

జేమ్స్ నావంక ఆశ్చర్యంగానూ, ఆటోవాడి వంక మెచ్చుకోలుగానూ చూశాడు.

"శానా మంచివాడు, శానా మంచివాడు" అని చెప్పి, జేబులోనుంచి చటుక్కున పదిరూపాయలు తీసి, ఆటోవాడికిచ్చాడు. ఆటోవాడు జేమ్స్‌కి సలాం చేసి వెళ్లిపోయాడు.

"వాడు శానా మంచివాడు. అందుకే కాలర్ పట్టుకున్నాడు. అదే మా అమెరికాలో అయితే, టాక్సీ వాళ్ళకి టిప్పు ఇవ్వకపోతే, షూట్ చేసి పారేస్తారు" అన్నాడు భుజాలు ఎగరేస్తూ.

నేను రెండు రోజులు ఆఫీసుకు సెలవుపెట్టి జేమ్స్‌ను హైదారాబాద్ మొత్తం తిప్పాను. వెళ్ళిన చోటల్లా జేమ్స్ తన కెమెరాతో ఫోటోలు తీశాడు.

"నేను రేపు ఆంధ్ర వెళ్ళి, అక్కడి విలేజీలు తిరుగుతాను. అక్కడ సీనరీ బాగుంటుందని షిద్దంబ్రమ్ షెప్పాడు. వారం తరవాత హైదరాబాద్ వచ్చి, బాంబే పోయి, అక్కడ్నుండి అమెరికా పోతాను" అన్నాడు జేమ్స్.

నేను అలాగే అన్నట్టు తలఊపాను.

జేమ్స్ నా ఫోటో ఒకటి తీస్తానన్నాడు. నేను చేతులు కట్టుకొని, కెమెరాకీ పోజు ఇచ్చాను. "రెడీ, కాష్త నవ్వండి" అన్నాడు కెమెరా లెన్స్ ఎడ్జస్ట్ చేస్తూ. నేను నవ్వాను.

"ఇదే మా అమెరికాలో అయితే షూట్ చేస్తారు. అటుల శబ్దం వచ్చులాగా నవ్వకండి." అన్నాడు.

నేను మూతి బిగించేసాను. రెండుమూడు ఎంగిల్స్‌లో నా ఫోటోలు తీశాడు. కెమెరాలో నుంచి రీల్ తీసి "అమెరికాలో ప్రింట్ తీసి పంపిష్టాన్" అన్నాడు

"మీ కెమెరా చాలా బాగుంది" అన్నాను అతనితో.

"మీకు నష్షిందా, అయితే తీసుకోండి" అన్నాడు కెమెరాని ముందుకు చాపుతూ.

"అబ్బే ఎందుకండీ, ఆంధ్రాలో సీనరీలూ అవీ తియ్యడానికి మీకు కావాలిగా" అన్నాను నేను.

"నా దగ్గర ఇంకోషి ఉందిలెండి. ఇది మీరు తీష్కోండి."

"అబ్బే, ఎందుకు లెండి" నేను మెలికలు తిరిగాను.

"అదే మా అమెరికాలో అయితే ప్రజెంటేషన్ ఇస్తే వద్దని అంటే షూట్ చేసేస్తారు. తీసుకోండి" అన్నాడు కరుకుగా.

నేను ఎంతో సంబరపడిపోతూ కెమెరాని అందుకున్నాను.

మర్నాడు జేమ్స్ ఆంధ్రావేపు ఊళ్ళు తిరగడానికి వెళ్లిపోయాడు.

చాలాకాలంగా మంచి కెమెరా కొందామని అనుకుంటున్నా కానీ కుదర్లేదు. అనుకోకుండా జేమ్స్ మంచి కెమెరా ప్రెజెంట్ చేశాడు. ఇంపోర్టెడ్ కెమెరా! నా మనసు ఆనందంతో ఊయలలూగింది.

"ఏంటలా ఊగిపోతున్నావు? తాగావా? ఇన్నాళ్లూ బుద్ధిమంతుడిలా ఉండేవాడివి, ఈ ముదనష్టపు అలవాటు ఎలా అబ్బిందిరా నీకు?" చంచల్రావు గొంతు వినిపించింది నాకు.

తూలకుండా, తమాయించుకొని, నిలబడి చూశాను. గుమ్మంలో చంచల్రావు నిలబడి ఉన్నాడు. నాకు చచ్చేంత నవ్వొచ్చింది. ఘొల్లున నవ్వేశాను.

"హోరి అమాయకప్పక్షీ, నేనా... తాగడమా?"

"అంటే నువ్వు తాగలేదంటావ్"

"ఏం, తాగినట్టు కనిపిస్తున్నానా?"

"మరి తూగిపోతున్నావేం?"

"ఆనందం... మనసు ఉయ్యాలలూగిపోతోంది" అన్నాను ఊగిపోతూ.

చంచల్రావు నన్ను కదలకుండా పట్టుకున్నాడు. "ఎందుకు ఊగుతుంది?" అని ప్రశ్నించాడు సస్పెన్స్ భరించలేక!

వాడి పట్టు విడిపించుకొని, ఆల్మరాలోంచి కెమేరా తీసి చూపించాను. చంచల్రావు కళ్ళు పెద్దవి చేసి చూశాడు ఆశ్చర్యంగా!

"ఇంపోర్టెడ్ కెమెరా! నీకెక్కడిది?"

నేను జరిగినదంతా చెప్పాను.

"కెమెరా చాలా బాగుంది. చాలా ఎడ్జస్ట్మెంట్సున్నాయే. ఎలా ఉపయోగించాలో నీకు తెలుసా బుచ్చిబాబూ?"

"లేదురా, జేమ్స్ మళ్ళీవారంలో ఇక్కడికి వస్తాడు. అప్పుడడిగి తెలుసుకుంటాను" అన్నాను.

"అప్పటిదాకా ఎందుకురా బుచ్చీ, మన కాలనీలో ఫోటో స్టూడియో ఉంది కదా, అక్కడికి వెళ్ళి, కెమెరా చూపించి దీన్నెలా వాడాలో వాడ్ని అడుగుదాం" అన్నాడు చంచల్రావు.

వాడి సలహా నచ్చింది నాకు. ఇద్దరం కలిసి స్టూడియోకి వెళ్లాము. స్టూడియో ముందు… "ఇచ్చట మీ మొహం లాగే ఫోటోలు తియ్య బడును" అన్న బోర్డుంది.

"స్టూడియో ముందు ఇలాంటి బోర్డు పెట్టాడంటే వీడెంతో నిజాయితీపరుడై ఉండాలి" అన్నాడు చంచల్రావు. ఇద్దరం స్టూడియోలోకి అడుగుపెట్టాం.

"రాండి సార్, రాండి" అంటూ మమ్మల్ని సాదరంగా ఆహ్వానించాడు స్టూడియో యజమాని యాదగిరి.

"ఒరేయ్ కిషన్, సార్లకి రెండు చాయ్ చెప్పరా" అని అరిచాడు లోపలికి చూస్తూ.

"అబ్బే, మేం ఫోటోలు తియ్యించుకోడానికి రాలేదు యాదగిరిగారూ" అన్నాడు చంచల్రావు.

"కిషన్.. చాయ్ కాన్సిల్ అని చెప్పరా."

మేము ఇబ్బందిగా నవ్వాము.

"ఫోటోలు తియ్యించుకోడానికి కాకపోతే మల్లెందుకొచ్చిన్రు ఈడకి?" అన్నాడు చిరాగ్గా చూస్తూ.

నేను నాచేతిలో కెమెరాని టేబుల్ మీద పెట్టాను. చంచల్రావు విషయం చెప్పాడు. కెమెరా చేతిలోకి తీసుకున్నాడు యాదగిరి. అతని కళ్ళు వెలిగిపోయాయి.

"వారెవ్వా… కెమెరా జబర్దస్త్ ఉంది సార్. ఫారిన్ది లే." అవునన్నట్టు మేమిద్దరం తలలూపాం.

"నాకు అమ్మెయ్యండి సార్. మీ అస్మంటోళ్ళకి గిస్మంటి కెమెరా ఎందుకు సార్? గిది స్టుడియోల పంజేస్తది. నాకిచ్చెయ్యండి సాబ్. అర్రే కిషన్, రెండు చాయ్లు చెప్పరా."

"అబ్బే ఇది అమ్మడానికి కాదోయ్. నాకొకతను ప్రజెంట్ చేశాడు. దీన్ని ఎవరికీ ఇవ్వను" అన్నాన్నేను కెమెరాని యాదగిరి చేతిలోనుంచి లాక్కుంటూ.

"అర్రే కిషన్… చాయ్ కాన్సిల్" అరిచాడు యాదగిరి మళ్ళీ లోపలికి చూస్తూ. "మల్లెందుకొచ్చిన్రు నాది వకత్ ఖరాబు చేసేందుకు" చిర్రుబుర్రులాడాడు.

"చెప్పేం కదండీ యాదగిరిగారూ, దీని ఎడ్జస్ట్మెంట్లూ అవీ ఎలా చెయ్యాలో, ఫొటోలు ఎలా తియ్యాలో మీరు చెప్తారని" అని మర్యాద ఒలకబోశాడు చంచల్రావు.

ఓ ఐదు నిమిషాలపాటు దాన్ని నిశితంగా పరిశీలించి, ఎలా ఉపయోగించాలో చెప్పాడు యాదగిరి.

"ఎలాగూ ఇక్కడికి వచ్చాం కదా, ఒక రీలు కొని ఫొటోలు తీద్దాం. ఈ కెమెరాతో ఫొటోలు తీస్తే ఎలా వస్తాయో తెలుస్తుంది" అన్నాడు చంచల్రావు.

"మా ఇస్టుడియోల రీళ్లు భీ అమ్ముతాం సార్" అన్నాడు యాదగిరి హుషారుగా.

"సరే, ఒక రోల్ ఎంత?"

"నల్ పై రూపాయల్ సాబ్"

"నలభై ఎందుకు?"

"కలర్ ఫిల్ము సాబ్"

"కలర్ ఫిల్ము వద్దులే, బ్లాక్ ఎండ్ వైట్ చాలు"

"అరె ఏంది సాబ్, బ్లాక్ ఎండ్ వైట్ అయితే ఇరవై రూపాయలే. కలర్ ఫిల్మ్ అయితే నల్ పై రూపాయల్. ఇరవై రూపాయల్ కి ఏం చూస్తావ్ సాబ్. కలర్ ల ఫొటోలు మంచిగా కొడ్తది" అన్నాడు.

"కలర్ ఫిల్మ్ తీసుకోరా" అన్నాడు చం చల్రావు. నేను కలర్ ఫిల్మ్ తీసుకున్నా.

"ఫొటోలు నాతోనే కడిగించండి సాబ్" అన్నాడు పళ్లికిలిస్తూ.

"సరేనోయ్" అన్నాడు చంచల్రావు వాడికి అభయం ఇస్తూ.

"అ్రరే కిషన్ రెండు చాయ్ చెప్పరా" అరిచాడు లోపలికి చూస్తూ.

ఇందాకట్నుంచీ నా మనసులో పీకుతున్న సందేహాన్ని అడిగేశాను.

"అవును గాని, మీ స్టూడియో ముందు 'ఇచ్చట మీ మొహంలాగే ఫొటోలు తియ్యబడును' అని బోర్డు పెట్టవు కదా, అలా ఎందుకు పెట్టావు?"

"అది భీ సమాజ్ కాలేదా మీకు?" అంటూ ఘొల్లున నవ్వాడు యాదగిరి.

మేమిద్దరం జేబురుమాళ్లతో మొహం తుడుచుకున్నాం.

"చమించాలి సార్, నేను నవ్వితే గట్లనే జల్లు పడ్తది. ఆ ఏమంటిరి? గా బోర్డెందుకు పెట్టినాననా? సార్, వేరే స్టూడియోలో ఫోటో తియ్యించుకుంటే మీ మొహం మీ మొహంలా కన్పడదు. గదే మా స్టూడియోల తియ్యించుకుంటే మీది ముఖం మీదిలానే కన్పిస్తది. సమ్జైంది కదా... హహహ..."

మేమిద్దరం వెనక్కి తిరిగాం. యాద గిరి నవ్వు ఆపాడు. మేం మళ్ళీ ముందుకు తిరిగాం. కిషన్ లోపలి నుండి రెండు టీలు తెచ్చాడు. మేం తాగి బయట పడ్డాం.

గదికి వచ్చాక చంచల్రావు అడిగాడు "ఒరేయ్ బుచ్చిబాబూ ఈ కొత్త కెమెరాతో మొట్టమొదటిసారిగా నువ్వు ఎవరి ఫోటో తీద్దామనుకుంటున్నావు?"

"ఏ గర్ల్ ఫ్రెండో ఉండుంటే ఆ కోమలాంగిని తీసి ఉండేవాడ్ని. కానీ ఎవరూ లేరుకదా! నీకంటే నాకు ముఖ్యులెవరున్నార్రా, ముందు నీ ఫోటోనే తీస్తాను. అలా నిల్చో" అన్నాను కెమెరాను ఎడ్జస్ట్ చేస్తూ. చంచల్రావు కిటికీలోనుంచి బయటకు చూసి ఆనందంతో కెవ్వున కేకేసాడు.

"ఏమైందిరా చెంచిగా, ఎవరైనా అమ్మాయా? నొక్కేస్తా, నొక్కేస్తా..." అంటూ కెమెరా ఎడ్జస్ట్ చేస్తూ కిటికీ దగ్గరకు పరుగెత్తాను.

"నీ మొహం, వీధిలో ఎవరిదో కారు ఆగి ఉంది చూడు. ఇంపోర్టెడ్ కారు" అన్నాడు చంచల్రావు ఆనందంగా.

"అయితే ఏమిటి?"

"ఆ కారు దగ్గర నిలబడి ఫోటో తియ్యించుకుంటాను" అంటూ బయటకు ఉరికాడు. నేను వాడిని ఫాలో అయ్యాను.

కారుకి జారబడి నిలబడిన ఫోటో ఒకటి, ఫ్రంట్ డోర్ దగ్గర చేతులు కట్టుకొని నిలబడినదొకటీ, బాయినెట్ మీద మోచేయి ఆనించి, గెడ్డం కింద చెయ్యిపెట్టుకొని, నడుం మీద మరో చెయ్యి పెట్టుకొని ఉన్నట్టు మరోటీ తీశాను.

"డ్రైవింగ్ సీట్లో కూర్చొని ఉన్నట్టు తీయించుకుంటే బాగుంటుంది" అన్నాను.

కారు తలుపు లాగి చూసి " లాక్ చేసుంది" అన్నాడు చంచల్రావు.

"పోన్లే, కారుతో తియ్యించుకున్నావుగా, ఇప్పుడు నేను నిలబడతాను. నువ్వు తియ్యి" అంటూ, కెమేరా చంచల్రావుకిచ్చి, కారు దగ్గర నేను నిలబడ్డాను. కెమెరా ఎడ్జస్ట్ చేసుకుంటూ "రెడీ" అన్నాడు చంచల్రావు.

నేను నవ్వాను.

"ఏంటా వెధవనవ్వు, నువ్వేమైనా టీవీ ఎనౌన్సర్వా? నువ్వేమీ నవ్వక్కర్లేదు. మామూలుగా నిలబడు" పళ్ళు కొరుకుతూ అన్నాడు వాడు. కారు దగ్గర నాకు మూడు నాలుగు ఫొటోలు తీశాడు.

ఇంతలో నలుగురు పోలీసుల్ని వెంటబెట్టుకొని ఒకతను హడావిడిగా మాదగ్గరకు వచ్చాడు. "వీళ్ళే వీళ్ళే పట్టుకోండి" అన్నాడతను.

"ఏంటీ" అన్నాం మేమిద్దరం తెల్లబోయి.

"మీరు కారు దొంగతనం చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు ఈయన మాకు కంప్లెయింట్ ఇచ్చారు" ఒక పోలీసు అన్నాడు.

"అబద్ధం. కారు బాగుంది కదా అని, దీని దగ్గర ఫొటోలు తియ్యించుకుంటున్నాం" అన్నాన్నేను.

"పచ్చి అబద్ధం, వీళ్ళు నా ఇక కారు తలుపులు పట్టి లాగుతూ, తెరవడానికి ప్రయత్నించడం నేను చూశాను. కారు దొంగలు మేము కారు దొంగలం అని చెప్పుకుంటారా? అసలే ఈమధ్య సిటీలో కారు దొంగతనాలూ, స్కూటర్ దొంగతనాలూ చాలా అవుతున్నాయ్. ఆ ముఠాతో వీళ్ళకి సంబంధం ఉందనుకుంటా" అన్నాడు కారు ఓనరు.

అక్కడ కాలనీ జనం అంతా మూగారు. మేం అలాంటి వాళ్ళం కాదని పోలీసులకు చెప్పి చూశారు. ఎంత మొత్తుకున్నా మామాట వినకుండా పోలీసులు మమ్మల్ని స్టేషన్‌కు లాక్కెళ్ళారు.

అక్కడ ఇన్స్పెక్టర్ నన్ను అమాంతం కౌగలించేసుకున్నాడు. అతని బిగికౌగిలికి నా షర్టు గుండీలు పటపట తెగి, రాలి పడిపోయాయి.

"నిజం సార్, నేను దొంగని కాను. నన్ను వదలండి" అన్నాను అతని కౌగిలినుండి విడిపించుకుంటూ.

"వదలనుగాక వదలను...హ్హాహ్హాహ్హా..." అంటూ నవ్వాడు. నేను ఆశ్చర్యంగా ఇన్స్పెక్టర్ మొహంలోకి చూసాను.

"నేన్రా శివరాంని, ఇక్కడ సబిన్స్పెక్టర్‌గా పనిచేస్తున్నాను" అన్నాడు శివరాం.

యూనిఫార్మ్లో ఉండడం వల్ల నేను వాడ్ని గుర్తుపట్టలేదు.

"ఓరి నువ్వట్రా" అంటూ వాడ్ని కౌగలించుకున్నాను. ఈసారి వాడి గుండీలు పటపట తెగి, రాలి పడిపోయాయి.

నేను శివరాం కి జరిగిన సంగంతంతా వివరంగా చెప్పాను.

"అదన్నమాట సంగతి. కానీ, కెమెరా మాత్రం చాలా బాగుందిరా" అన్నాడు వాడు.

"సార్సార్ మనమందరం ఫోటోలు తియ్యించుకుందాం సార్" అన్నారు కానిస్టేబుళ్లు.

"మావాళ్ళు సరదా పడుతు న్నారు. కొన్ని స్నాపులు తియ్యరా" అన్నాడు శివరాం.

కానిస్టేబుల్స్ అందరినీ ఒక గ్రూపు ఫోటో; శివరాంని కానిస్టేబుల్స్ అందరితోనూ కలిపి మరో గ్రూప్ ఫోటో; కానిస్టేబుల్స్ ఒక్కొక్కడ్నీ విడివిడిగా ఒక్కో ఫోటో; నేను చంచల్రావూ కలిసి ఒక ఫోటో; చంచల్రావు, శివరాం; నేను, కానిస్టేబుల్స్; కానిస్టేబుల్స్, చంచల్రావు‌_ _ _ ఇలా ఫోటోలు తియ్యించుకున్నాం.

"సార్ మరి నా ఫోటోనో?" అన్నాడు కారు ఓనర్.

"ఫిల్ము అయిపోయింది" అన్నాను నేను పళ్ళు కొరుకుతూ.

శివరాం దగ్గర సెలవు తీసుకొని బయట పడ్డాం చివరికి.

"ఒరేయ్ రీలు మొత్తం అయిపోయిందిరా. కడగడానికి స్టూడియోలో ఇచ్చేస్తేనో?" అన్నాడు చంచల్రావు. కొత్త కెమెరాతో తీసిన ఫోటోలు ఎలా వస్తాయో చూడాలన్న ఆత్రం నాకూ ఉంది. "పద వెళ్దాం" అన్నాను.

ఫోటో స్టూడియోలోకి అడుగుపెట్టి యాదగిరికీ రీలు ఇచ్చాం. "దీన్ని కడిగి ప్రింటు వేసి పెట్టాలి" అన్నాను.

"అర్రే కిషన్, రెండు చాయ్ చెప్పరా."

"ఎంతౌతుంది" అడిగాను.

"గిప్పుడే పైసల్ గురించి ఎందుకు సార్, ఎన్ని ప్రింట్లు వస్తయో చూసి, గప్పుడు చెప్త బిల్లు. రేపు రండ్రి, ఫోటోలు ఇస్త" అన్నాడు యాదగిరి. మర్నాడు మళ్ళీ స్టూడియోకి వెళ్ళాం. మాముందు కవరొకటి ఉంచాడు.

"తీస్కోండి సార్ ఫోటోలు. ముప్పై వచ్చినయ్. ప్రింటుకి నాల్గు రూపాయల్. ముప్పై ప్రింట్లకి నూట ఇరవై రూపాయల్. డెవలపింగ్‌కి పది హేన్రూపాయల్. మొత్తం నూట ముప్పయ్యైద్రూపాయల్"

నూట ముప్పయ్యైదు ప్లస్ ఫిల్మ్ నలభై రూపాయలు. మొత్తం నూట డెబ్బయ్యైదు రూపాయలు. నేను గుండెలు బాదుకున్నాను. ఈలోగా చంచల్రావు ఫోటోలు చూస్తూ పళ్ళు కొరకడం మొదలు పెట్టాడు.

"ఏంట్రా ఈ ఫోటోలు" అని రంకె వేస్తూ ఫోటోలు నా చేతిలో పెట్టాడు. నేను చంచల్రావుని కారుతోపాటు తీద్దామని ప్రయత్నించిన ఫోటోలవి.

ఒకదానిలో వాడి తలకాయ ఒక్కటే పడింది. ఇంకో దానిలో వాడి కాళ్ళూ, కారు టైరూ పడ్డాయి. మరో దానిలో కారు బాయినెట్టూ, చంచల్రావుగాడి చెయ్యీ పడ్డాయి.

పోలీస్టేషన్లో ఫోటోలు కూడా అలాగే వచ్చాయి. వరసగా పోలీసుల టోపీలు ఒకదాంట్లో, వాళ్ళ నిక్కర్లు ఇంకో దాంట్లో, నేనూ శివరాం తియ్యించుకున్నదాంట్లో (ఆ ఫోటో చంచల్రావుగాడు తీశాడు), మా తలకాయలు లేకుండా ఒట్టి మొండేలూ పడ్డాయి. మిగతా ఫోటోలు కూడా ఇదే మోస్తరుగా ఉన్నాయి. ఈ ఫోటోలకి నూట డెబ్భైఐదు రూపాయలా! బేర్ మన్నాను నేను.

"బాధ పడకుండ్రి సార్. ఫోటోలు తీసుడు మొదటిసారి కదా. మరుమరుల గట్లనే వస్తయి. తర్వాత మంచిగొస్తయి" అన్నాడు యాదగిరి నన్ను ఊరడిస్తూ.

బిల్లు పే చేసి మేము పోలీస్టేషన్కి వెళ్ళేం. నేనిచ్చిన ఫోటోలన్నీ చూశాడు శివరాం.

"ఫోటోలు బాగా రాలేదని బాధపడకోయ్. మళ్ళీ ఓ రీలు కొని ట్రై చెయ్. రేపు కెమెరా తీసుకొని రా" అన్నాడు. మళ్ళీ నూట డెబ్భైఐదు రూపాయలు క్షౌరం.

అలాగే అని చెప్పి నీరసంగా బయటపడ్డాను.

"ఒరేయ్ అన్నట్టు చెప్పడం మరచిపోయాను. వచ్చేవారం మా చెల్లెలు పుట్టినరోజు. ఆరోజు మా ఇంటికి వచ్చి, కొన్ని స్నాపులు తియ్యాలి నువ్వు." అని చెప్పి, నా భుజం తట్టి వెళ్ళిపోయాడు చంచల్రావు.

నేను గదికి వచ్చేసరికి నాకోసం మాఇంటి యజమాని ఎదురు చూస్తున్నాడు. "మా జీతాలు ఎల్లుండి కదండీ" అన్నాను నేను ఆశ్చర్యంగా.

"భలేవాడివోయ్, నేను అద్దెకోసం రాలేదు. నీ దగ్గర ఇంపోర్టెడ్ కెమెరా ఏదో ఉందటగా. కాస్త సర్దాగా మా అందర్నీ ఫోటోలు తి య్యకూడదూ" అన్నాడు బట్టతలని బ్రహ్మాండంగా నిమురుకుంటూ.

"కానీ, ఫిల్ముకీ, డెవలపింగుకీ, ప్రింట్స్‌కీ చాలా ఖర్చౌతుంది కదండీ" అన్నాను నీర్సంగా.

"సరే కానీ అబ్బాయ్. వచ్చేనెల్లో మా తమ్ముడి కొడుకొకడు హైదరాబాదులో కాలేజీలో చేరదామనుకుంటున్నాడు. వాడొస్తే వాడికీ గదివ్వాలి. ఈ మహానగరంలో అద్దెకు గది దొరకడం కష్టమే మరి. నీకు ఎలానో ఏంటో పాపం" అన్నాడు.

"అవును గాని, ఈవేళ సాయంత్రం అందరూ ఇంటి దగ్గరే ఉంటారు కదా. ఫోటోలు తీస్తాను" అన్నాను పళ్ళు పటపట కొరుకుతూ.

"ఉంటాం బాబూ, అయినా నువ్వేం వర్రీ కాకు. వాడ్ని మరో చోట ఎక్కడైనా అద్దెకు ఉండమని చెప్తాలే" అన్నాడు.

ఆఫీసుకెళ్ళగానే మా ఆఫీసరుగారు కబురుపెట్టారు. ఆయన గదిలోకి వెళ్ళాను. ఆయన కూడా అదే కూత. "నీ దగ్గర ఇంపోర్టెడ్ కెమెరా ఉందని విన్నాను. రేపు నా మనవడి బారసాల. నువ్వొచ్చి ఫోటోలు తియ్యాలోయ్" అన్నాడు.

నేను ఇబ్బందిగా మొహంపెట్టి, చేతులు నలుపుకుంటూ, "హి హి హి" అన్నాను.

"నీకు వచ్చేనెల ఇంక్రిమెంటు డ్యూ అనుకుంటాను?" అన్నాడు కొంటెగా చూస్తూ.

"రేపే కదండీ. వస్తాను. అలాగే. హిహిహి, అలాగలాగే" అన్నాను. సీట్లో కూలబడి, టేబులుకేసి, కసిదీరా తల బాదుకున్నాను.

ఆరోజు రాత్రి ఎవ రో తలుపు తడితే లేచి తలుపు తీశాను. ఒకతను తిన్నగా గదిలోకి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"ఏంటిది?" అన్నాను గుడ్లు పెద్దవిచ్చేసి ఆశ్చర్యంగా చూస్తూ. నా ప్రశ్నకి సమాధానం చెప్పకుండా...

"నా డ్రెస్ ఎలా ఉంది?" అని ఎదురు ప్రశ్న వేశాడు. చిలకాకుపచ్చ పంట్లాం మీదకి ఎర్రచొక్కా వేసుకొని ఉన్నాడతను.

"ఏడ్చినట్టే ఉంది" అన్నాన్నేను.

"కానీ కలర్ ఫోటోకి ఇలా రంగురంగుల బట్టలేసుకుంటేనే బాగుంటుంది కదండీ?"

"కలర్ ఫోటోనా? ఇంతకీ నువ్వెవరు?" అడిగాను గజగజ వణికిపోతూ.

"మీ ఆఫీసరుగా రి మేనల్లుడ్ని. మీ దగ్గర కెమెరా ఉందని తెలిసి, నాలుగైదు ఫోటోలు తియ్యించుకుందామని వచ్చాను."

నేను తల పట్టుకొని కూలబడిపోయాను.

మర్నాడు నాగదికి కానిస్టేబుల్ వచ్చాడు. "మా సర్కిలినస్పెక్టర్ గారింట్లో ఫంక్షనేదో ఉందటండీ. సాయంత్రం కెమెరా పట్టుకొని రమ్మన్నారు మిమ్మల్ని! ఫోటోలు తియ్యాలంట" అన్నాడు.

"వీల్లేదు, ఈవేళ సాయంత్రం పనులున్నాయి నాకు" గట్టిగా అరిచాను నేను.

"అసలే మీదగ్గరున్నది ఇంపోర్టెడ్ కెమెరా. మీకే స్మగ్లర్తోనో సంబంధాలున్నాయని చెప్పి బొక్కలో తోసేస్తారండీ. తరవాత మీఇష్టం!" అని వెళ్లిపోయాడు కానిస్టేబుల్.

ఆ సాయంత్రం సర్కిలినస్పెక్టర్ ఇంటికి వెళ్ళడం తప్పలేదు.

పోలీసులతో మా ఇంటిముందు గొడవ అవడం మూలాన కాలనీలో అందరికీ నా దగ్గర ఇంపోర్టెడ్ కెమెరా ఉందని తెలిసిపోయింది. రోజూ ఎవడో ఒకడు ఫోటోలు తియ్యించుకోడానికి వస్తున్నాడు. నాకు రానురాను మనశ్శాంతి కరువయ్యింది. మొదట్లో ఎంతో ముద్దొచ్చిన ఆ కెమెరాని చూస్తుంటే ఇప్పుడు ఒళ్ళు మండిపోసాగింది.

చంచల్రావు సలహామీద దాన్ని యాదగిరికీ అమ్మెయ్యడానికి నిర్ణయించుకున్నాను. నేను చంచల్రావూ స్టూడియోకి వెళ్ళాం. "ఈ కెమెరాని నీకు అమ్మెయ్యమని అడిగావు కదా ఆరోజు, అమ్మేద్దామని నిర్ణయించుకొని వచ్చాను. ఏమిస్తావ్?" అడిగాను.

"రెండొందలిస్తా"

"ఏంటీ, రెండువందలా? ఈ కెమెరా రెండువేలు ఖరీదు చేస్తుంది తెలుసా?" అడిగాడు చంచల్రావు.

"ఆయనకి ఊరికినే వచ్చింది కద్సార్. అయినా దాంతో ఆయన గెట్ల బాద పడుతున్నడో నాకెరికైంది. అందుకే జాలిపడి కొంటున్నా" అన్నాడు యాదగిరి నన్నేదో పెద్ద ఉద్ధరిస్తున్నట్టు.

ఆ కెమెరాని వదిలించుకోవడమే నాకు ముఖ్యమనిపించింది. అందుకే, యాదగిరి చెప్పిన రేటుకే ఒప్పుకొని, రెండువందలకే దాన్ని అమ్మేశాను.

మర్నాడు ఆంధ్రా అంతా తిరిగి జేమ్స్ నా దగ్గరకొచ్చాడు. "ఈవేళ సాయంత్రం బొంబాయి వెళ్తున్నాను. రేపు అమెరికా ప్రయాణం" అన్నాడు.

సాయంత్రం జేమ్స్‌తో పాటు ఎయిర్పోర్టుకి వెళ్ళాను. చెకిన్ లోకి వెళ్ళేపాత ముందు తనిచ్చిన కెమెరా ఎలా ఉందని అడిగాడు జేమ్స్. అలా అడుగుతాడని ముందే ఊహించిన నేను, దానికి సమాధానం కూడా రడీగా పెట్టుకున్నాను.

"కెమెరా చాలా బాగుంది. రిజల్ట్స్ కూడా చాలా బాగా వస్తున్నాయి. కానీ, దురదృష్టం... మొన్న ఆఫీసుకి వెళ్లినప్పుడు నాగదిలో దొంగ పడి కెమెరా ఎత్తుకుపోయాడు. నాకు చాలా బాధ కలిగింది" అన్నాను విపరీతంగా బాధ నటిస్తూ.

"ఏం పర్లేదు, మీరు షానా మంచివాడు" అని, తన ఎయిర్బేగ్ జిప్పు సర్రుమని లాగి, ఇంకో కెమెరా తీసి నా చేతిలో పెట్టి "ఇది తీషోంండి. దానికంటే మంచి కెమెరా" అని గట్టిగా షేక్‌హేండ్ ఇచ్చి, అంతకన్నా గట్టిగా కౌగలించుకొని, "వష్తాను. లెటర్స్ రాయండి" అని చెప్పి, చరచరా వెళ్లిపోయాడు.

నాకు ఏడుపు వచ్చింది.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళేముందు నా గదికి ఒకాయన ఫామిలీతో వచ్చాడు.

ఎవరు కావాలని అడిగాను.


"ఇక్కడేదో ఫోటో స్టూడియో పెట్టారని చెప్పారు. ఫోటో తియ్యించుకుందామని వచ్చాం బాబూ" అన్నాడు.

నేను గట్టిగా కేకపెట్టి మూర్ఛ పోయాను.

*(ఆంధ్రప్రభ, సచిత్ర వారపత్రిక 27.03.1985 నుంచి పునర్ముద్రణ)*


## భారతి

*తెలుగు పత్రికలలో సాహిత్యానికి సంబంధించి చెప్పుకోదగ్గ పత్రికలలో మొదటగా చెప్పుకోవలసిన పత్రిక "భారతి". ముఖ్యంగా ఇరవయ్యవ శతాబ్దంలో ఈ పత్రిక ఓ ఒరవడిని సృష్టించింది. అమృతాంజనం సృష్టికర్త, ఆంధ్రపత్రిక స్థాపించిన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారే ఈ పత్రికను కూడా, జనవరి 1924లో ప్రారంభించారు. భాషా సాహిత్యానికి, పరిశోధనలకు ప్రాముఖ్యత ఇచ్చినా, ఈ పత్రికలో నాణ్యమైన కథలనీ, వ్యాసాలనీ కూడా ప్రచురించేవారు. మాసపత్రికగా వెలువడే ఈ పత్రిక తెలుగు సాహిత్యానికి ఓ "కొలమానం" గా ఈనాటికీ పేరుంది. ఈ పత్రికలో తమ రచనలు పడాలనీ, అదో గీటురాయిగా అలనాటి రచయిలందరూ భావించేవారు. అది సాధించడానికి బాగా కృషి చేసేవారు. ఈ పత్రిక ప్రారంభంలో గన్నవరపు సుబ్బరామయ్యగారు సంపాదకులుగా ఉండేవారు. నాగేశ్వరరావు పంతులుగారు నిర్వహణలో నడిచిన ఈ పత్రిక, వారి తర్వాత శివలెంక శంభుప్రసాద్ గారు, ఆ తర్వాత శివలెంక రాధాకృష్ణగారు ఆ బాధ్యతను చేపట్టి నడిపించారు. ఇక ఈ పత్రికలో చెరుకుపల్లి జమదగ్ని శర్మ, పురిపండా అప్పలస్వామి, బెజవాడ గోపాలరెడ్డి, గుర్రం జాషువా, తాపీ ధర్మారావు, శ్రీశ్రీ, అవంత్స సోమసుందర్, మధురాంతకం రాజారాం, కొమ్మూరి వేణుగోపాలరావు, కే.వి. రమణారెడ్డి, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, పులికంటి కృష్ణారెడ్డి, గొల్లపూడి మారుతీరావు, అంగర వెంకట కృష్ణారావు వంటి ఎందరో ప్రముఖుల రచనలు ప్రచురింపబడ్డాయి.*



*తెలుగు పత్రికా రంగంలో ఓ మణిహారంగా కొనియాడబడిన "భారతి" 1991 మార్చి సంచికే, ఆఖరి సంచిక అవటం తెలుగువారికి తీరనిలోటే అని చెప్పాలి.*

# రిక్షా అప్పారావు కొడుకు



ఎ.ఎస్.వి. రమణారావు

**కథా మార్గదర్శి కథ**

> *"నేను వృద్ధిలోకి రాలేదని యెవరనగలరు సార్? మా నాన్న మామూలు రిక్షా తొక్కాడు, నేను ఇంజిన్ రిక్షా తొక్కుతున్నాను. మా నాన్న స్వంతరిక్షా కొనుక్కుంటానంటే దేశం, సంఘం ఏ సాయం చెయ్యలేదు. నేను ఇంజిన్ రిక్షా కొనుకుంటానంటే జాతీయం చేయబడ్డ బ్యాంకు నాకు రెండువేలు అప్పిచ్చింది. ఇది ప్రగతి కాదని యెవరంటారు సార్?"*

నాకు నిజంగా గుర్తులేదు!

వారం రోజుల కిందటొచ్చాడు వాడు! నాకు తెలీని మనిషి కాదు ఎన్నోసార్లు యింటి నించి ఆఫీసుకీ, మార్కెట్ నించి ఇంటికీ నా మహాకాయాన్ని అవలీలగా వాడి రిక్షాలో మోసుకెళ్ళాడు.

వాడి పేరు అప్పారావు, "అప్పిగా" అనే పిలుపు రెండోసారి నుంచి కూడానూ..

వాడి కొడుకు బి. కాం. ఫస్టు క్లాసులో పాసయ్యేడనీ, ఫలానా ఆఫీసులో నాలుగు ఉద్యోగాలు ఖాళీగా వున్నాయనీ, ఇంటర్వ్యూకి పంపే కేండిడేట్ల లిస్టులో వాడి పేరు ఉండేటట్టుగా చూస్తే చాలనీ, తరువాత తిప్పలు తనే పడతాననీ వొచ్చాడప్పు డప్పిగాడు.

నా చేతులో పనే!

అయినా సీనియారిటీ అదీ చూసే పంపేను. వీడేమీ డబ్బులిచ్చే రకం కాదు. ఆ మాత్రం దానికి రూలుకి వ్యతిరేకంగా వెళ్ళడమెందుకు?

మళ్ళీ వొచ్చాడు ఇప్పుడు..

డబ్బుగాని తెచ్చాడా? తెస్తే తీసుకోవాలా. అక్కర్లేదా అని ఆలోచించుకుంటూ వాణ్ణి వరండాలో నిలబెట్టి, హాల్లో అద్దం దగ్గర అనవసరంగా మూణ్ణిముషాలు నిలబడ్డాను.

డబ్బు తీసుకోకూడదని నిశ్చయానికొచ్చి యివతలి కొచ్చాను.

రెండు చేతులూ జోడించి నిలబడ్డాడు. అర నిమిషం పాటు ఆ రెండు చేతులూ వూడదియ్యనేలేదు. వినయంగా వొంగాడు.



"డబ్బు తేలేదన్నమాట" అనుకున్నాను.

పావుగంట పెట్టాడు క్లాసు.

ఏమిటిటా.

ఇంటర్వ్యూకి పిల్చేరుట వాడి కొడుకుని! అంతా బాగానే ఐందిట! అక్కడ ఆఫీసరు సిక్ అయితే మేనేజర్ సెలక్షన్ చేస్తున్నాట్ట. ఆయన్ని కూడా రిక్షాలో నన్ను లాగినట్టే ఊళ్ళో అనేక చోట్లకి అనేక సార్లు తన రిక్షాలో తిప్పాట్ట. అయినా నాలాగే ధర్మరాజట! అయితే ఆఫీసరు హాస్పిటల్లో వుంటూ ఒక కేసుకి స్ట్రాంగ్ రికమెండేష నున్నాది, అదిగాని పాటించకపోతే పీకలు పోతాయి సుమా అని కబురెట్టాట్ట.. హైదరాబాదు నుంచి హెడ్డాఫ్ ది డిపార్టుమెంటుగారి పి ఎస్.!

ఒకాయన వొచ్చి మరో వేకెన్సీ బుక్ చేసుకున్నాట్ట. మూడోది సాక్షాత్తూ ఆ శాఖ ఆమాత్యుల వారి మేనల్లుడికే యివ్వాలిట. నాలుగోది "ఓపెన్ కాంపిటిషన్" .. అదే,రిజర్వేషను లేనిదన్నమాట!

మొత్తం నాలుగు ఖాళీలకు నేను పంపిన కేండిడేట్లు ఇరవయ్యిద్దరు. ఈ ఒక్క ఖాళీకి పందొమ్మిది మంది అవుతున్నారు.

సెలక్షన్ సాధారణంగా ఆఫీసరుగారే చేస్తారుట. ఇంటర్వ్యూకి కేండిడేట్లను పంపమని రాశాక, మేం లిస్టు పంపాక, అతని జీపుకి ఏక్సిడెంటయి ఆస్పత్రిలో చేరి, నమ్మకమైనవాడూ, సీనియరూ, వయసు మళ్ళినవాడూ గదా అని, సెలక్షను మేనేజరుకి వదులుతున్నానని హెడ్డాఫీసుకి టెలిగ్రామిచ్చి, ఓకే తెప్పించి ఈ బాధ్యత మేనేజరు మీద వొదిలాట్ట.

రాకరాక సేంక్షన్ పవరు వచ్చింది కదాని ఆలోచించకండా టెండర్లు పిల్చే రకం కాదట ఆ మేనేజరు. "ఎక్క డేటి బెడిసిగొట్టేసినాదో గాని బాబయ్య, దరమరాజు నాంటి ఆ బాబు గూడా వెయ్యిరూపాయిల్దెమ్మంతండు." అన్నాడు అప్పిగాడు.

"ఎక్కడో బెత్తాయించి ఇచ్చి" అన్నాను. "ఈ రోజుల్లో వెయ్యి రూపాయలంటే ఏమీకాదు. నీ ప్రాణానికి అదో పెద్ద బరువైతే కావచ్చుగాని, రేపు నీ కొడుకు పన్లో చేరితే ఆ వెయ్యి రెండు నెలల్లో సంపాదించేస్తాడు" అన్నాను.

"తమరూ అనాగే అంతారా?" అన్నాడు అప్పిగాడు.

ఆ మాట కష్టంగా, బాధగా అన్లేదు వాడు. చిరునవ్వుతో అన్నాడు.

"నోకం అంతా అనాగే అంతన్నారు. మా కుర్ర నమిడీ కొడుకు మాత్రం నంచవిచ్చి నువ్వుద్దేగం కొంతే మాత్రం నా నందులో కెల్నంతే అని కూకున్నాడండి. ఓర్నంజికొడకా ఇప్పుడంతాలక్కా యింతేన్రా అంటే విని సెవి బెడతన్నాడు గాడు."

"వాడి కెందుకు తెలియనిచ్చావు ఇదంతా? గప్‌చిప్‌గా ఆ మేనేజరు గాడెవడికో డబ్బిట్టి గెళ్ళి ఇచ్చేసి అంతా నీ మహిమేన్రా వెధవా అని నీ కొడుక్కి చెప్పెయ్యాలి. అదీ పద్ధతి. ఆ మాత్రం తెలీదా?" అన్నాను.

అప్పిగాడు బుర్ర గోక్కున్నాడు. "అనాకుదర్నేదు బాబయ్యా", అని మళ్ళీ ఐదు నిమిషాలు మీటింగు పెట్టాడు.

దాని సారాంశ మేమిటయ్యా అంటే..

అప్పిగాడి దగ్గర వాడి మొహం, వాడికంత డబ్బెక్కడిది. రెక్కాడితేగాని డొక్కాడదు. ఈ కుర్రాడి తరవాత నలుగ్గులు పిల్లలు. విశాఖపట్నం గనక హార్బరంటూ వుంది గనక, హార్బరు బేరాలు వీడిక్కూడా కొన్నివున్నాయి గనక, రోజుకి పది రూపాయలు మిగుల్తాయి. అంతకెంత తక్కువయినా ఒక పూట పస్తే! అయితే–రిక్షా స్వంతం గనక అదమ్మేసి యెనిమిది వందలూ, ఇంకో సింహాచలంగాడి దగ్గర అప్పుగా రెండొందలూ కలిపి, వెయ్యి చేద్దామనుకున్నాడు. ఆ సింహాచలంగాడు రెండు వందలు అప్పిస్తాను గానీ, నాలుగు వందలిచ్చినట్టు కాయితం రాయాలి, ఆ కాయితం మీద నీ కొడుకు సంతకం వుండాలి, అని కండిషన్ పెట్టేట్టా! రిక్షాకి షాపుకారి దగ్గర వెల కట్టించుకొని, సింహాచలంగాడి దగ్గర కాయితం రాసుకుని, 'ఒరే అయ్యా దీనిమీద సంతకంట పెట్రా' అనీసరికి, తెలివైన వెధవ కదా, నిమిషాల మీద అన్నీ ఆరా తీసి వీడు చెప్పకపోయీసరికి తన్నినంత పని చేస్సేట్ట. దాంతో వీడి పెళ్ళాం వున్న సంగతంతా చెప్పేసి 'నాయనా యిదంతా నీకోసమేన్రా! యిందులో మీ అబ్బకి కలిసొచ్చేదేమీ లేదూ' అని బావురు మన్నాదిట. అప్పుడు రిక్షా అప్పిగాడి కొడుకు ఇలాంటి వ్యవహారీం ససేమిరా వీల్లేదనీ, నాన్న ముసిలాడై పోయి రిక్షా లాగడానికి సత్తువ చాలకపోతే, ఈ వుద్యోగం చేసే బదులు తనే ఆ రిక్షా లాగి కుటుంబాన్ని పోషిస్తాననీ. అంతేకాని ఇలాంటి వెధవ పని చేసి సంపాదించిన ఉద్యోగం తను చెయ్యననీ పేచీ పెట్టాట్టా!

"అయితే యిప్పుడేంటంటావు?" అన్నాను వాచీ చూసుకుని,

నాకు నిజంగానే అవతల బోల్డు పనున్నాది.

రిక్షా అప్పిగాడు మళ్ళా బుర్ర గోక్కున్నాడు. "ఎనాగో ఇంత రద్దు తమరే కాసినారు. ఈ కాస్త పున్నెం కూడా తమరే కట్టుకోండయ్యగారూ. ఆస్పటల్లో వున్న ఆఫీరుగారు తమురికి శానా జోసీయట కదా, ఆరి కాడ వొక మాటనిపించేత్తే ఆడికా పనిత్తారు. పన్లో జేరీజేరగానే రాత్తిరికి రాత్తిరి నాను రిచ్చా ఆమ్మేసి మరోక్కాడో మరోక్కాడో కడమా సొమ్ము బెత్తాయించి,

మేనేజరు బాబుకి యెయ్యిరూపాయలూ జమగట్టుకుంతానండి."

వాడి స్కీము నా కర్థం కాలేదు.

ఆఫీసరు చేత మేనేజరుకి రికమెండేషను చేయించడం, వెనక నించి మేనేజరుకి వెయ్యి రూపాయలూ జమ కట్టిడమూ అన్నమాట!

"అద్దము గాకపోదాని కింద టేటుంది బాబయ్యా, రేపు మా కుర్రగోణ్ణి తమర్దేగిరికి పంపుతాను. ఆడు రాఫోతే నానే నాక్కొత్తాను. వారి నమిడీ కొడకా మీ యయ్య నంచవించ్చి నీకుద్దేగం యేయించడం నేదురా, నానే మీ ఆపీసరుకి మీ కుటమానం గురించీ, నీ మంచిబుద్ధి గురుంచీ సెప్పినాను, యెల్లీ జావీనయిపోయి సక్కగ పన్జేసుకోరా అని సెప్తారు. ఆడెలిపోనిచ్చి మెనేజీరు బాబు తమరి దగ్గిరి రుజువు పరుత్తాను. ఆ బాబడిగిన సొమ్ము నానెగేసీననీ, సతెప్పెమాణకంగా యిచ్చేత్తానని తమురు నా గురుంచి పూసీ వుండండి బాబూ, అంతే నానడిగేది! ఇందల మాయనేదు మరమంలేదు. ఆడు ఫన్లో జావినయిన రాత్తిరే నాను రిచ్చా అమ్మి సొమ్ము జత పరిస్తాను బాబయ్యా, నా పిల్లలు సాచ్చి."

వాడి మాట నాకు నమ్మకమే.

కాని ఆ మేనేజరు గారెవరో నేననలు ఎరగను. ఎప్పుడో వొకటి రెండుమాట్లు ఫోన్లో మాట్లానంతే.

అయితే ముఖ పరిచయం లేదన్న కారణం చేత అప్పిగాడి కోరికని తోసి పుచ్చడానికి మనసొప్పలేదు. అప్పిగాడి కోసం నేనింకా ఎక్కువే చెయ్యగలను. ఆ మేనేజరు గారెవరో ఆయనక్కూడా కొందరు బంధువులూ, స్నేహితులూ వుంటారు కదా! వాళ్ళ పిల్లలకో, వాళ్ళకో ఏ ఆఫీసుకి కావాలంటే ఆ ఆఫీసుకి కాల్ లెటర్సు వొక యేడాదిపాటు యిచ్చీగలను. అది చెయ్యదా వెయ్యి రూపాయలు?

"లంచమే కాద్సార్! నాకు రికమెండేషను కూడా ఇష్టం లేదు. మా ఫాధర్ నాతో చెప్పిందేంటంటే మీరూ ఆ ఆఫీసర్ గారూ మంచి స్నేహితులని, ఆఫీసరుగారు యింటర్వ్యూ కండక్ట్ చెయ్యలేదు కదా. మేనేజర్‌గారు ఈ జాబ్‌కి నన్ను సెలక్ట్ చెయ్యడానికి ఆఫీసరుగారు చెప్తున్నారంటే యిది రికమెండేషనే కదాండి? మేం యింటర్వ్యూకి యిరవై మందొచ్చేం. అందరికీ చిన్న రాత పరీక్ష పెట్టేరు. దాంట్లో మార్కులు తీయమనండి, అయిపోయాక వోరల్ లో కొన్ని కొశ్చన్లడిగారండి. అవి, వాటి ఆన్సర్లు స్టెనోగారి చేత రికార్డు చేయించి టైప్ చేసి దాచారటండి. అది కూడా తీసి చూడమనండి! నా పెరఫార్మెన్సు బావుంటేనే నాకు జాబ్ యిమ్మనండి. నాకు రికమెండేషన్ తోను, లంచంతోను జాబ్ సంపాదించడం యిష్టం లేదు. అలాంటి జాబ్ మీద నాకు రెస్పెక్టుండదు. ఆ పని నేను చెయ్యలేను!" అన్నాడు రిక్షా అప్పిగాడి కొడుకు. వాడి పేరు నారాయణ..

నారాయణ యిచ్చిన వుపన్యాసంలో నాయకత్వ ధోరణి లేదు. అతని రూపం కనీసం స్టూడెంట్ లీడర్లాక్కూడా లేదు. అతనన్న మాటలు, ఆ కంఠస్వరం వింటే అందులో యెంత నిజాయితీ వుందో తెలుస్తుంది. అతను ఫార్ములా కోసం ఆ నీతులు చెప్పడం లేదని. మాట మాటా ఫీలై అన్నాడని నేను గ్రహించేను. మహా వ్యభిచారి కూడా చెరచలేని పతివ్రతలున్నట్లే, అనుభవం, ప్రపంచజ్ఞానం అనే ఆయుధాల్తో ఈ కుర్రవాణ్ణి నేను జయించలేనని తెలిసి పోయింది. అలాంటి పని చెయ్యడానికి నాకు సంకల్పమే కలగలేదు.

"ఆ లెక్కని నీకీ జాబే కాదు, అసలే జాబూ రాదు" అన్నాను.

"రాకపోతే పోనియ్యండి సార్. నేను నాలుగు బ్యాంకులకి అప్లయ్ చేశాను. రెండిట్లో పరీక్షలు రాశాను కూడా. ఆ నాలుగు బ్యాంకుల్లోనూ కూడా స్వయం ఉపాధి పథకం కింద నాకు ఋణం యిమ్మని వేరేవేరే స్కీము లిచ్చాను, ఎవడో ఒకడు నా శక్తిని గుర్తించి నాకు జీవనోపాధి కల్పించకపోడు అని నా నమ్మకం సార్."

"కాని నీ సిద్ధాంతాల మీద నువ్వు యెన్నాళ్ళో నిలబడలేవు బాబూ. ఏ బ్యాంకో నీకు అప్పిస్తుంది. నువ్వు వ్యాపారం చేస్తావు. లాభం వొచ్చినప్పుడు నీ స్టేట్ మెంటు చూసి యెక్కువ టాక్సులు వేస్తారు. నష్టం వొచ్చిందని నువ్వు మరుచటేడాది లెక్కలు చూపించినా అవి దొంగలెక్కలంటారు. అంచేత, మరీ టూమచ్ నిజాయితీ పనికిరాదు. ఆలోచించు!" అన్నాను.

"ఎందుకు పనికిరాదో, యెప్పుడు పనికిరాదో నేను అనుభవం మీద తెలుసుకోవచ్చు కదండి. అప్పుడెప్పుడో వర్షం వస్తుందని యిప్పట్నించీ గొడుగేసుకుని తిరగడం యెందుకు?"

"అదీ యిదీ వొకటికాదు. నీకు ఈ సిద్ధాంతాలంటూ యేర్పడ్డానికి కారణం అంతా నీ జీవితానుభవమేనా? దాంట్లో నీ టెక్స్ట్ బుక్కుల్లో చదివిందీ నీ లెక్చరర్స్ చెప్పిందీ లేదంటావా?"

"ఏమో సార్. మీ దగ్గర నేను అంత నిష్కర్షగా మాట్లాడలేకపోతున్నాను. అయినా ప్రస్తుతానికి మాత్రం ఇదేనండి నా నిర్ణయం! లంచం, రికమెండేషను లేకుండా వస్తే ఆ ఉద్యోగంలో చేరుతాను. లేకపోతే ఖాళీగానే వుంటాను."

"నువ్వు ఖాళీగా వుంటావు. కాని నీకు సజావుగా నువ్వనుకున్న పద్ధతిని ఉద్యోగం దొరికేలోగా మీ నాన్న ఖాళీ అయిపోతాడేమో ఆలోచించావా?"

"సెంటిమెంట్లు అడ్డం పెట్టి ఆర్గ్యుమెంట్లు చెయ్యకండి సార్" అని తర్జని చూపాడు నారాయణ.

అతనింత సేపూ నిలబడి మాట్లాడుతున్నాడు. నేను ఈజీ చేర్లో కూర్చున్నాను. నాకు అతన్ని చూసి యెంతో గౌరవం కలిగి తటాలున లేచాను. అతని వీపు మీద చెయ్యిపెట్టి "శభాష్" అన్నాను. చిరునవ్వు తెచ్చుకుని అన్నాను.

"నువ్వు నా పరీక్షకి నిలబడ్డావు. నిలబడతావో లేదోనని అనుమానించేను. నీవన్నీ వొట్టి స్టూడెంట్ లీడరు టైపు బింకాలేమో అనుకున్నాను. ఇప్పుడు నాకు నిజంగా సంతోషంగా ఉంది. అంచేత అసలు సంగతి చెప్పేస్తున్నాను. నేనిందాకే ఆ ఆఫీసు మేనేజరు గారికి ఫోన్ చేసి కనుక్కున్నాను నీ గురించి. యు డిడ్ యువర్ ఇంటర్వ్యూ వెల్ అండ్ బెటర్ దాన్ అదర్స్. అతను నిన్ను ఏ నిబంధనా లేకుండా సెలక్టు చేసేడు. దానికి నా కంగ్రాచులేషన్స్ నీకు" అని చెయ్యి కలిపాను. నా కళ్ళలోకి చూస్తూ యాంత్రికంగా చెయ్యిచ్చాడు.

"థాంక్యు సార్" అని కూడా అన్నాడు.

"రేపు నీకు ఆర్డర్ వస్తుంది. ఎల్లుండి మంచిది కాదు, రేపే జాయినై పో!" అన్నాను.

"రేపు నాకు ఆర్డరొస్తే రేపే జాయినైపోతాను. ఎల్లుండొస్తే ఎల్లుండే జాయినౌతాను. మనం చేసేదే మంచి. దానికి మంచి రోజంటూ కూడా వెతకాలా సార్" అంటూ వెళ్ళాడు.

అతన్ని దగా చేసినందుకు నాకు కష్టంగానే వుంది. కాని, రిక్షా అప్పిగాడు వాడి మీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. వాడి కొడుకు కలెక్టర్ అయిపోతాడని వాడికేం ఆశ లేదు. కాని తనలా రిక్షా లాక్కుండా, తనలా కమీషన్లు, పెర్సంటేజీలూ పంచభక్ష్య పరమాన్నాలనుకోకుండా, తనలా పూటబత్తెం పుల్లవెలుగూ కాకుండా, వాడి జీవితం వెళ్ళాలని అప్పిగాడి కోరిక. దానికి తగిన అర్హత నారాయణ సంపాదించుకొనేటందుకు వీలుగా అప్పిగాడు తన మనసునీ, శ్రమనీ సిద్ధం చేసివున్నాడు. కనక అప్పిగాడిది న్యాయమైన కోరిక, వెయ్యబద్దాలాడి వొక పెళ్ళి చెయ్యొచ్చునన్న మన నీతి శాస్త్రం ఒక అబద్దమాడి వొక కుర్రాణ్ణి, వాడి ద్వారా ఒక కుటుంబాన్ని ఆకలి నుంచి కాపాడ్డానికి ఒప్పుకోదా అని నేను ఈ అబద్ధానికి సమకట్టేను అంటే, నేనింకెప్పుడూ ఏ అబద్ధమూ ఆడలేదనీ, ఆడననీ కాదు. ఇందులో నా స్వార్థం లేదు కదా!

★★★

రెండు రోజులైంది.

పొద్దుటే ఎనిమిదిన్నరకి నేనాఫీసు కెళ్ళాలి. రిజిస్ట్రేషను కోసం రెన్యూవల్ కోసం కుర్రాళ్ళు మా ఆఫీసు దగ్గర, రోజూ వందల సంఖ్యలో (పోనీ వేల సంఖ్యలో) గుమికూడతారు. వాళ్ళు మా ఆఫీస్ వల్ల సంపాదించే ఉద్యోగాలెన్నో. ఇంటర్వ్యూ లెన్నో నాకు తెలుసు. దాంట్లో నేనేం చెయ్యలేను, అయితే నా దగ్గరుండే మెయిన్ కారిడర్ తాళం చెవి తీసుకెళ్ళేదాకా వాళ్ళు ఎండలో నుంచోవాలి. ఆఫీసు జవాను దగ్గర కూడా ఓ తాళం వుంటుంది. కాని వాడు పది గంటల దాకా రాడు. తొలిరోజు స్టాకుండిపోయిన ఫైళ్ళు. సెలక్షన్ కార్డులూ చూసి సరైన ఆర్డర్ వేయించేటందుకు ప్రశాంతంగా నిశ్శబ్దంగా పొద్దుటపూట ఓ గంట కూచుంటాన్నేను. ఆ గంటా కుర్రాళ్ళు (అమ్మాయిలూనూ) ఎండలో నుంచోకండా నేను కాయగలను,

ఆ పనిమీద నేనాఫీసుకెళ్ళే టైం అప్పిగాడికి తెలుసు. మా యింటి పక్కనే వున్న ఓ కాన్వెంటుకి నలుగురు పిల్లల్ని రిక్షాలో తెచ్చి ఆ రిక్షాని మా ఇంటెదురుగా పెడతాడు వాడు. ఈ రెండు రోజులూ వాడు రాలేదు. వాడు నా ఆస్థాన రిక్షావాడు కాదు. అంచేత వాడు రాలేదు కదా అని నా సభ ఆగిపోదు. సభ ఆగిపోదు కాని, అలా ఆఫీసు మేనేజరుగారికి నేను చెప్పాను, ఫలానా అప్పిగాడ్ని మీరెరిగున్నారు కదా, వాడి కొడుక్కి ఉద్యోగం యిచ్చే విషయంలో “యు కెన్ గో ఎ హెడ్” తరవాత నేనున్నాను మధ్యలో. మీకేం ఫరవాలేదు. వాడు జాయినయ్యేడని మీరు నాకు ఫోన్ చెయ్యండి. మిగతా విషయాలు ఆ రాత్రి మనం కలుసుకొని మాటాడదాం అని..!

ఆ ఫోను రాలేదు.

ఈ రిక్షా రాలేదు.

నా మాట ఆ మేనేజరు దగ్గర పెండింగులో వుండిపోయింది. నాకు అదేదో ముఖ్యమైన ఫైలు పెండింగుండి పోయినంత కష్టంగా వుంది. కాని ఏం చెయ్యడం? అప్పిగాడి ఎడ్రసు నాకు తెలీదు. తెలిసినా ‘నేనక్కడికి వెళ్ళలేకపోవచ్చును.

టిఫిన్ తిని, కాఫీ తాగి, చుట్ట వెలిగించుకుని గేటు దగ్గర నిలబడ్డాను, ఆలోచించుకుంటూనూ.

మొన్న అదెవడి రిక్షాలోనో వెళ్ళాను ఆఫీసుకి. వాడు తోవంతా సణుగుతూనే తొక్కేడు. ‘ఇద్దరు మణుసుల బరువున్నారు బాబూ రూపాయ్ యిత్తారా’ అని ఆఫీసు చేరేక నిలేశాడు.

నిన్న వాడు మళ్ళా వచ్చాడు. రానని చెయ్యి వూపేసి నించుండిపోయేను. ఎవడో పార్టీ వచ్చి ఆటోరిక్షా తెచ్చేను సార్, తమర్ని ఆఫీసు దగ్గర విడిచిపెడతాను దయచేయండి" అన్నాడు. మన్నించానా కోర్కెని!

ఇవాళ...

అసలు రిక్షా ఎక్కాలనిపించడం లేదు. ఎవడేనా పార్టీ కారు తెచ్చినా ఎక్కాలని లేదు.

సిటీ బస్సులో పోవాలనుంది. అంత చిరాగ్గా వుంది. ఈ అప్పిగాడి కొడుకు నారాయణ వ్యవహారం, ఆ మేనేజర్‌తో సంభాషణ ఏమైనట్టు ?

చుట్ట పారేసి బస్టాపుకి నడుస్తున్నాను.

గుడగుడమని చప్పుడు చేసుకుంటూ మోటార్ రిక్షావొచ్చి నా పక్కని ఆగింది.

"సార్! నమస్కారం సార్ " అన్నాడు రిక్షా అబ్బాయి యింజిన్ సీటు మీద నుంచి దిగి.

"నమస్కారం!" అని నడిచేస్తున్నాను. బస్సెక్కుదామన్న దృఢనిశ్చయంతో ధ్యానంతో పరధ్యాన్నుణ్ణై

"కూర్చోండి సార్! ఆఫీసుకి లాకెళ్ళిపోతాను" అన్నాడు.

వాడు నారాయణ.

బి కాం ఫస్ట్ క్లాస్:

"ఎక్కువ ఇవ్వద్దుసార్. మామూలుగా రూపాయే ఇవ్వండి సార్. రండి సార్" అని సీటు దుమ్ము దులిపాడు.

"నువ్వుటోయ్?" అన్నాను.

వాడి చిరునవ్వులో వంద దీపాలున్నాయి.

"మరేనండి. నేనేనండి."

"వాట్ హేపెన్డ్ టు యువర్ జాబ్" అన్నాను.

"ఇప్పుడింక ఇదే సార్ నా జాబ్! రండి సార్. "

నా చేతిలో బ్యాగు రిక్షాలో పెట్టాడు.

ఎక్కాను.

★★★

నారాయణతో నేనన్న మాటలు నిజమేనని అతను 'వెరిఫై' చేసి కనుక్కున్నాడు. కాని సెలక్షన్ విషయంలో ప్రోగ్రాం కొంచెం తారుమారైంది.

"నేనే వెధవ పనికి తయారుపడితే, నా కన్నా వెధవ పన్లు చేసేవాడు నాకు ష్యూర్టీ ఏమిటి? తెస్తే రడీ క్యాష్ తీసుకురా, లేకపోతే రేపు ఉదయానికి ఆర్డర్ యింకొకళ్ళ కిచ్చేస్తున్నాను" అని నిష్కర్షగా చెప్పారట ఆ మేనేజరుగారు.

కొడుకుతో చెప్పకండా అప్పిగాడు రిక్షా అమ్మి యెనిమిది వందలూ రాత్రి పదకొండు గంటల వేళకి పై రెండొందలూ అప్పు సంపాదించి యింత రాత్రప్పుడు ఆయనగార్ని లేపి ఇచ్చేదేమిటి, రేపు ఎలాగా రిక్షా పనిలేదు కదా తెల్లారగట్టేలేచి యిస్తే సరిపోదా అని డబ్బుతెచ్చి గుడిశలో పెట్టి నిద్దరోయాట్ట అప్పిగాడు.

అర్థరాత్రప్పుడు నారాయణకి మెలకువ వచ్చి బైటికొస్తే, రోజూ వుండవలసిన చోట రిక్షా లేదు. వాళ్ళమ్మని లేపి గట్టిగా గుంజేసరికి పాము చావ కండా కర్ర విరక్కండా ఏదో చెప్పిందటది.

దాంట్లోంచి సారాంశం లాగి, మళ్ళీ వో గంట పోయేక ఇంట్లో వెతికి, ఆ డబ్బు తీసేసుకుని నారాయణ ఇంట్లోంచి లేచిపోయాడుట.

ఒకానొక బ్యాంకు వాళ్ళు ఆ ఉదయం కలెక్టర్‌గార్ని ఆహ్వానించి, అంతకు మూడు నెలల క్రిందట రిజిస్టర్ చేయించుకున్న కొందరు దరఖాస్తుదార్లకి ఒక్కొక్కడి దగ్గరా వెయ్యేసి రూపాయలు కట్టించుకుని రెండేసి వేలకి బాండ్లు రాయించుకుని, ఆ రోజు కలెక్టర్‌గారి ద్వారా పంపిణీ చేయించిన ఇంజన్ రిక్షాలు మొత్తం ముప్పయ్యయిదుట!

రిజిస్ట్రేషను చేసుకుని డబ్బు కూడా సిద్ధం చేసుకున్న వాళ్ళలో నారాయణ ఒకడు.

ఆ విధంగా అతనికి నిన్న మధ్యాహ్నం మూడు గంటలకల్లా ఇంజన్ రిక్షా చేతి కొచ్చింది. ట్రెయినింగు సర్టిఫికేట్లు సరిచూసుకోడం అన్నీ అయేసరికి ఐదు, పొద్దున్నే డ్యూటీ కొచ్చేసి నన్ను డ్యూటీకి తీసుకెళ్తున్నాడన్నమాట!

★★★

"ఏదో విధంగా నువ్వు వృద్ధిలోకి రావాలని మీ నాన్న ఆరాటపడుతూ వుంటే నువ్విలా చైడం యేం బాగా లేదోయ్" అన్నాను, మా ఆఫీసు దగ్గర రిక్షా దిగి!

నారాయణ నా బ్యాగ్ పట్టుకుని నా వెనకాలే ఆఫీసులో కొస్తున్నాడు. "నేను వృద్ధిలోకి రాలేదని యెవరనగలరు సార్? మా నాన్న మామూలు రిక్షా తొక్కాడు, నేను ఇంజిన్ రిక్షా తొక్కుతున్నాను. మా నాన్న స్వంతరిక్షా కొనుక్కుంటానంటే దేశం, సంఘం ఏ సాయం చెయ్యలేదు. నేను ఇంజిన్ రిక్షా కొనుకుంటానంటే జాతీయం చేయబడ్డ బ్యాంకు నాకు రెండువేలు అప్పిచ్చింది. ఇది ప్రగతి కాదని యెవరంటారు సార్?"

"పోన్లే నీకేదైనా సెలక్షన్ వస్తే ఈ ఇంజిన్ రిక్షా మీ నాన్నకిచ్చేసి నువ్వు వుద్యోగంలో చేరుదువుగాని" అని. ప్రగతిపథంలో పయనిస్తున్న దేశం తరపున నన్ను నేను ఓదార్చుకున్నాను.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 11.05.1979 నుంచి పునర్ముద్రణ)*



రాజు మరణించె నొక తార రాలిపోయె
కవియు మరణించె నొక తార గగన మెక్కె
రాజు జీవించె రాతివిగ్రహము లందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు.

నవయుగ కవి చక్రవర్తి శ్రీ జాషువా సుకవులందరిని పై నాలుగు వాక్యాలతో ఘనంగా కీర్తించారు.

ప్రజల నాలుకల యందు జీవించే వారు సుకవులైతే, చక్కని ఇతివృత్తం, చిక్కని కథనం, సరళమైన భాష, వైవిధ్యమైన శిల్పంతో బహుముఖీనమైన కథలను వ్రాసి ప్రజలను జాగృతం చేసిన, చేస్తున కథకులను ఇలా ఎవరైనా కీర్తించారో లేదో నాకైతే ఎరుక లేదు.

కాని, గాత్రశుద్ధి గల కొద్దిమంది కళాకారులు ఆ కథలను పోడ్‌కాస్ట్ , లేక యూట్యూబ్ ద్వారా తమ గళంతో శ్రావ్యంగా వినిపించి వాటికి పునర్జీవనాన్ని ఇస్తున్నారు. అంతేకాదు, ఆ కథా రచయితలకు, రచయిత్రులకు ఎనలేని గుర్తింపును, గౌరవాన్ని తెచ్చిపెడుతున్నారు. జాషువగారి సుకవులకు ధీటుగా సుకథకులుగా కీర్తింపబడేలా చేస్తున్నారు.

కథలోని పాత్రలకనువుగా తమ గళంతో భావవిన్యాసాలు చేసి శ్రోతలను రంజింపచేస్తున్న ఈ కళాకారులను 'గళాకారులని' పేర్కొనడానకి వెనకాడనక్కర్లేదు.

ప్రజల నాలుకల యందు కాకపోయినా, కనీసం చెవిలో పడేలా ఈ 'గళాకారులు' చాలా కథలను తమ గళంతో వినిపించి, ఆ కథారచయితలను శ్రోతల జ్ఞాపకాలలో నిక్షిప్తం చేస్తున్నారు.

నవరసాలను భావస్ఫోరకంగా పలికించే 'గళాకారులను' ప్రోత్సహిస్తూ 'కథామంజరి' తాము ప్రచురించే ప్రతి కథను వినిపించేలా చేసి కథకులను సుకథకులుగా గుర్తించేందుకు చేస్తున్న కృషి మీ దృష్టికి వచ్చిందా?

